ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం 26.09.2024 | సంపుటి : 11 సంచిక : 76 | పేజీలు : 12 వెల: రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## చైనా ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం విజయవంతం



బీజింగ్(జనంసాక్షి): చైనా సైన్యం ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించినట్లు తొలిసారి బహిరంగ ప్రకటన చేసింది. బుధవారం ఉదయం పసిఫిక్ మహాసముద్రంలోని అంతర్జాతీయ జలాల్లోని లక్ష్యం పైకి దానిని ప్రయోగించినట్లు పేర్కొంది. ఇటీవల కాలంలో బీజింగ్ అణ్వాయుధాల సంఖ్యను గణనీయంగా

మిగతా 2లో..


## భారత్,అమెరికా బంధం మరింత బలోపేతం

శ్వేతసౌధం ప్రకటన



వాషింగ్టన్(జనంసాక్షి): భారత్‌తో తమ బంధం నానాటికి బలపడుతోందని అమెరికా వెల్లడించింది. శ్వేతసౌధం రెగ్యులర్ ప్రెస్ బ్రీఫింగ్స్‌లో భాగంగా ప్రధాని మోదీ, అధ్యక్షుడు బైడెన్

మిగతా 2లో..



## నైపుణ్య విప్లవానికి తెలంగాణ కేరాఫ్

### బ్యాంకింగ్ బీమా రంగంలో కొత్త కోర్సుల్ని ప్రారంభించిన సీఎం రేవంత్

- నాణ్యమైన విద్యను అందించడంలో కాలేజీలు విఫలం
- ప్రమాణాలు లేని కళాశాలల మూసివేతకు వెనకాడం
- స్కిల్ లేకుండా డిగ్రీ పట్టాలతో రోడ్డెక్కుతున్న విద్యార్థులు
- గంజాయికి బానిసలుగా..పెడ్లర్స్‌గా మారుతున్న యువత
- ఉద్యోగ,ఉపాధి అవకాశాల కోసం ప్రభుత్వం కృషి
- బీఎఫ్ఎస్ఐ స్కిల్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి

హైదరాబాద్(జనంసాక్షి):నాణ్యతలేని విద్యను బోధించే ఇంజనీరింగ్ కాలేజీల గుర్తింపును రద్దు చేయడంలో వెనకాడబోమని సిఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఇంజనీరింగ్ పట్టభద్రులకు సబ్జక్టుపై కనీస పరిజ్ఞానం కూడా లేకుండా పట్టా పుచ్చుకుని వస్తున్నారని అన్నారు. ఇలాంటి వారికి ఉద్యోగాలు దొరకడం లేదని అన్నారు. స్కిల్స్ లేకుండా వస్తున్న విద్యార్థుల కారణంగా వారు ఎక్కడా రాణించలేక పోతున్నారని అన్నారు. అందుకే యువతకు స్కిల్స్ నేర్పే క్రమంలో స్కిల్ వర్సిటీని ప్రారంభించామని అన్నారు. దీనికి మహింద్రా కంపెనీ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా అధినేతగా ఉంటారని అన్నారు. తెలంగాణ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలన్నదే తమ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు మాసబ్‌ట్యాంక్‌లో బీఎఫ్ఎస్ఐ స్కిల్ ప్రోగ్రామ్ ప్రారంభించి ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. తెలంగాణలో ఉన్న యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. విద్యా బుద్ధులు నేర్చిని ఉపాధి అవకాశాలతో

మిగతా 2లో..

## దసరాకు ఇందిరమ్మ కమిటీలు

విధివిధానాలు రూపొందించడి

పీఎంఏవై నుంచి గరిష్టంగా ఇళ్లు సాధించాలి

రాజీవ్ స్వగృహ ఇళ్లకు వేలం: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): దసరా పండుగ నాటికి ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. గ్రామ/ వార్డు, మండల/ పట్టణ, నియోజకవర్గ, జిల్లా స్థాయి కమిటీల ఏర్పాటుకు విధివిధినాలు ఒకట్రెండు రోజుల్లో రూపొందించాలని ముఖ్యమంత్రి సూచించారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు

మిగతా 2లో..

## నాలుగేళ్లలో పాలమూరు ప్రాజెక్టులన్నీ పూర్తిచేస్తాం

### 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తాం

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేస్తాం

గత ప్రభుత్వం పాలమూరు- రంగారెడ్డిపై వేలకోట్లు ఖర్చు చేసినా ఒక్క ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వలేదు

ఎత్తిపోతలకు కనీసం నీటి వాటాను సైతం సాధించలేకపోయారు

నిర్వాసితులకు పునరావాసం సైతం పూర్తిగా అందించాలి

ఉదండాపూర్ రిజర్వాయర్‌ను సందర్శించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



మహబూబ్‌నగర్ బ్యూరో (జనంసాక్షి): దశాబ్దాలుగా వెనుకబడి, వలసలకు పేరుగాంచిన ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులన్నింటిని ఈ శాసనసభ కాలంలోనే పూర్తి చేసి 12 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రాజెక్టుల పరిశీలన, సమీక్షల నిమిత్తం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఆర్థిక, నీటిపారుదల శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు, జిల్లా ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు పరిధిలోకి వచ్చే మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గం పరిధిలోని ఉదండాపూర్ రిజర్వాయర్ ను సందర్శించారు.ముందుగా ఉదండాపూర్ రిజర్వాయర్ పనులను తనిఖీ చేసిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని అన్ని ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలన్నదే ప్రభుత్వ ఏకైక లక్ష్యమని అన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఉదండాపూర్ రిజర్వాయర్ కింద ఆర్ అండ్ ఆర్ కు 45 కోట్ల రూపాయలను విడుదల చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా పరిధిలో చేపట్టిన పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, కల్వకుర్తి , భీమా, నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్ల తో పాటు, కోయిల్ సాగర్ ప్రాజెక్టులను నూటికి నూరు శాతం పూర్తి చేస్తామని మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో పాలమూరు- రంగారెడ్డి పై 27,500 కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఒక్క ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వలేదన్నారు. పైగా పాలమూరు- రంగారెడ్డికి నీటి వాటాను సైతం సాధించలేకపోయారని తెలిపారు. పాలమూరు -రంగారెడ్డి పూర్తయితే 12 లక్షల ఎకరాలకు

మిగతా 2లో..

## మూసీప్రక్షాళనకు సర్వం సిద్ధం

### నిర్వాసితులను ఆదుకునేందుకు రీ సర్వే

నదీ అభివృద్ధి ప్రాజెక్టులో కీలక ముందడుగు

అత్తాపూర్ వద్ద నదిలో నిర్మాణాల పరిశీలన

ప్రత్యేక కార్యాచరణను రూపొందించిన ప్రభుత్వం



హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్ మూసీ నది ప్రక్షాళనలో భాగంగా నదీ గర్భంలో నిర్మాణాలను తొలగించడానికి అధికారులు రంగంలోకి దిగారు. అర్హులైన నిర్వాసితులకు రెండు పడకల గదుల ఇళ్లను కేటాయించేందుకు మరోసారి క్షేత్ర స్థాయిలో రీ సర్వే చేస్తున్నారు. నదీ గర్భంలో ఉన్న నిర్మాణాలు, నివాసాల యజమానుల నుంచి ఇంటి పత్రాలు, ఆధార్ సహా ఇతర ముఖ్య వివరాలను సేకరిస్తున్నారు. ఆ వివరాల ఆధారంగా మూసీ నది నిర్వాసితులకు జీహెచ్ఎంసీ పరిధిలో రెండు పడకల గదుల ఇళ్లను కేటాయించనున్నారు. అంతేకాకుండా నివాసాలు కోల్పేయే పేదలకు పరిహారం చెల్లించాకే భూసేకరణ చేస్తామని, ఆ తర్వాతే నిర్మాణాలను కూల్చివేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ నది ప్రక్షాళలో కీలక అడుగు పడింది. నది అభివృద్ధిలో భాగంగా నివాసాలు కోల్పోయే వారికి పునరావాసం కల్పించేందుకు మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసింది.

మిగతా 2లో..

## హైడ్రాకు పెరిగిన బలగం

169మందిని కేటయిస్తూ ఉత్తర్వులు

హైదరాబాద్(జనంసాక్షి): చెరువులు, నాలాల పరిరక్షణెళి ధ్యేయంగా ఏర్పాటైన హైడ్రాకు సిబ్బందిని కేటాయిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 169 మందిని హైడ్రా

మిగతా 2లో..

## కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించాల్సిందే

### లేకుంటే పార్లమెంట్ వేదికగా యుద్ధం తప్పదు:రాహుల్ గాంధీ

జమ్మూ(జనంసాక్షి): ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత జమ్మూ కశ్మీరుకు బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రతిపత్తిని కల్పించని పక్షంలో పార్లమెంట్‌లో ఇండియా కూటమి తన పూర్తి బలాన్ని ప్రదర్శించడమేగాక ఆందోళన చేపడతుందని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రకటించారు. బుధవారం నాడిక్కడ పార్టీ అభ్యర్థుల తరఫున ఒక న్నికల ప్రచార సభలో రాహుల్ ప్రసంగిస్తూ 2019లో ఇదివరకటి రాష్టాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించిన సమయంలో

మిగతా 2లో..





## అవసరమైతే బుల్డోజర్లకు అడ్డుగా నిలబడతాం

హైడ్రాను అడ్డుకుంటాం

పేదల ఇళ్లను ఎలా కూలుస్తారు?:కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి): కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో విచక్షణారహితంగా నిరుపేదల ఇండ్లను కూల్చివేస్తున్న వైనంపై కేటీఆర్ ఫైర్ అయ్యారు. హైడ్రా కూల్చి వేతలతో ప్రభుత్వం అనాగరిక చర్యలకు పాల్పడుతున్నదని మండిపడ్డారు. చిన్న పిల్లలు పుస్తకాలు తీసుకుంటాం అంటే కూడా

మిగతా 2లో..



## తెలంగాణ పారిశ్రామిక వృద్ధిలో అమెరికన్ కంపెనీలు భాగస్వాములు కావాలి

ఫోర్త్ సిటీ నిర్మాణంలో, అభివృద్ధిలో పాలుపంచుకోండి

లాస్‌వెగాస్‌మైన్‌ఎక్స్‌పోలో డిప్యూటీసీఎం భట్టి

వార్త 2లో




2లో

## తెలంగాణలో రెండ్రోజులు భారీ వర్షాలు

## ఆర్థిక క్రమశిక్షణ వైఫల్యానికి బాధ్యులెవరు?

### అకౌంట్స్ అధికారులను ప్రశ్నించిన కమిషన్



హైదరాబాద్(జనంసాక్షి):కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ఆర్థిక స్థోమత, క్రమశిక్షణ వైఫల్యానికి ఎవరు బాధ్యత వహిస్తారని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్.. అధికారులను ప్రశ్నించింది.కమిషన్ ముందు కాళేశ్వరం కార్పొరేషన్ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ వెంకట అప్పారావు, చీఫ్ అకౌంట్ ఆఫీసర్ పద్మావతి, డైరెక్ట్ ఆఫ్ వర్క్స్ అకౌంట్ చీఫ్

మిగతా 2లో..

## మొస్సాద్ హెడ్‌క్వార్టర్ లక్ష్యంగా హెజ్‌బొల్లా క్షిపణి దాడి



జెరుసలెం(జనంసాక్షి):ఇజ్రాయెల్ రాజధాని టెల్‌అవీవ్‌లోని మొస్సాద్ ప్రధాన కార్యాలయం లక్ష్యంగా హెజ్‌బొల్లా ఖాదర్-1 క్షిపణిని ప్రయోగించింది. ఈవిషయాన్ని ఆ సంస్థే స్వయంగా ప్రకటించింది.తమ సంస్థ కమాండర్లపై దాడికి, ఇటీవల పేజర్లు, వాకీటాకీల పేల్చివేతలకు ప్రతీకారంగా ఈ దాడి చేసినట్లు వెల్లడించింది. మరోవైపు ఈ క్షిపణి లెబనాన్ గగనతలం దాటగానే మార్గమధ్యలోనే తమ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ అడ్డుకొన్నట్లు ఇజ్రాయెల్

మిగతా 2లో..

## హరియాణాలో భాజపా పుంజుకుంటోంది

### ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ



చండీగఢ్(జనంసాక్షి): హరియాణాలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో భారతీయ జనతా పార్టీకు ప్రజల మద్దతు పెరుగుతోం దని పేర్కొన్నారు.దీంతో కాంగ్రెస్‌కు ఆశలు సన్నగిల్లుతున్నాయన్నారు. కాంగ్రెస్ ఎక్కడ అధికారంలో ఉన్నా..బంధుప్రీతి స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. దేశంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయం లోనే ప్రభుత్వ వ్యవస్థలో అవినీతి పురుడుపోసుకుందని దుయ్యబట్టారు. ఆ పార్టీ హరియాణాను వారి వారసులకు, మధ్యవర్తులకు అప్పగించిందని మండిపడ్డారు.ప్రస్తుతం భాజపా ప్రభుత్వ హయాంలో వ్యవసాయ, పరిశ్రమల రంగాల్లో దేశం అగ్రస్థానంలో ఉందని ప్రధాని పేర్కొన్నారు. పారిశ్రామిక వృద్ధితోనే దళితులు, పేదల సాధికారత

మిగతా 2లో..

## హరియాణా రైతులకిచ్చిన హామీల అమలేది?

### ప్రధాని మోదీకి కాంగ్రెస్ ప్రశ్నలు



చండీగఢ్(జనంసాక్షి): త్వరలో హరియాణా లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈనేపథ్యంలోనే కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వంపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. మోదీ సర్కార్‌పై హరియాణా ప్రజలు నమ్మకం కోల్పోయారని ఆరోపించింది. మూడు వ్యవసాయ సాగుచట్టాల రద్దు తర్వాత కేంద్రం ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించింది.ఎన్నికల నేపథ్యంలో హరియాణాలో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఈనేపథ్యంలోనే ఆయనపై కాంగ్రెస్ ప్రశ్నల వర్షం కురిపించింది. రైతుల జీవనంపై భాజపాకు ఉన్న విజన్‌ను వివరించాలని ప్రధానిని డిమాండ్ చేసింది. "2021లో వ్యవసాయ సాగుచట్టాలు రద్దు చేసిన తర్వాత కేంద్రం రైతులకు ఇచ్చిన హామీలు ఎటు పోయాయి..? వారి డిమాండ్లు తీరుస్తామని ఎక్కడికి వెళ్లారు..? మోదీ సర్కార్‌పై హరియాణా రైతులు పూర్తిగా నమ్మకం కోల్పోయారు" అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జైరాం రమేశ్ విమర్శించారు.

మిగతా 2లో..

## కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించాల్సిందే

జమ్మూ కశ్మీరు ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. జమ్మూ కశ్మీరుకు రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరించాలన్న తన డిమాండును ఆయన పునరుద్ఘాటిస్తూ రాష్ట్ర హోదాను లాగేసుకుని ఒక రాష్ట్రాన్ని కేంద్ర పాలిత ప్రాంతాలుగా మార్చడం భారతదేశ చరిత్రలో ఎన్నడూ సంభవించలేదని అన్నారు.అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్ర హోదాను కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరించని పక్షంలో పార్లమెంట్ ఉభయ సభలలో తమ ఇండియా కూటమి పూర్తి బలాన్ని ఉపయోగిస్తుందని, అవసరమైతే రోడ్లపైకి వస్తామని ఆయన హామీ ఇచ్చారు. లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా బయటి వ్యక్తులకు లబ్ధి చేకూర్చేందుకే జమ్మూ కశ్మీరు నుంచి రాష్ట్ర హోదాను లాగివేశారని ఆయన ఆరోపించారు. లెఫ్టినెంట్ గవర్నర్ ఉన్నంత వరకు బయటి వ్యక్తులు లబ్ధి పొందుతారని, స్థానికులను పక్కనపెడతారని రాహుల్ వ్యాఖ్యానించారు. జమ్మూ కశ్మీరును స్థానికులకు బదులుగా బయటి వ్యక్తులు నడిపించాలన్నది కేంద్రంలోని బిజెపి ఆలోచనగా ఆయన అభివర్ణించారు. రాష్ట్ర హోదా పునరుద్ధరణ మీ హక్కు. మీ భవిష్యతు..అది లేకుండా జమ్మూ కశ్మీరు అభివృద్ధి సాధించలేదు అని రాహుల్ తెలిపారు. దేశంలోని మిగిలిన ప్రాంతాలలో చిన్న, మధ్యతరహా వ్యాపారాలపై ఒక క్రమపద్ధతిలో దాడి జరుగుతోందని ఆయన తెలిపారు. ఈ ప్రభుత్వం అంబానీ, అదానీల కోసం పనిచేస్తోందని, వారికి మార్గాన్ని సుగమం చేసేందుకు జిఎస్‌టి, పెద్ద నోట్ల రద్దును ఆయుధాలుగా కేంద్రం ఉపయోగించిందని ఆయన ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన మేక్ ఇన్ ఇండియా కార్యక్రమాన్ని మేక్ ఇన్ అదానీ కార్యక్రమంగా ఆయన అభివర్ణించారు. ఈ విధానం కింద అన్ని కాంట్రాక్టులను అదానీ కంపెనీకి కట్టబెడుతున్నారని రాహుల్ ఆరోపించారు. జమ్మూ కశీరుకు కేంద్ర స్థానమైన జమ్మూ వెన్నెముకను బిజెపి ప్రభుత్వం, లెఫ్టినెంట్ గవర్నర్ విరగ్గొడుతున్నారని ఆయన ఆరోపించారు.

## తెలంగాణలో రెండ్రోజులు భారీ వర్షాలు

**హైదరాబాద్(జనంసాక్షి):** ఉత్తర తెలంగాణలోని 14 జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాముందని వాతావరణశాఖ వెల్లడించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, జనగాం, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. గురువారం ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కామారెడ్డి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు వచ్చే అవకాశముందని వాతావరణశాఖ పేర్కొంది.

## ఆర్థిక క్రమశిక్షణ వైఫల్యానికి బాధ్యులెవరు?

ఫణిభూషణ్ శర్మ బుధవారం హాజరయ్యారు. గతంలో దాఖలు చేసిన అఫిడవిట్ల ఆధారంగా కమిషన్ వారిని ప్రశ్నించింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు నిధుల సేకరణ, బిల్లుల చెల్లింపు తదితర అంశాలపై ప్రశ్నించిన జస్టిస్ పీసీ ఘోష్.. కాళేశ్వరం కార్పొరేషన్ ఏర్పాటు, సిబ్బంది, ఉద్యోగుల జీతాలు, చెల్లింపులపై ఆరా తీశారు.కార్పొరేషన్ ద్వారా రుణాలు తీసుకొని బిల్లులు వెంటనే చెల్లించకుండా బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినట్లు వెంకట అప్పారావు కమిషన్‌కు తెలిపారు. ఫిక్స్‌డ్ డిపాజిట్ ద్వారా వచ్చిన మొత్తాన్ని కార్పొరేషన్ నిర్వహణ కోసం వాడినట్లు చెప్పారు. కార్పొరేషన్ ట్రేడింగ్ బ్యాలెన్స్ అకౌంట్స్ ప్రతి సంవత్సరం తనిఖీ చేస్తారా? రుణాలు ఎవరి ఆదేశాల మేరకు తీసుకున్నారని కమిషన్ ప్రశ్నించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాలు, కార్పొరేషన్ బోర్డు ఆమోదం తర్వాత రుణాలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. రుణాలు తీసుకున్న తర్వాత కార్పొరేషన్‌కు ఏమైనా ఆస్తులు వచ్చాయా? అని కమిషన్ ప్రశ్నించగా.. ప్రస్తుతం ఎలాంటి ఆదాయం లేదని, ఆస్తులు రాలేదని అధికారులు బదులిచ్చారు. బిల్లుల చెల్లింపుల నిబంధనల ప్రకారమే జరిగాయని చెప్పారు.కాగ్ నివేదిక గురించి అకౌంట్స్ అధికారులను జస్టిస్ పీసీ ఘోష్ ప్రశ్నలు అడిగారు. కాళేశ్వరం ప్రాజెక్టు బిల్లుల చెల్లింపు విషయంలో కాగ్ నివేదికతో అంగీకరిస్తారా? అని అడగ్గా.. ఆడిట్ రిపోర్ట్ ఆధారంగా కాగ్ నివేదిక ఇచ్చిందని అధికారులు తెలిపారు. ఆర్థిక స్థోమత, క్రమశిక్షణా వైఫల్యం విషయంలో తాము స్పందించలేమని చెప్పారు. చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ పద్మావతి కమిషన్ అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా దాటవేశారు. పలు ప్రశ్నలకు తనకు సంబంధం లేదు, తెలియదు, చెప్పలేను అని సమాధానం ఇచ్చారు. చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్‌గా ఉండి తెలియదంటే ఎలా? ఖజానాపై అంత భారం పడుతుంటే పట్టింపు లేదా అంటూ ఆమెపై కమిషన్ అసహనం వ్యక్తం చేసింది.



# నైపుణ్యవిప్లవానికి తెలంగాణ కేరాఫ్

పేరు తీసుకురావాల్సిన యువత పక్కదారి పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి, ఇతర డ్రగ్స్ మత్తులో ఊగుతోందని ఆందోళన చెందారు. డ్రగ్స్ కల్చర్ చాలా ప్రమాదకరంగా మారుతోందన్నారు రేవంత్. ముఖ్యంగా బీటెక్ విద్యార్థులు ఈ డ్రగ్స్ బారిన ఎక్కువ పడుతున్నారని ఇది మరింత ఆందోళనకరమన్నారు. వారు డ్రగ్స్ వాడటమే కాకుండా పెడ్లర్స్‌లా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి వారిని పోలీసులు ఎప్పటికప్పుడు పట్టుకొని కౌన్సిలింగ్ ఇవ్వడం చేస్తున్నారని అన్నారు. లా ఇంజినీరింగ్ విద్యార్థులు డ్రగ్స్ బారిన పడటానికి కాలేజీలు కూడా ఓ కారణమని ఆరోపించారు. విద్యాబోధన సరిగా లేకపోవడం, కాలేజీలో పట్టించుకునే వాళ్లు లేకపోవడంతో ఇలాంటి పరిస్థితి వస్తోందని అన్నారు. అందుకే కచ్చితంగా వీటిపై దృష్టి పెట్టాలని కాలేజీలకు సూచించారు. విద్యాబోధనపై దృష్టి పెట్టకుంటే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. అవసరమైతే కాలేజీ గుర్తింపు కూడా రద్దు చేసేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. ప్రభుత్వం తరపున యువతకు ఎన్ని విధాలుగా సాయం చేయాలో అన్ని విధాలుగా సాయం చేస్తున్నామని వాటిని అందిపుచ్చుకొని ఎదగాలని సీఎం సూచించారు. ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తూనే ప్రైవేటు పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు కల్పించే ఏర్పాట్లు కూడా చేస్తున్నామని తెలిపారు. ఎలాంటి కోర్సులు చదవాలి ఏ విభాగంలో స్కిల్ డెవలప్‌మెంట్ చేయాలో కూడా పరిశ్రమలతో చర్చిస్తున్నామన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను గుర్తించి అన్ని శాఖల్లో భర్తీ ప్రక్రియ చేపట్టామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. మాసబ్‌ట్యాంక్‌లో బీఎఫ్‌ఎస్‌ఐ స్కిల్ ప్రోగ్రామ్‌ను సీఎం, మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులకు బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ (బీఎఫ్‌ఎస్‌ఐ) రంగాల్లో ఉద్యోగాలను కల్పించడమే లక్ష్యంగా వినూత్న కోర్సుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా స్కిల్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేసినా రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పోదు. దీని తీవ్రతను మా ప్రభుత్వం గుర్తించింది. ఏటా 3లక్షల మంది పట్టాలు తీసుకుని బయటకు వస్తున్నారు. ఉపాధి అవకాశాలపై పరిశ్రమల యాజమాన్యాలతో మాట్లాడాం. ఎలాంటి కోర్సులు చదివిన వారు కావాలని వారిని అడుగుతున్నాం. నిరుద్యోగ యువత డిమాండ్-సప్లయ్ సూత్రం గుర్తుంచుకోవాలి. డిగ్రీ చదివేవారు భవిష్యత్తు దిశగా ఆలోచించాలి. కొందరు విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్చుకోవడం లేదు. బ్యాంకులు, బీమా రంగాల్లో ఎక్కువ ఉద్యోగాలు ఉన్నాయి. నాయకుడిగా రాణించాలన్నా నైపుణ్యం ఉండాలి. ఉద్యోగాలు, ఉపాధి లేకుంటే చెడు వ్యసనాల వైపు వెళ్లే ప్రమాదం ఉంది. బీటెక్ చదివిన వారు కూడా డ్రగ్స్ విష వలయంలో చిక్కుకుంటున్నారు. ఈ సమస్య నిర్మూలనకు కార్యక్రమం చేపట్టాం. ప్రభుత్వం ఒక్కటే దీన్ని పరిష్కరించలేదు. అందరూ కలిస్తేనే డ్రగ్స్ నిర్మూలన సాధ్యం. మారుతున్న కాలానికి అనుగుణంగా మారాలి. మన విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడాలని రేవంత్‌రెడ్డి అన్నారు.ఇంజినీరింగ్ విద్యార్థులు జాబ్ స్కిల్స్ నేర్చుకోవడం లేదు. కొన్ని కళాశాలల్లో అధ్యాపకులు, వసతులు ఉండటం లేదు. కళాశాలలు ఇలాగే కొనసాగితే గుర్తింపు రద్దు చేసేందుకు వెనుకాడం. త్వరలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేస్తాం. టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో 30లక్షల మంది నమోదు చేసుకున్నారు. రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల తర్వాత కూడా 60లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 90 రోజుల్లోనే 30వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు.

## దసరాకు ఇందిరమ్మ కమిటీలు

దక్కాలని ముఖ్యమంత్రి అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన నుంచి ఇతర రాష్ట్రాలు లక్షల సంఖ్యలో గృహాలు మంజూరు చేయించుకుంటే ఈ విషయంలో తెలంగాణ వెనుకబడి ఉందని, ఈ దఫా కేంద్రం మంజూరు చేసే గృహాల్లో గరిష్ట సంఖ్యలో రాష్ట్రానికి ఇళ్లు సాధించేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పీఎంఏవై కింద రాష్ట్రానికి రావల్సిన బకాయిలు రాబట్టాలని సీఎం సూచించారు. కేంద్ర ప్రభుత్వానికి ఇవ్వాల్సిన సమాచారం వెంటనే ఇవ్వాలని, ఇందిరమ్మ ఇళ్ల విషయంలో డాటాను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సీఎం అన్నారు. పెద్ద సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభిస్తే ఇంజినీరింగ్ సిబ్బంది సమస్య ఎదురయ్యే పరిస్థితి ఉంటుందని అధికారులు తెలపగా... అవసరమైతే ఔట్‌సోర్సింగ్ పద్ధతిన నియామకాలు చేపట్టాలని ముఖ్యమంత్రి అన్నారు. రాజీవ్ స్వగృహలో నిర్మించి నిరుపయోగంగా ఉన్న బ్లాక్‌లు, ఇళ్లు వేలం వేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఏళ్ల తరబడి వృథాగా ఉంచడం సరికాదని, వెంటనే వేలానికి రంగం సిద్ధం చేయాలన్నారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తయినా వాటిని ఎందుకు అప్పగించలేదని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. అర్హులకు ఆ ఇళ్లను అప్పగించాలన్నారు. హైదరాబాద్ నగరంలో నిర్మించి నిరుపయోగంగా ఉన్న బ్లాక్‌లకు మౌలిక వసతులు కల్పించి, వాటికి అర్హులైన లబ్ధిదారులకు అప్పగించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాష్, తెలంగాణ గృహ నిర్మాణ సంస్థ ఎండీ వి.పి.గౌతమ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## హైడ్రాకు పెరిగిన బలగం

కోసం కేటాయించింది. ఇందులో సీఐ, ఎస్ఐ స్థాయి అధికారులు కూడా ఉన్నారు. హైడ్రా బుల్డోజర్లు మూసీ వైపు దూసుకెళ్లనున్నాయి. ఈ వారాంతంలో మూసీ ఆక్రమణల కూల్చివేతలపై హైడ్రా ఫోకస్ పెట్టింది. శని, ఆదివారాల్లో భారీగా మూసీ ఆక్రమణలను కూల్చివేయనున్నట్టు తెలుస్తోంది. ఆ రెండు రోజుల్లో కూల్చివేత లు పూర్తి చేసేలా హైడ్రా టార్గెట్ నిర్దేశించుకుంది. డే అండ్ నైట్ కూల్చివేతలు చేసేలా హైడ్రాకు అదనంగా సిబ్బందిని ఏర్పాటు చేశారు. గోల్నాక, చాదర్‌ఘాట్, మూసారంబాగ్.. మూసి ఆక్రమణల కూల్చివేతలకు రంగం సిద్ధమైంది.

## భారత్,అమెరికా బంధం మరింత బలోపేతం

హయాంలో భారత్-అమెరికా సంబంధాలు ఏ దిశలో ప్రయాణించాయని పీటీఐ ప్రశ్నించింది.దీనికి నేషనల్ సెక్యూరిటీ కమ్యూనికేషన్ అడ్వైజర్ జాన్ కిర్బీ స్పందిస్తూ.. "సంక్షిప్తంగా మా బంధం గురించి చెప్పాలంటే 'బలంగా ఉంది.. మరింత బలపడుతోంది" అని వ్యాఖ్యానించారు.భారత్‌తో మా ద్వైపాక్షిక బంధం పటిష్టం కావడానికి బైడెన్ ఎంతో కృషి చేశారన్నారు. మా వ్యూహాత్మక బంధాన్ని గత క్వాడ్ సమావేశం సందర్భంగా అత్యున్నత స్థాయికి తీసుకెళ్లామని గుర్తుచేశారు. భారత్‌తో మేం రక్షణ రంగంలోని వివిధ అంశాల్లో సంబంధాలను ఏర్పర్చుకోవాలనుకుంటున్నట్లు తెలిపారు.

## మొస్సాద్ హెడ్‌క్వార్టర్ లక్ష్యంగా హెజ్‌బొల్లా క్షిపణి దాడి

దళాలు ప్రకటించాయి. అదే సమయంలో సీ ఆఫ్ గలీల్ దిశగా తమ భూభాగంలోకి ప్రవేశించిన డ్రోన్లను కూడా కూల్చివేశామని వెల్లడించింది. వీటిని ఇరాక్, సిరియా గగనతలం నుంచి ప్రయోగించినట్లు వెల్లడించారు.బుధవారం ఉదయం కూడా హెజ్‌బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగాయి. ఈనేపథ్యంలో ప్రధాని బెంజమన్ నెతన్యాహు న్యూయార్క్ పర్యటనలో మరోసారి జాప్యం చోటుచేసుకొంది. "లెబనాన్‌పై దాడుల నేపథ్యంలో ప్రధాని నేడు భద్రతా వర్గాలతో చర్చలు జరుపుతారు" అని నెతన్యాహూ కార్యాలయం పేర్కొంది.మరోవైపు హెజ్‌బొల్లా మిసైల్ యూనిట్ కమాండర్ ఇబ్రహీం ఖుబైసీ మరణించినట్లు ధ్రువీకరించింది.

## అవసరమైతే బుల్డోజర్లకు అడ్డుగా నిలబడతాం

సమయం ఇవ్వకుండా అధికారులు మెడలు పట్టి బైటికి నెట్టేయడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. చిన్న పిల్లల కళ్లముందే వాళ్ల తల్లిదండ్రులు పెట్రోల్ పోసుకుంటే.. వేదశ్రీ అనే చిన్న పాప ఆ బాధను చెప్తుంటే మనసున్న ప్రతి ఒక్కరిని ఆ సంఘటన కలిచివేసిందన్నారు. కస్తూరిబాయి అనే మహిళ చెప్పుల దుకాణాన్ని బుల్డోజర్‌తో తీసి పారవేయటం అనేది మానవత్వం ఉన్న సర్కారు చేయాల్సిన పనేనా? అని ప్రశ్నించారు. సామాన్లు తీసుకుంటా అంటే కనీసం గర్భిణిలకు కూడా సమయం ఇవ్వారా? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఒక్కటే అడుగుతున్న. ఈ ప్రభుత్వా నికి కనీసం మానవత్వం లేదా? అని సూటిగా నిలదీశారు. హైడ్రా బాధితులకు ఎవరికి ఏ ఇబ్బంది ఉన్నా తెలంగాణ భవన్‌కు రండి. న్యాయపరంగా, మీకు మేము అండగా నిలుస్తం. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, లీగల్ సెల్ మీకు పూర్తి అండగా నిలుస్తుందని హైడ్రా బాధితులకు భరోసా నిచ్చారు. లక్షలు వెచ్చించి రిజిస్ట్రేషన్లు చేయించుకున్న వారి గతేంటని అన్నారు. ప్రభుత్వానికి ఆదాయం కూడా వచ్చిందన్నారు. దీనికి సిఎం సమాధానం చెప్పాలన్నారు. అనుమతులు ఇచ్చిన అధికారులను వదిలి ప్రజలమీద పడడం సబబు కాదన్నారు. మూసీ సుందరీకరణ పేరుతో కుంభకోణం జరుగుతోందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు.

# నాలుగేళ్లలో పాలమూరు ప్రాజెక్టులన్నీ పూర్తిచేస్తాం



సాగునీరు అందించవచ్చని, ఇదే చిత్తశుద్ధితో ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని, ఈ శాసనసభ కాలంలోనే పాలమూరు- రంగారెడ్డిని పూర్తి చేసి 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు . గత ప్రభుత్వం చేపట్టిన కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్, నెట్టెంపాడు, బీమా ప్రాజెక్టులను సైతం నూటికి నూరు శాతం పూర్తి చేస్తామని, ఇందుకుగాను ఒక సమయాన్ని నిర్దేశించుకుని ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ఉదండాపూర్ తో పాటు, ఇతర రిజర్వాయర్లలో ముంపునకు గురైన వారికి న్యాయపరంగా పున రావాసం అందిస్తామని, వీటన్నిటిపై సమీక్షించేందుకు ఉమ్మడి పాలమూరు జిల్లా పర్యటన చేపట్టినట్లు మంత్రి వెల్లడించారు.అనంతరం నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ ఉదండపూర్ రిజర్వాయర్ కింద ఆర్ అండ్ ఆర్ కు 45 కోట్ల రూపాయలు విడుదల చేయటం పట్ల మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. గతంలో ఆర్ అండ్ ఆర్ లో భూ సేకరణకు సంబంధించి పెండింగ్లో ఉన్న మూడు కోట్ల 74 లక్షలు, అలాగే ఆర్ అండ్ ఆర్ కు సంబంధించి పెండింగ్లో ఉన్న 2.6 కోట్ల రూపాయలు ,ఉదండాపూర్ లోని నిర్మాణాలకు 13 కోట్ల రూపాయలు పెండింగ్ ఉన్నాయని , వాటిని చెల్లించాలని , అలాగే అవార్డులకు సంబంధించి అదనంగా అవసరమైన బడ్జెట్ ను కేటాయించాలని ఆయన మంత్రికి విజ్ఞప్తి చేశారు . తమ ప్రభుత్వం పూర్తిగా రైతు ప్రభుత్వం అని, అందుకే రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేసినట్లు ఆయన తెలిపారు.ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన జడ్చర్ల శాసనసభ్యులు జె.అనిరుద్ రెడ్డి మాట్లాడుతూ ఉదండాపూర్ రిజర్వాయర్ పరిధిలోని నాలుగు తండాల ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద 45 కోట్ల రూపాయలు విడుదల చేయడం పట్ల ఆయన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు .గత ప్రభుత్వం పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టును పట్టించుకోలేదని, ప్రత్యేకించి ఉదండాపూర్, కరివేన రిజర్వాయర్లు పూర్తయితే కరివేన ద్వారా 2.5 లక్షల ఎకరాలకు, ఉదండాపూర్ ద్వారా 9 లక్షల ఎకరాలకు సాగునీరు అందించ వచ్చని, నూటికి నూరు శాతం ఈ ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు కృషి చేయాలని ఆయన మంత్రికి విజ్ఞప్తి చేశారు. అలాగే పునరావాసం సైతం పూర్తిచేయాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రులు ఉదండాపూర్ ఆర్ అండ్ ఆర్ కేంద్రంలో 12 కోట్ల 97 లక్షల వ్యయంతో నిర్మించనున్న 4.2 కిలోమీటర్ల రహదారి పనులకు శంకుస్థాపన చేశారు . ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎక్సైజ్,ప్రొహిబిషన్, సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల.చిన్నారెడ్డి ,రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ అధ్యక్షులు ఒబెదుల్లా కొత్వాల్ ,రాష్ట్ర ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఇంజనీర్ -ఇన్- చీఫ్ అనిల్ కుమార్, మహబూబ్ నగర్ శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, దేవరకద్ర శాసనసభ్యులు జి. మధుసూదన్ రెడ్డి ,మక్తల్ శాసనసభ్యులు వాకిటి శ్రీహరి, షాద్ నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ,జిల్లా ఎస్పీ డి. జానకి, ఎస్ ఈ శ్రీనివాసరావు, రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ ఎస్ మోహన్ రావు, మహబూబ్ నగర్ ఆర్డిఓ నవీన్, మైనర్ ఇరిగేషన్ జిల్లా ఎస్ ఈ చక్రధరం, పాలమూరు- రంగారెడ్డి మహబూబ్ నగర్ జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఇంజనీర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## చైనా ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం విజయవంతం

పెంచుకొంటున్నట్లు వార్తలొస్తున్న నేపథ్యంలో తాజా పరీక్ష ఆందోళనకరంగా మారింది.పీఎల్ఏ రాకెట్ ఫోర్స్ ఈ ఖండాంతర క్షిపణి డమ్మీ వార్‌హెడ్‌ను అమర్చి స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 8.44కు ప్రయోగించింది. ముందుగా నిర్ణయించిన లక్ష్యానికి ఇది చేరుకొంది. ఈవిషయాన్ని చైనా రక్షణ మంత్రిత్వశాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. తమ వార్షిక శిక్షణ ప్రణాళికల్లో ఇది సాధారణంగా జరిగే విషయమేనని చెప్పింది.తమ ఖండాంతర క్షిపణి ప్రయోగ వివరాలను కొన్ని దేశాలు ఆందోళన చెందకుండా ముందే సమాచారం అందించినట్లు షినూవా న్యూస్ ఏజెన్సీ రిపోర్టు చేసింది. అదే సమయంలో పసిఫిక్ సముద్రంలో ఆ మిసైల్ ప్రయాణించిన మార్గాన్ని మాత్రం బీజింగ్ బహిర్గతం చేయలేదు. తమ దళాల శిక్షణ, ఆయుధశక్తి, నిర్ణీత లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం వంటి అంశాలను విశ్లేషించేందుకు ఇది ఉపయోగపడిందన్నారు.ప్రస్తుతం పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ రాకెట్ ఫోర్స్ అధీనంలోనే బీజింగ్‌కు చెందిన సంప్రదాయ, అణు క్షిపణులు ఉన్నాయి. తాజాగా దీనిని ఆధునికీకరించేందుకు చర్యలు చేపట్టింది. ముఖ్యంగా అమెరికాలోని మిసైల్ డిఫెన్స్ వ్యవస్థలు, నిఘా సామర్థ్యాలు వంటివి సంతరించుకోవాలని లక్ష్యంగా పెట్టుకొంది .ప్రస్తుతం చైనా అణుసామర్థ్యాలను 'క్రెడిబుల్ మినిమమ్ డిటరెన్స్' స్థాయిని మించిపోయాయని నిపుణులు చెబుతున్నారు. మరోవైపు డ్రాగన్ మాత్రం తొలుత అణ్వస్త్రాల వినియోగానికి తాను వ్యతిరేకమని పేర్కొంది. ప్రస్తుతం చైనా మిలటరీ కమిషన్ అధ్యక్షుడి హోదాలో జిన్‌పింగ్‌కు మాత్రమే అణుదాడిని ఆమోదించే శక్తి ఉంది. బీజింగ్ అమ్ములపొదిలో దాదాపు 500 అణు వార్‌హెడ్‌లు ఉన్నాయి. దీంతోపాటు 350 ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు ఉన్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు. 2030 నాటికి అణు వార్‌హెడ్‌ల సంఖ్య 1,000 దాటి పోవచ్చని అమెరికాలోని పెంటగాన్ అంచనా వేసింది.

## తెలంగాణ పారిశ్రామిక వృద్ధిలో అమెరికన్ కంపెనీలు భాగస్వాములు కావాలి!

**ఫోర్త్ సిటీ నిర్మాణంలో, అభివృద్ధిలో పాలుపంచుకోండి!**

**లాస్ వెగాస్ మైన్ ఎక్స్‌పోలో ఉపముఖ్యమంత్రి భట్టి పిలుపు**

**(ప్రత్యేక ప్రతినిధి / జనంసాక్షి):**
తెలంగాణ రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధిలో, ఫోర్త్ సిటీ నిర్మాణంలో, ఎదుగుదలలో పాలుపంచుకోవాలని అమెరికన్ పరిశ్రమలు, వ్యాపార సంస్థలకు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు పిలుపునిచ్చారు. మంగళవారం నాడు ఆయన అమెరికాలోని లాస్ వేగాస్ లో ప్రారంభమైన అంతర్జాతీయ మైనెక్స్-2024 ప్రదర్శనలో పాల్గొన్న అనంతరం పలు అమెరికన్ కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఆయనతోపాటు రాష్ట్ర ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, సింగరేణి సిఎండి ఎన్.బలరామ్ , స్పెషల్ సెక్రెటరీ కృష్ణభాస్కర్, ఇంకా ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భారతదేశంలో పరిశ్రమల స్థాపనకు, పెట్టుబడులకు, వ్యాపారాలకు హైదరాబాద్ అత్యంత అనువైన ప్రాంతమని, తెలంగాణ రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో కీలకపాత్ర పోషిస్తుందని, కనుక ఇక్కడ ఖనిజ పరిశ్రమాభివృద్ధికి దోహదపడాలని ఇందుకు అనుబంధ పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవడానికి ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు, ఖనిజాలను రక్షణతో మంచి ఉత్పాదకతతో ఉత్పత్తి చేయడానికి అవసరమైన యంత్రాలను సమకూర్చవచ్చని తెలిపారు. భూగర్భంలో దాగిన విలువైన ఖనిజాలను వెలికితీయడంలో, నిలకడగల అభివృద్ధిని సాధించడంలో అమెరికన్ కంపెనీలు భాగస్వాములు కావచ్చని సూచించారు. హైదరాబాద్ కు అనుబంధంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ఫోర్త్ సిటీలో కూడా భాగస్వాములు కావాలని ఆయన అమెరికన్ పారిశ్రామిక కంపెనీలకు, వాణిజ్య సంస్థలకు పిలుపునిచ్చారు. ఇప్పటికే ఇక్కడ స్థాపించిన అమెరికన్ కంపెనీలు ఎంతో సౌకర్యవంతంగా తమ వ్యాపారాలను వృద్ధి చేసుకుంటున్నాయని, ఇంకా వివిధ రంగాల పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం ఉన్నందున దీనిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణకు చెందిన ప్రభుత్వ కంపెనీ అయిన సింగరేణికి క్రిటికల్ మినరల్స్ అన్వేషణలో పూర్తి సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల జరిగిన ఇరుదేశాధినేతల సమావేశంలో పరస్పరం రెండు దేశాలు ఒకరికొకరు తోడ్పడాలని అంగీకరించిన నేపథ్యంలో అమెరికన్ కంపెనీలు మరింతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అమెరికన్ ప్రభుత్వ ప్రతినిధి బృందానికి నాయకత్వం వహిస్తున్న గ్లోబల్ మార్కెట్స్ సహాయ కార్యదర్శి అరుణ్ వెంకటరామన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ హైదరాబాద్ లో ఇప్పటికే అమెరికాకు చెందిన పలు సంస్థలు తమ వ్యాపార కార్యకలాపాలు విజయవంతంగా నిర్వహించుకుంటున్నాయని, ఈ ఒరవడిని కొనసాగిస్తూ మరిన్ని అమెరికన్ సంస్థలు తెలంగాణలో తమ వ్యాపారాలు ప్రారంభిస్తాయని ఆయన ఆశాభావం ప్రకటించారు.భారీ యంత్రాలు, సేవల ప్రదర్శనలో 1900 కంపెనీలునాలుగేళ్లకు ఒకసారి జరిగే ఈ భారీ అంతర్జాతీయ మైనెక్స్-2024 ప్రదర్శనలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న సుమారు 1900 యంత్ర ఉత్పత్తి సంస్థలు తమ స్టాల్స్ ను ఏర్పాటు చేసుకున్నాయి. వీటిలో భారీ మైనింగ్ తవ్వకాల యంత్రాలు మరియు ఖనిజ రవాణా వాహనాలు, రక్షణ సేవలు, అనుబంధ యంత్ర విభాగాలను ప్రదర్శనకు ఉంచారు. 121 దేశాల నుండి సుమారు 44,000వేల మంది ప్రతినిధులు దీనిలో పాల్గొంటున్నారు. రాష్ట్రం నుంచి తొలిసారిగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కమల్లు సారథ్యంలోని రాష్ట్ర అధికారుల బృందం ప్రముఖ ఖనిజ పరిశ్రమల యంత్ర తయారీ సంస్థలైన కొమాట్సు, క్యాటర్ పిల్లర్, బి.కే.టి టైర్స్ తదితర స్టాల్స్ ను సందర్శించారు. అధికోత్పత్తి సాధించే రక్షణ సహిత భారీ యంత్రాల గురించి ఆయా కంపెనీల వారు తమ ప్రత్యేకతలను వివరించారు.

# మూసీప్రక్షాళనకు సర్వం సిద్ధం

మూసీ పరివాహక ప్రాంతంలో ప్రైవేటు వ్యక్తు లకు సంబంధించి 1600 నిర్మాణాలు ఉన్నట్లు సర్వేలో గుర్తించారు. బఫర్ జోన్, నది గర్భంలో నివాసాలు ఏర్పాటు చేసుకొని కొంత మంది నిరుపేదలు ఏళ్ల తరబడి జీవిస్తు న్నారు.నది ఒడ్డున చిన్న చిన్న వ్యాపారాలు చేస్తూ కుటుం బాలను పోషించుకుంటున్నారు. ఆ నిర్మాణా లను తొలగించే ముందు వారందరికీ పునరావాసం కల్పించేందుకు దాదాపు 15 వేల రెండు పడకల గదుల ఇళ్లను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లా కలెక్టర్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.ఈ నేపథ్యంలోనే తమ పరిధిలోని మూసీ నది గర్భంలోని నిర్మాణాలపై దృష్టి సారించిన అధికారులు మూడు జిల్లాల పరిధిలో మున్సిపల్, రెవెన్యూ, పోలీసు, నీటిపారుదల శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. మొత్తం 2,166 నిర్మాణాలుంటున్నట్లు గుర్తించారు. హైదరాబాద్ జిల్లా పరిధిలో 1595 మంది, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలో 239, రంగారెడ్డి జిల్లా పరిధిలో 332 మంది నిర్వాసితులు ఉన్నట్లు తేల్చారు. వారందరు నష్టపోకుండా ఉండేందుకు అధికారులు మరోసారి పూర్తి స్థాయిలో సర్వే చేయాలని సూచించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాలతో నాలుగు బృందాలుగా ఏర్పడి గండిపేట, రాజేంద్రనగర్ పరిధిలోని మూసీలో సర్వే నిర్వహించారు.హైదరాబాద్ కలెక్టర్ ఆదేశాలతో 16 బృందాలు రంగంలోకి దిగాయి. ఇంటి యజమానికి సంబంధించిన ఆధార్ కార్డు, దస్తావేజులు, కరెంట్ బిల్స్, అనుమతులకు సంబందించిన ఇతర పత్రాలను పరిశీలిస్తున్నారు.అధికారుల గతంలో ప్రాథమికంగా యాప్‌లో నమోదు చేసిన వివరాలతో సరిపోలుస్తూ అదనపు వివరాలను తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఉన్న ఇళ్లకు వరద ముంపు ఉంటుందని, నివాసానికి అనువుగా ఉండదని అధికారులు యజమానులకు వివరిస్తున్నారు. మూసీ నదిలో నిర్మించుకున్న వాటికంటే పక్కాగా రెండు పడకల గదుల ఇళ్లను ఇవ్వడం జరుగుతుందని, ఖాళీ చేయించే సమయంలో రవాణా ఖర్చు కూడా ప్రభుత్వం భరిస్తుందని నిర్వాసితులకు చెబుతున్నారు. అలాగే వాణిజ్య పరంగా కూడా ఎలాంటి నిర్మాణాలు ఉన్నాయి? వాటికి సంబంధించిన ఆధారాలను కూడా అధికారులు సేకరిస్తున్నారు.ఈ సర్వే పూర్తైన అనంతరం అర్హులను గుర్తించి జీహెచ్ఎంసీ పరిధిలో రెండు పడకల గదుల ఇళ్లను కేటాయించనున్నారు.ఈ సర్వే పూర్తైన అనంతరం అర్హులను గుర్తించి జీహెచ్ఎంసీ పరిధిలో రెండు పడకల గదుల ఇళ్లను కేటాయించనున్నారు ఆ తర్వాతే నది గర్భంలో ఉన్న నిర్మాణాల తొలగింపు చేపడతామని మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ దాన కిషోర్ స్పష్టం చేశారు. బఫర్ జోన్‌కు సంబంధించి పునరా వాస చట్టం ప్రకారం పరిహారం ప్రతిపాదనలు ప్రభు త్వానికి పంపామని, ప్రభుత్వ అనుమతితో పరిహారం చెల్లించాకే భూసేకరణ చేస్తామని దాన కిషోర్ వెల్లడించారు. మూసీ పరిధిలో ఉన్న నిర్వాసితులు అపోహలకు లోను కావద్దని, అర్హులందరికీ పునరావాసం కల్పిస్తామని పేర్కొన్నారు.

## హరియాణా రైతులకిచ్చిన హామీల అమలేది?

"రైతులకు భాజపా ద్రోహం చేసింది. వారి గళాన్ని వినిపించేందుకు రైతులు మరోసారి వీధుల్లోకి రావాల్సి వచ్చింది. వారిపై లాఠీచార్జ్ చేశారు. బాష్పవాయువులు ప్రయోగించారు. రైతుల సమస్యలను భాజపా ఎందుకు పట్టించుకోవడం లేదు.? వారి గౌరవప్రదమైన జీవనం, అభివృద్ధిపై భాజపాకు ఉన్న విజన్ ఏమిటి..?" అని ప్రశ్నించారు. కాంగ్రెస్ కనీస మద్దతు ధరపై చట్టంబద్ధమైన హామీ ఇస్తుందన్నారు. రుణ మాఫీతో పాటు 30 రోజుల్లోగా పంట బీమా చెల్లిస్తుందని పేర్కొన్నారు."భాజపా మహిళల భద్రతపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. హరియాణా కుమార్తెలు, మహిళా రెజ్లర్లపై తమ పార్టీ ఎంపీ బ్రిజ్ భూషణ్ వేధింపులకు పాల్పడ్డారు. ఆయనను శిక్షించడానికి బదులు అతడి కుమారుడికి టిక్కెట్ ఇచ్చింది. లైంగిక హింసకు పాల్పడే వారికి (బ్రిజ్ భూషణ్, ప్రజ్వల్ రేవణ్ణను ఉద్దేశిస్తూ) తమ పరివార్‌లో ఆశ్రయం కల్పిస్తున్నారు. 'మోదీ కా పరివార్'లో నారీ శక్తి అనేది కేవలం నినాదానికి మాత్రమే పరిమితం. మోదీ పాలనలో మహిళలు సురక్షితంగా ఉన్నారా..?" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

## హరియాణాలో భాజపా పుంజుకుంటోంది

ముడిపడి ఉందని అంబేద్కర్ పేర్కొన్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధాని ప్రసంగిస్తున్న సమయంలో ఓ బాలుడు తాను గీసిన మోదీ చిత్రాన్ని చూపుతుండటం ఆయన గమనించారు. తన చిరునామా రాసి, ఆ చిత్రాన్ని భద్రతా సిబ్బందికి అందించాలని బాలుడిని కోరారు.

# తిరుపతి లడ్డూ కల్తీ వెనుక బీజేపీ కుట్ర

- మతపరమైన రాజకీయ క్రీడ మొదలయ్యింది
- చంద్రబాబుతో ఆటలాడిస్తున్న బిజెపి
- మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి సంచనల కామెంట్స్



**హైదరాబాద్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన తిరుమల లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యి ఘటనపై ప్రజలంతా అనుమానాలు వ్యక్తం చేస్తుండగా మాజీ ఎమ్మెల్యే తూర్పు జగ్గారెడ్డి అందుకు భిన్నంగా స్పందించారు. తిరుమల లడ్డు వివాదం వెనక బీజేపీ కుట్ర ఉందంటూ అనుమానం వ్యక్తం చేశారు. తిరుపతి లడ్డు కల్తీ అయిందన్న వివాదంలో వాస్తవాలు ఏమిటి, జరిగింది ఏంటి అన్న విషయాలు మాత్రమే చర్చిస్తే భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా ఉంటాయన్నారు. ఇక్కడ జరిగిన అంశాలకంటే రాజకీయ లబ్ధి, మతపరమైన అంశాల చర్చ ఎక్కువగా జరిగి వాస్తవాలు మరుగున పడి పోతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వాస్తవాలను వెంటనే బయటపెట్టి తిరిగి కల్తీలేని లడ్డులను భక్తులకు అందించి అలాంటి దోషాలు తిరిగి జగరకుండా పకడ్బందీగా చర్యలు తీసుకొని భక్తులకు భరోసా కల్పించాలని సూచించారు. కానీ అలా కాకుండా చంద్రబాబు దీన్ని రాజకీయం చేయడం, మత ప్రస్తావన తేవడం, జగన్ పేరు ప్రస్తావన చేయటంతో వ్యక్తిగతంగా తనకు కొన్ని అనుమానాలు వస్తున్నాయని.. బీజేపీ ఏమైనా చంద్రబాబుతో మతపరమైన రాజకీయాలకు తెరతీస్తుందా అనేది తన అనుమానం అంటూ బయటపెట్టారు. ఎందుకంటే బీజేపీ ఎజెండానే ఎప్పుడు ప్రజా సమస్యల చుట్టూ కాకుండా మతపరమైన అంశాల చుట్టూనే ఉంటుంది. ఎమోషనల్‌గా ప్రజలను రెచ్చగొట్టి రాజకీయం చేయడమే బీజేపీ ఎజెండా. పరిస్థితులు చూస్తే ఏపీలో బీజేపీ ఆట మొదలుపెట్టినట్టు అనిపిస్తోందని అంటూ వ్యాఖ్యలు చేశారు. ఏపీ రాజకీయాల్లో జగన్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడును అరెస్టు చేయించడాన్ని రాజకీయ పార్టీలకు అతీతంగా అంతా తప్పుపట్టామని.. ఒక విజన్ ఉన్న నాయకుడిగా ఆయన్ని గౌరవిస్తానన్నారు. హైదరాబాద్ అభివృద్ధిలో ఆయన భాగస్వామ్యం చాలా గొప్పది అని కొనియాడారు. జగన్ విజన్‌పై క్లారిటీ లేదు కానీ చంద్రబాబుకు విజనరీ అనే పేరు ఉందని చెప్పుకొచ్చారు. చంద్రబాబు వయస్సును కూడా చూడకుండా కొంతమంది వైసీపీ మంత్రులు, వైసీపీ ఎమ్మెల్యేలు ఇష్టం వచ్చినట్టు మాట్లాడడం సరైంది కాదన్నారు. అత్యంత సీనియర్ నేతల్లో ఒకరైన చంద్రబాబును కాపాడుకోవడం, గౌరవించుకోవడం అవసరమని గతంలోనే చెప్పానన్నారు. ముఖ్యమంత్రుల నిర్ణయాల్లో తప్పులు వెతకడం మొదలుపెడితే ఏ సీఎం కూడా పనిచేయలేరన్నారు. ఏదో టెక్నికల్ ఆధారాలు పట్టుకుని చంద్రబాబుని జైలుకు పంపారు అది ఆయన రాజకీయంగా అడ్వాంటేజ్‌గా తీసుకున్నారని తెలిపారు. చంద్రబాబు కుటుంబ సభ్యులు కూడా జగన్ పార్టీ నేతలు రాజకీయాల్లోకి లాగారు వారిపై అనుచిత కామెంట్స్ చేశారన్నారు. అటువంటి కామెంట్స్‌ను తెలంగాణ ప్రాంతానికి సంబంధించిన వారంతా ఖండించామని చెప్పారు. అధికారం మైకంలో జగన్ తీసుకున్న నిర్ణయాలు ఆయనకే శాపంగా మారాయన్నారు. అదే సమయంలో చంద్రబాబు ప్రజల్లో తిరుగుతూ కష్టపడ్డారని.. మళ్లీ ముఖ్యమంత్రి అయ్యారన్నారు. ఏపీలో కాంగ్రెస్ పార్టీ కూడా ఉందన్నారు. రాష్ట్రం విభజన చేసిందనే కోపం అక్కడ ప్రజలకు ఉందని.. అందుకే గత మూడు ఎన్నికలను కాంగ్రెస్ పార్టీని అక్కడి ప్రజలు నమ్మలేదన్నారు. భవిష్యత్తులో కాంగ్రెస్‌కు అక్కడి ప్రజలు బ్రహ్మరథం పడతారని నమ్మకముందన్నారు. రాబోయే రోజుల్లో రాహుల్ గాంధీకి దేశ ప్రజలు కచ్చితంగా అవకాశం ఇస్తారన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా రాహుల్ నేతృత్వంలోనే జరుగుతుందన్నారు. పోలవరం ప్రాజెక్టు కూడా కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీనే పూర్తి చేస్తారని స్పష్టం చేశారు. మోడీ ప్రత్యేక హోదా ఇస్తానని, పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇస్తానని ఇవ్వలేకపోయారన్నారు. ఇప్పుడు టీడీపీ బలంతోనే కేంద్రంలో మోదీ ప్రధానమంత్రి అయ్యారన్నారు. అయినా కూడా చంద్రబాబు ప్రత్యేక హోదా సాధించలేకపోతున్నారని తెలిపారు. గతంలో మోదీకి మద్దతు ఇచ్చిన జగన్ కూడా ప్రత్యేక హోదా తేలేకపోయారు అంటే గతంలో జగన్, ప్రస్తుతం చంద్రబాబు ఫెయిలయ్యారని విమర్శించారు. రాహుల్ గాంధీ వచ్చే ఎన్నికల తర్వాత ప్రధానమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ఏపీకి ప్రత్యేక హోదాతో పాటు.. పోలవరం ప్రాజెక్టును కచ్చితంగా పూర్తి చేస్తారని వెల్లడించారు.



## జానీ మాస్టర్‌కు పోలీస్ కస్టడీ

- అనుమతించిన రంగారెడ్డి జిల్లా కోర్టు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** లైంగిక వేధింపుల కేసులో అరెస్టైన ప్రముఖ కొరియోగ్రాఫర్ షేక్ జానీ పాషా అలియాస్ జానీ మాస్టర్ ను పోలీస్ కస్టడీకి కోర్టు అనుమతించింది. ఆయనపై థర్డ్ డిగ్రీని ప్రయోగించవద్దని, అవసరమైతే న్యాయవాది సమక్షంలో విచారించాలని సూచించింది. నాలుగు రోజుల పాటు కస్టడీకి ఇస్తూ రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు ఆదేశాలు జారీ చేసింది. జానీ మాస్టర్ ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో ఉన్నారు. ఆయనను అదుపులోకి తీసుకోవడానికి పోలీసులు చంచల్‌గూడ జైలుకు వెళ్లారు. తనను మోసం చేశాడని అసిస్టెంట్ కొరియోగ్రాఫర్ ఒకరు ఫిర్యాదు చేయడంతో నార్సింగి పోలీసులు కేసు నమోదు చేశారు. జానీ మాస్టర్‌ను గోవాలో అరెస్ట్ చేసి పీటీ వారెంట్‌పై హైదరాబాద్ కు తీసుకువచ్చి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఆయనకు రెండు వారాల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. జానీ మాస్టర్ ను తమ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ నెల 28 వరకు నార్సింగి పోలీసులు ఆయనను ప్రశ్నించనున్నారు.



## తండ్రి రుణం తీర్చుకున్న కూతురు

- తలకొరివి పెట్టిన పెద్దకూతురు

కొత్తగూడ,సెప్టెంబర్ 25 (జనంసాక్షి): మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని బత్తలపల్లి గ్రామంలో కూతురు తండ్రికి తలకొరివి పట్టిన సంఘటన చోటుచేసుకుంది. బత్తులపల్లి గ్రామానికి చెందిన దుర్గం లక్ష్మయ్య మంగళవారం కురిసిన అకాల వర్షానికి పిడుగుపాటు పడడంతో అక్కడికి అక్కడే మరణించారు. అంత్యక్రియలను బుధవారం నిర్వహించారు. కొడుకులు లేకపోవడంతో పెద్దకూతురు సమ్మక్క తన తండ్రికి తల కొరివి పట్టింది. మృతుడికి భార్య ఎల్లమ్మ, చిన్న కూతురు వెంకటమ్మ ఉన్నారు. తన కుమార్తెలు గ్రామ మహిళలు కలిసి దగ్గరుండి అంత్యక్రియలు నిర్వహించారు. కూతుళ్లకు కన్యాదానం చేసి తండ్రి తన భాధ్యత తీర్చుకున్నాడు. ఆడపిల్లలైన తండ్రికి అంతక్రియలు చేసి తన తండ్రి రుణం కోరికను తీర్చారు.

## బీఆర్ఎస్ నాయకుల అక్రమ అరెస్టుకు ఖండన

- బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి నాగర్ దొడ్డి వెంకట రాములు



**గద్వాల, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** బీఆర్ఎస్ నాయకుల అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి నాగర్ దొడ్డి వెంకట రాములు అన్నారు. గట్టు మండలంలోని గట్టు ఎత్తిపోతల పథకం పరిశీలించడానికి వస్తున్న మంత్రులని అడ్డుకోవడానికి ప్రయత్నించిన టిఆర్ఎస్ నాయకుల్ని అక్రమంగా అరెస్టు చేయడం దారుణ మన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలుపరచమని కోరటం రైతుల రుణమాఫీని సంపూర్ణంగా మాఫీ చేయకపోవడం ఏ హామీని సంపూర్ణంగా అమలు చేయలేని ప్రభుత్వాన్ని ప్రశ్నించడమే ఒక నేరంగా మారిందని పోలీసులు మాటిమాటికి టిఆర్ఎస్ నాయకుల్ని అరెస్టు చేయడం ఆనవాయితీగా మారిందన్నారు. ప్రజా పరిపాలన అని చెప్పుకుంటూ నే పోలీస్ పాలనగా మారుస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు తిరుగుబాటు చేయాలని లేకపోతే భవిష్యత్తులో ప్రశ్నించడమే ఒక నేరంగా మారిపోతున్నదని, గతంలో ఏ ప్రభుత్వంలో చేయనంత అరెస్టులు కొనసాగుతున్నాయని, విద్యార్థుల్ని నిరుద్యోగుల్ని ప్రభుత్వ ఉద్యోగులను ప్రశ్నించే ప్రజల్ని ప్రశ్నించే నాయకుల్ని ప్రశ్నించే ప్రజా సమూహాల్ని పోలీసులు నిర్బంధానికి గురి చేయటం పరిపాటిగా మారిందని తెలిపారు. ప్రజాపాలన పోలీస్ పాలనగా మారిపోతుందన్నారు. అరెస్టు చేసిన జిల్లా నాయకులను కేటీ దొడ్డి పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. జిల్లా నాయకులు బాస్ హనుమంతు కురువపల్లయ్య మోనేసాచారి ముని తిరుమలేష్ తదితరులు ఉన్నారని వారిని వెంటనే విడుదల చేయాలని కోరారు.

## వైద్య సౌకర్యాలను కుదించొద్దు

**నిర్మాణ్ భవన్ ఎదుట తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా**




**హైదరాబాద్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ, పెన్షనర్ల వ్యతిరేక విధానాలను విడనాడాలని, 8వ కేంద్ర పే కమిషన్ వెంటనే ఏర్పాటు చేయాలని, వైద్య సౌకర్యాలలో కోత విధింపును నిరసిస్తూ ఆరోగ్య పథకాలను మెరుగు పర్చాలని తదితర పెండింగ్ లోనున్న డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సెప్టెంబర్ 25 న దేశవ్యాప్తంగా పెన్షనర్లు రాష్ట్ర స్థాయి ధర్నాలు నిర్వహించాలని హైదరాబాద్ కోఠీ ఉమెన్స్ కాలేజీ ఎదురుగా ఉన్న నిర్మాణ్ భవన్ (కేంద్రీయ సదన్, సుల్తాన్ బజార్) వద్ద తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ (ఎన్సీసీపీఏ) పిలుపు మేరకు సంఘ అధ్యక్షులు పి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెన్షనర్ల సౌకర్యాలను కుదించే విధానాలు మానుకోవాలని డిమాండ్ చేశారు. సీజీహెచ్ఎస్ వెల్నెస్ సెంటర్లను పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) పద్ధతిపై ప్రైవేటీకరణ ప్రతిపాదనను విరమించుకోవాలని టాప్రా సీనియర్ నాయకులు ఎంఎన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సీజీహెచ్ఎస్ కు ఉద్యోగులు ప్రతి నెలా తమ జీతంలో చందా చెల్లిస్తున్నారని, రిటైరైన తర్వాత కూడా 120 నెలల సబ్స్క్రిప్షన్ చెల్లించారని కానీ ఇప్పుడు ఆయుష్మాన్ భారత్ తో లింక్ చేసి వైద్య సౌకర్యాలను కుదించాలనే నిర్ణయాన్ని రద్దు చేయాలని సీసీజీజీఓఓ జాతీయ చైర్మన్ వి. కృష్ణ మోహన్ కోరారు. రైల్వే ఆసుపత్రులలో, సీజీహెచ్ఎస్ లో నిపుణులైన వైద్యులను, పారా మెడికల్ మరియు ఇతర సిబ్బందిని వెంటనే నియమించాలని ఏఐఆర్ఆర్ఎఫ్ అధ్యక్షులు స్వామి కోరారు. ధర్నాలో కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల తో పాటు బీఎస్ఎన్ఎల్ తదితర రిటైర్డ్ ఉద్యోగులు పి ప్రభాకర్, బిజెఎం రెడ్డి, బ్రహ్మాచారి, నరహరి తదితరులు పాల్గొన్నారు.

## పౌర సేవలో ఆత్మకూరు పోలీస్ బెస్ట్..

**వరంగల్ ఈస్ట్, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** పౌర సేవలో ఉత్తమమైన సేవలు అందించినందుకు గాను ఆత్మకూరు పోలీసులు రాష్ట్ర పోలీస్ డిజిపి జితేందర్ చేతుల మీదుగా బెస్ట్ సిటిజన్ సర్వీస్ అవార్డును అందుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు అందిస్తున్న సేవలతో పాటు విధి నిర్వహణలో చూపిస్తున్న ప్రతిభ ఆధారంగా ప్రతినెల రాష్ట్రంలో ఎంపిక ఎంపిక చేసిన పోలీస్ స్టేషన్ కు ఉత్తమ సేవలు అందజేస్తామన్నారు. గత జూలై ఆగస్టు మాసాలకు సంబంధించి ఉత్తమ పౌర సేవలు అందించినందుకు వరంగల్ పోలీస్ కమిషనర్ పరిధిలోని ఆత్మకూర్ పోలీస్ స్టేషన్ కు బెస్ట్ సిటిజన్ సర్వీస్ అవార్డుకు ఎంపిక చేస్తూ రాష్ట్ర డిజిపి చేతుల మీదుగా ఆత్మకూర్ ఇన్స్పెక్టర్ సంతోష్ కు జ్ఞాపికను అందజేశారు ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆత్మకూరు పోలీసులను అభినందించారు



## ఉద్యోగుల అంతర్రాష్ట్ర బదిలీలు చేపట్టేలా చూడండి




**హైదరాబాద్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** ఉద్యోగుల అంతర్రాష్ట్ర బదిలీలు త్వరగా చేపట్టేలా తెలంగాణ, ఆంధ్ర ప్రభుత్వాలను కోరాలని తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ ఎం హుస్సేనీ (ముజీబ్)కి ఉద్యోగులు విజ్ఞప్తి చేసారు. తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం, హైదరాబాద్ జిల్లా కార్యాలయములో వారు డాక్టర్ ముజీబ్ గారిని కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు ఈ సందర్భంగా డాక్టర్ ముజీబ్ మాట్లాడుతూ ఇరు రాష్ట్రాలు ఉద్యోగుల అంతర్రాష్ట్ర బదిలీలకు అంగీకరించాయని, తెలంగాణ ఉద్యోగులు తెలంగాణకు వస్తారని, అలాగే ఆంధ్ర ప్రాంత ఉద్యోగులు వారి రాష్ట్రానికి వెళ్తారని, ఎవ్వరు కూడా ఆందోళన చెందకూడదని అన్నారు.

# మిక్కిలినేనికి 'హస్త'రేఖలు మారేనా?

- నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత కోసం ఎదురుచూపు
- కాంగ్రెస్ బలోపేతం కోసం పదేళ్లు అలుపెరగని పోరు
- లెక్కకు మించి కేసులు పెట్టి వేధించిన గత పాలకులు
- ముగ్గురు మంత్రులపై ఆశలు పెట్టుకున్న కుటుంబం

**ఖమ్మం, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** పదేండ్ల బిఆర్ఎస్ పాలన.. లెక్కకు మించిన కేసులు.. అరెస్టులు.. పోలీసుల వేధింపులు.. రాజకీయంగా అణగదొక్కే కుయుక్తులు.. ప్రతి కదలికను పసిగట్టే ఇంటిలిజెన్స్ అధికారులు ఆరా... ఇలా ఒకటేమిటి అధికారంలో ఉన్న వ్యక్తి తనకు ఉన్న అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ మిక్కిలినేని మంజుల, నరేంద్రబాబు లను వేధించిన తీరు ఇప్పటికీ కళ్ళముందు కదలాడుతూనే ఉంది. ఖమ్మం నగర ప్రజలు ఎవరు ఆ వేధింపులను మరిచిపోరు. దీనంతటికీ కారణం ఒకటే.. వీరు కాంగ్రెస్ పార్టీకి వీర విధేయులుగా ఉండి బీఆర్ఎస్ ప్రభుత్వానికి, నాటి మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌కు వ్యతిరేకంగా, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కోసం పోరాడుతూ పనిచేయడమే. ఈ వేధింపులను చూసిన కొందరు కాంగ్రెస్ నాయకులే వీటి నుండి బయట పడాలంటే బిఆర్ఎస్ పార్టీలో చేరు అనే సలహా ఇచ్చే పరిస్థితి వచ్చిందంటే నాడు వీరు ఎలాంటి గడ్డు పరిస్థితులు ఎదుర్కొన్నారో అర్థం చేసుకోవచ్చు.. ప్రస్తుతం కాలం మారింది.. అధికార మార్పిడి జరిగింది.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది.. మిక్కిలినేని కుటుంబం అధికార పార్టీ కుటుంబంగా అవతరించింది.. అయినప్పటికీ నేటికీ వీరి హస్తరేఖలు మాత్రం ఇంకా మారలేదు..



### పదేళ్లలో 24 కేసులు

పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ఖమ్మం నియోజకవర్గంలో మంత్రి పువ్వాడకు వ్యతిరేకంగా ఏ పార్టీలో అయినా స్వతంత్రంగా పనిచేసే పరిస్థితి లేదు. ఆయన విధానాలను ప్రశ్నించే నాయకులు ఒకరిద్దరు మాత్రమే ఉన్నారంటే ఎలాంటి అతిశయోక్తి లేదు. వారిలో కాంగ్రెస్ పార్టీ నుండి మిక్కిలినేని నరేంద్రబాబు ముందు వరుసలో ఉంటాడు. ఆయనను లొంగదీసుకుని బిఆర్ఎస్ చేర్చుకునేందుకు అధికార పార్టీ చేయని ప్రయత్నం లేదు. కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తలకు అండగా ఉండటమే ఆయన చేసిన తప్పిదంగా భావించిన అధికార పార్టీ నాయకులు పోలీసులతో ఎన్ని రకాల వేధింపులు చేయాలో అన్ని రకాల వేధింపులకు పాల్పడ్డారు. నాడు పోలీస్ శాఖలో కీలకంగా ఉన్న వ్యక్తి స్వయంగా మిక్కిలిని నరేంద్రబాబుకు వార్నింగ్ ఇస్తూ పార్టీలో జాయిన్ కావాలని వేధించిన తీరు వర్ణనాతీతం. పదేళ్ల కాలంలో నరేంద్రబాబుపై 24 కేసులు, కార్పొరేటర్ మంజులపై మూడు కేసులు నమోదు చేశారు. నరేందర్ పై రెండుసార్లు రౌడీషీట్ ఓపెన్ చేశారు. కోర్టు ఆదేశాలను సైతం లెక్కచేయకుండా కేసులతో వేధించారు. ఆ గడ్డు కాలంలో నరేందర్ ఒక్కరోజు కూడా ఇంటిలో ప్రశాంతంగా నిద్రించలేదు. మిక్కిలినేని మంజుల కార్పొరేటర్ గా పోటీ చేస్తే ఆమెను ఓడించేందుకు చేయని కుట్రలు లేవు. అయినప్పటికీ ప్రజా బలంతో ఆమె విజయం సాధించారు. అలా ఉండేవి నాటి అధికార పార్టీ వేధింపులు. అయినప్పటికీ వాళ్లకి లొంగలేదు. నిత్యం కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, కార్యకర్తలకు అండగా పోరాడుతూ వచ్చాడు. ఈ సమయంలోనే ఆర్థికంగా ఊహకు అందని విధంగా నష్టపోయాడు. ఈ వేధింపుల ప్రభావం వారి పిల్లల చదువు పైన పడింది. ఆ నష్టం ఎవరు పూడ్చలేని స్థాయికి చేరింది.

### అధికారం వచ్చినా.. హస్తవాసి మారలేదు..

ఎన్నో వేధింపులు, అరెస్టులు వెరసి అన్నిటిని ఎదుర్కొని ధైర్యంగా దాటుకుంటూ వచ్చిన మిక్కిలినేని కుటుంబం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కాస్త ఊపిరి పీల్చుకుంది. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తుమ్మల నాగేశ్వరరావుకు మంత్రి పదవి రావడంతో మిక్కిలినేని కష్టానికి గుర్తించి వారి కుటుంబానికి న్యాయం చేస్తారు అనే ప్రచారం జరిగింది. మిక్కిలినేనికి భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, రేణుక చౌదరితో మంచి సంబంధాలు ఉన్నాయి. అందరూ మిక్కిలినేని కష్టాన్ని గుర్తించినవారే. అయితే ఖమ్మంలో మేయర్ మార్పు ఉంటుందని ప్రచారం జరిగినప్పుడు, కాంగ్రెస్ పార్టీకి వీర విధేయులుగా ఉన్న మిక్కిలినేని మంజులకు ఆ పదవి వస్తుందని ఆశ పెట్టుకున్నారు. మారిన రాజకీయ పరిణామాలలో అది సాధ్యపడలేదు. నామినేటెడ్ పోస్టుల్లో అయినా వారి కుటుంబాన్ని గుర్తించి ప్రాధాన్యత ఇవ్వాలని, జిల్లాస్థాయిలో సుడా చైర్మన్ నుండి పోస్టులను అయినా ఇస్తే పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తను గుర్తించి ఘనత పార్టీకి దక్కుతుందని ప్రజలు భావిస్తున్నారు.





## తెగువకు స్ఫూర్తి చాకలి ఐలమ్మ




- మంత్రి దనసరి అనసూయ సీతక్క

**ఏటూరునాగారం, సెప్టెంబర్ 25(జనంసాక్షి) :** తెలంగాణ తెగువకు స్ఫూర్తి చాకలి ఐలమ్మ అని మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. మండల కేంద్రములోని వై జంక్షన్ లో రజక సంఘం ఆధ్వర్యములో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఈ సందర్భంగా మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొని దొరలు, దేశ్‌ముఖ్‌లు, రజాకార్లను గడగడ లాడిరచిన ఐలమ్మ స్ఫూర్తితో ప్రజాపోరాటాలను కొనసాగించాలనీ మంత్రి సీతక్క అన్నారు. నిజాం ప్రభువు హైదరాబాద్ సంస్థానంలో రజాకార్లు, దొరలు, జాగిరిదార్లు, పేదలు, బడుగు బలహీన వర్గాలపై దాడులు చేస్తూ క్రూరంగా ప్రవర్తించి ప్రజలను ఘోసపెట్టారని ఈ పరిస్థితులలో విసునూరి రామచంద్రారెడ్డి ఆగడాలను, దౌర్జన్యాలను ఎదురించిన వీరనారి కమ్యూనిస్టు ఐలమ్మ సాయుధ పోరాటాన్ని నడిపిందన్నారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కోఠి లోని మహిళా విశ్వవిద్యాలయానికి వీర వనిత చాకలి ఐలమ్మ పేరు పెట్టడం జరిగిందని అదే విధంగా చాకలి ఐలమ్మ మనమరాలు శ్వేతను రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమించి గౌరవించడం జరిగిందని, చాకలి ఐలమ్మ స్ఫూర్తి తో మా ప్రజా పాలన కొనసాగిస్తామని సీతక్క అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం ఎల్ సి బస్వరాజు సారయ్య తో పాటు ఓ ఎస్ డి మరియు రజక సంఘం రాష్ట్ర జిల్లా మండల నాయకులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా బ్లాక్ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
26 సెప్టెంబర్ 2024

మనువాద ఫాసిస్టు శక్తులకు బుజ్జగింపులు..

# మహాదళితులపై దౌర్జన్యాలు



సెప్టెంబరు 18న బీహార్‌లోని నవాడా జిల్లాలో ఓ దారుణ ఘటన చోటుచేసుకుంది. అగ్రవర్ణ దురాక్రమణదారులు (రిపోర్టుల ప్రకారం, యాదవ్, దళిత పాశ్వాన్ వర్గాలకు చెందినవారి ప్రమేయం కూడా ఉన్నదని) కృష్ణనగర్ మహాదళిత్ కాలనీలో పేద మహాదళితులపై దాడిచేసి, వారిని కొట్టి, 40-50 ఇళ్లకు నిప్పు పెట్టారు. మహాదళిత్ ఇళ్లు బూడిదగా మారాయి. ఆస్తులు ధ్వంసం చేయబడ్డాయి. నివాసితులు బలవంతంగా పారిపోయేలా చేశారు. ఈ సంఘటన సమాజంలో ఇప్పటికీ ప్రబలంగా ఉన్న కుల అణచివేత, భయాందోళనలను ఎత్తి చూపుతుంది. ఈ దాడి కుల ఆధారిత అణచివేత, భూయాజమాన్యం కఠినమైన వాస్తవాన్ని బహిర్గతం చేయడమే కాకుండా కార్పొరేట్ కాషాయ ఫాసిస్ట్ వ్యవస్థ క్రూరమైన కుల నిర్మాణాన్ని ఎలా దోపిడీ చేస్తుందో చూపిస్తుంది. నవాడా సంఘటన మాత్రమే కాదు, భారతదేశంలో దళితులపై అఘాయిత్యాలకు సుదీర్ఘ చరిత్ర ఉంది. దేశవ్యాప్తంగా దళితులు, అణగారిన వర్గాలపై అణచివేత నిరంతరం కొనసాగుతోందని ఇటీవలి సంఘటనలు తెలియజేస్తున్నాయి.

**హత్రాస్, ఉత్తరప్రదేశ్ (సెప్టెంబర్ 2020) :** 19 ఏళ్ల దళిత యువతిపై అత్యాచారం, హత్య దేశాన్ని కుదిపేసింది. ఫాసిస్ట్ యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం కుల ఆధారిత పక్షపాతంతో పాటు పోలీసుల ఆదిత్యనాథ్ దుష్పరిపాలన వెలుగులోకి వచ్చింది. ఘటనను కప్పిపుచ్చేందుకు బాలిక మృతదేహాన్ని రాత్రిపూట రహస్యంగా దహనం చేశారు. కేరళకు చెందిన సిద్ధిక్ కప్పన్ వంటి కేసును నివేదించిన జర్నలిస్టులు బిజెపి ప్రభుత్వంచే హింసించబడ్డారు. ఇక్కడ, నేరస్థులు రాజ్‌పుత్ ఠాకూర్ కులానికి చెందినవారు. అయితే ప్రధాన స్రవంతి మీడియా ఈ వాస్తవాన్ని ఎత్తి చూపటంలో విఫలమైంది.

**ఉనా, గుజరాత్ (2016) :** చనిపోయిన ఆవు చర్మం ఒలిచినందుకు నలుగురు దళిత యువకులను బహిరంగంగా కొట్టి పాక్షిక నగ్నంగా ఊరేగించారు. సాంస్కృతిక సమూహంగా చెప్పుకునే ఆర్‌ఎస్‌ఎస్‌తో అనుబంధంగా ఉన్న సంస్థ ఈ క్రూరమైన దాడికి నాయకత్వం వహించింది.

**గోహ్రీ, అలహాబాద్, ఉత్తరప్రదేశ్ (2021) :** యోగి ఆదిత్యనాథ్ మొదటిసారి పాలనలో, భర్త, భార్య, యుక్తవయస్సులో ఉన్న కుమార్తె, వికలాంగ కొడుకుతో సహా మొత్తం దళిత కుటుంబాన్ని ఒక శక్తివంతమైన భూస్వామ్య యాజమాన్యం హత్య చేసింది. హత్యకుముందు తల్లీ కూతుళ్లపై సామూహిక అత్యాచారం చేశారు. ఇప్పటికి కూడా పోలీసులు నిందితులపై చర్యలు తీసుకోలేదు.

**ఉన్నావ్, ఉత్తరప్రదేశ్ (2020) :** దళిత బాలికపై అత్యాచారం చేసి చంపడానికి ప్రయత్నించిన బీజేపీ ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సెంగార్ ఈ కేసులో నిందితుడు. ఆ దళిత కుటుంబంలోని పలువురిని కూడా హత్య చేశాడు. అతని రాజకీయ మద్దతు కారణంగా, అతన్ని అరెస్టు చేయడం, విచారించడం సవాలుగా మారింది. హత్రాస్, గోహ్రీ ఘటనల మాదిరిగానే ఈ కేసులో ఇప్పటికీ తగిన న్యాయం జరగలేదు.

**విల్లుపురం, తమిళనాడు (2021) :** అగ్రవర్ణ సభ్యులు దళితులపై దాడి చేసి, వారిపై నిరంతరం ఒత్తిడి తెస్తూ, వారికి భూమి, నీరు వంటి ప్రాథమిక వనరులను లేకుండా చేశారు. వారిని వారి భూముల నుంచి వెళ్లగొట్టేందుకు అనేక వ్యూహాలు పన్నారు.

**ఔరయ్య, ఉత్తరప్రదేశ్ (ఏప్రిల్ 2023) :** ఊరి బావి నుంచి నీళ్ల కోసం ప్రయత్నించిన దళిత కుటుంబంపై అగ్రవర్ణాల వర్గం దాడి చేసింది. వారిపై చర్యలు తీసుకోకుండా, దళిత కుటుంబంపై బిజెపి నేతృత్వంలోని పోలీసులు తప్పుడు కేసులు పెట్టారు.

**సాగర్, మధ్యప్రదేశ్ (జూన్ 2023):** బిజెపి పాలనలో, అగ్రవర్ణానికి చెందిన వ్యక్తితో ఎదిరించి మాట్లాడినందుకు దళిత యువకుడిని కొట్టి చంపారు. బిజెపి పాలిత సిధి జిల్లాలో, బిజెపి పాలనలో కుల ఆధారిత అణచివేత ఎలా కొనసాగుతోందో ప్రతిబింబిస్తూ ఒక బ్రాహ్మణ నాయకుడు ఆదివాసిపై మూత్ర విసర్జన చేశాడు. దళితులు, ఆదివాసీలు భారతదేశంలో చాలా వరకు కుల ఆధారిత అఘాయిత్యాలను ఎదుర్కొంటున్నారు. ఇటువంటి సంఘటనలు పదేపదే జరుగుతున్నాయి. 2020 నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) నివేదిక ప్రకారం, దళితులపై 50,291 అట్రాసిటీ కేసులు నమోదయ్యాయి. మోడీ పాలనలో గత దశాబ్దంలో దళితులు, ఆదివాసీలపై అఘాయిత్యాలు బాగా పెరిగాయి, సమాజంలో కుల ఆధారిత అణచివేత లోతైన మూలాలను వెల్లడిస్తున్నాయి. సామాజిక న్యాయం, సమానత్వం వాదనలు ఉన్నప్పటికీ, బ్రాహ్మణ అగ్రవర్ణాలు ఇప్పటికీ చాలా వ్యవసాయ సాగు భూమిని నియంత్రిస్తున్నారు. దళితులకు ఆస్తి, విద్య, భూమిని అందకుండా చేస్తున్నారు. వారిని ఆర్థికంగా బలహీన పరుస్తున్నారు. నేడు, ఫాసిస్ట్ ఆర్‌ఎస్‌ఎస్, దాని రాజకీయ సాధనం, ఆ భాజపా, దళితులు, ఆదివాసీలు, శ్రామిక-వర్గాల ప్రజలు, మైనారిటీలు-ముఖ్యంగా ముస్లింలు, మహిళలపై అణచి వేతను వేగవంతం చేస్తున్నాయి. క్రూరమైన మనుస్మృతి ద్వారా ప్రేరణ పొందిన ఈ ఫాసిస్ట్ ఎజెండా, దళితులు, మహిళలు, ఓబిసిలు, ఆదివాసీలు,ఇతర అట్టడుగు వర్గాలను తిరస్కరిస్తుంది. బదులుగా వారిని శక్తివంతమైన బ్రాహ్మణీయ ఉన్నత వర్గాలకు బానిసలుగా పరిగణిస్తుంది. ఫాసిస్ట్ సంఘ్ పరివార్ ఊహించిన హిందుత్వ రాజ్యం అదానీ,అంబానీ వంటి అవినీతి కార్పొరేట్ మాగ్నెట్‌ల ఆధిపత్యం (క్రోనీ కాపిటలిజం)క్రింద ఇక్కడ 80% మంది అణచివేతకు గురి అవ్వటం తప్ప మరేమీ కాదు. ఈ హిందుత్వ రాజ్యానికి పునాది క్రూరమైన కుల వ్యవస్థ, దీనిని ఆర్‌ఎస్‌ఎస్, దాని అనుబంధ సంస్థలు ఆమోదించాయి. చారిత్రాత్మకంగా, వలసవాద, వలస పాలనానంతర పాలనల కింద, పాలక వర్గాలు (సామ్రాజ్యవాద యజమానులతో కూటమిగా ఉన్న పెట్టుబడిదారీ, భూస్వామ్య ఉన్నతవర్గాలతో కలిసాయి), వారి ప్రయోజనం కోసం కుల వ్యవస్థను కొనసాగించాయి, బలోపేతం చేశాయి. కార్పొరేట్-పెట్టుబడిదారీ, ఆర్‌ఎస్‌ఎస్-మనువాద ఫాసిస్ట్ కూటమి పేద దళితులను నిరంతరం దోపిడీకి, అణచివేతకు గురిచేసే క్రూరమైన కుల వ్యవస్థను సృష్టిస్తుంది. అసమానత, ద్వేషం, విభజన కొనసాగినప్పుడు కార్పొరేట్ పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందుతుంది. ఈ అసమానతను కాపాడుకోవడానికి కులగోడలు బలమైన సాధనం.

ఫాసిస్ట్ ఆర్‌ఎస్‌ఎస్, భాజపా "హిందూ ఐక్యత" గురించి మాట్లాడుతున్నప్పుడు, దళితులపై దౌర్జన్యాలపై మౌనంగా ఉంటున్నారు. ఎన్నికల సమయంలో దళితులు, ఆదివాసీలు, ఓబీసీలను తమ హిందుత్వ బంధం కోసం గుర్తు చేసుకుంటే తప్ప,శూద్రులను (ఓబిసీలు) లేదా అతి-శూద్రులను (దళితులు/ అణగారిన కులాలు) సనాతనీ హిందూ మతంలో భాగంగా ఎన్నడూ పరిగణించలేదు. వారి రాజకీయ ఎజెండా కార్పొరేట్ సంపద ఆధిపత్యాన్ని కొనసాగించడం, హిందూ ఐక్యత ముసుగులో అగ్రవర్ణాల అధికారం లేదా హిందువులు ప్రమాదంలో ఉన్నారు అని అనటం. మనువాద కుల అణచివేత, కార్పొరేట్ పెట్టుబడిదారీ దోపిడీ లోతుగా పెనవేసుకున్నాయని నవాడా సంఘటన మనకు బోధిస్తోంది. ఈ కార్పొరేట్ కాషాయ మనువాద వ్యవస్థను సవాలు చేయకుంటే దళితులు, అణగారిన వర్గాల బాధలు కొనసాగుతూనే ఉంటాయి. వెనుకబడిన కులాలు, దళితులలోని కొన్ని విభాగాలు మహాదళితులను లేదా దళిత సమాజంలోని అత్యంత అణచివేతకు గురైన వారిని నిర్లక్ష్యం చేయడం అనే సమస్య కూడా ఉంది. 80% దళితులు, ఓబీసీలు, ఆదివాసీలు గుర్తింపు రాజకీయాలపై తమలో తాము పోరాడుతూ ఉండాలని ఆర్‌యస్‌యస్ ఖచ్చితంగా కోరుకుంటున్నది. ఈరోజు మనం మహాదళితులు లేదా అత్యంత వెనుకబడిన దళితులకు కూడా కుల ప్రాతిపదిక కోసం పోరాడాలి.దళితులు, అణగారిన దళితులందరితో కలిసి కుల జనాభా గణన కోసం డిమాండ్‌ను ప్రచారం చేయాలి. తద్వారా సామాజిక న్యాయం కోసం పోరాటం ప్రబలంగా ఉంటుంది. కులాల కోసం ఐక్య పోరాటాన్ని నిర్మించాలి. తద్వారా సామాజిక న్యాయం వెల్లివిరుస్తుంది.కుల రహిత, లౌకిక, లింగ-సమాన, శాస్త్రీయంగా ప్రగతిశీల దోపిడీ రహిత సమాజం కోసం ఐక్య పోరాటాన్ని నిర్మించాలి. కులం, పెట్టుబడి మధ్య పొత్తు దళితులకే కాదు, మొత్తం శ్రామిక వర్గానికి ముప్పు.

దోపిడీకి గురవుతున్న ప్రజానీకం కులం, మతాల అడ్డుగోడలను ఛేదించి సంఘటితం కావాల్సిన సమయం ఇది. ఇది కేవలం దళితుల సమస్య కాదు ఇది మొత్తం సమాజానికి సంబంధించిన సమస్య. కార్పొరేట్ పెట్టుబడిదారీ విధానం, కాషాయ మనువాద కులతత్వం కూటమిని అంతం చేయడం ద్వారా, 80% పేదలు, అణగారిన,శ్రామిక-వర్గాల ప్రజలు/బహుజనులు సమాన హక్కులు, గౌరవం, న్యాయం పొందగలిగే సమాజాన్ని మనం సృష్టించగలము. కార్పొరేట్ కాషాయ మనువాద ఫాసిస్టు శక్తులను నాశనం చేద్దాం!



బందు మేశ్రం, ఎం.కె. దాసన్, తుహిన్
(కుల నిర్మూలన ఉద్యమ సమన్వయ కమిటీ తరఫున, న్యూఢిల్లీ)
9890269435,9425560952,
9447809149

# వెయ్యి పెన్షన్‌తో బతుకుడెట్ల?





ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్,
విశ్లేషకులు
9951865223

35 నుంచి 40 ఏండ్లు బొగ్గు బావుల్లో తమ రక్తాన్ని చెమటగా మార్చి, రాక్షసి బొగ్గును వెలికి తీసి,కోట్ల మంది వెలుగులో ఉండే విధంగా విద్యుత్ ఉత్పత్తి కి కారణం అవుతున్న రిటైర్డ్ బొగ్గు గని కార్మికుల జీవితాలు కరువులో అధిక మాసాన్ని ఎదురుకుంటున్నాయి. 1998 నుంచి బొగ్గు గని కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పిస్తున్నారు. అప్పట్లో అంటే ఆరు, ఏడు వేజి బోర్డు ల మధ్యన, వాటి పరిధిలో పదవీ విరమణ చేసిన కార్మికులకు వెయ్యి లోపు పెన్షన్ వస్తుంది. కొందరికి 2 వేల లోపు వస్తున్నది.వీరు ఒక రెండు లక్షల మంది దాకా దేశం మొత్తంలో ఉంటారు. రిటైర్డ్ అయ్యాక వీరికి వస్తున్న వెయ్యి రూపాయల పెన్షన్ తో ఒక్కరు కూడ బతికే పరిస్థితి లేదు, భార్య కూడా ఉంటే ఇద్దరు ఎట్ల బతుకుతారు! ఇప్పుడున్న నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటాయి. ఒక్క రోజు కనీసం ఐదు వందల నుంచి వెయ్యి రూపాయలు సంపాదించే వారే అతి కష్టంగా బతుకుతున్న పరిస్థితి ఉన్నది.



**రోజుకు 33 రూపాయలే..**

ఇందులో నెలకు వెయ్యి అంటే రోజుకు 30 నుంచి 33 రూపాయలు ఆదాయం,రెండు వేలు పెన్షన్ అయితే రోజుకు 60 రూపాయల సంపాదన! నెలకు పాతిక కేజీ ల బియ్యం కూడ కొనుగోలు చేయలేని పెన్షన్ కూడ లేని, రిటైర్డ్ బొగ్గు గని కార్మికులు ఎట్ల బతుకుతారు!వారికి ఆ రోజు లెక్కన వచ్చే డబ్బులతో కనీసం కిలో టమాటా రాదు! ఒక డబుల్ రొట్టె కూడ రాదు. ఇంత దుర్భరమైన స్థితి గతులు రిటైర్డ్ బొగ్గు గని కార్మికులవి ఉన్నాయి. ఏదో కొంత కొడుకులు, బిడ్డలు ఉద్యోగాలు చేస్తూ ఉన్నవారు కొంత బెటర్‌గా ఉన్నారు. ఒంటరుల పరిస్థితి, ఉద్యోగాలు లేని పిల్లలు, పెండ్లిళ్లు కాకుండా ఉద్యోగాలు దొరకక ఇంకా రిటైర్డ్ దశలోనూ కార్మికుల మీదే ఆధారపడి బతుకుతున్న వారి పరిస్థితిని ఊహించుకుంటేనే కండ్లు నీళ్లు తీసుకుంటాయి. ఆరోగ్యం, మందులు, ఆ ఖర్చు, ఈ ఖర్చు, కాస్త ఏదైనా ఇంత తినబుద్ది అయినపుడు, సినిమా లాంటిది చూడబుద్ది అయినపుడు, కోరికలను, ఆశలను చంపుకుని జీవించే పరిస్థితి వచ్చింది. ఒకప్పుడు ఎలాంటి విషయానికి, ఖర్చుకు కూడ వెనుకాడలేదు!

**ఖర్చుకు వెనుకాడని చేతులకు కష్టాలు**

సింగరేణిలో ఉద్యోగాలు చేసేటపుడు వెనుకాడని చెయ్యి, ఇప్పుడు పూర్తిగా బయటకు, స్వేచ్ఛగా బయటకు తీసే పరిస్థితి లేదంటే అతిషయోక్తి కాదు. ఒకప్పటి ఆపన్న హస్తానికి, ఓపెన్ హార్ట్స్, ఓపెన్ హాండ్స్ కు కష్టం వచ్చింది. ఆ దుఃఖం తో పూలు అమ్మిన కాడ కట్టెలు అమ్మినట్లు, స్కూల్, కాలేజ్, అపార్ట్మెంట్ వాచ్మెన్ పనులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వచ్చే పెన్షన్ ఎటూ సరిపోక,రెస్ట్ తీసుకోవాల్సిన చేతులు, అలసిపోతున్నప్పటికి, నడవలేక కాళ్ళు తడబడుతున్నా, ఏదో ఒక పనికి పోతున్న రిటైర్డ్ కార్మికుల జీవితాల ను, ముఖ్యంగా, వెయ్యి, రెండు వేల లోపు పెన్షన్ తీసుకొంటున్న వారిని చూస్తుంటే ఆందోళన కలుగుతున్నది. ఒకప్పుడు సర్వీస్ లో ఉండి నలుగురికి అన్నం పెట్టిన ఆ చేతుల నిస్సహాయత ను చూడలేని పరిస్థితి ఉన్నది.

**30న పెన్షన్ పెంపు మీద ఢిల్లీలో చర్చలు**

ఈ నెల 19న దేశావ్యాపితంగా ఉన్న ఈపిఎఫ్, జిల్లా కలెక్టర్ల కార్యాలయాల ముందు జాతీయ బిఎంఎస్ పిలుపు మేరకు ఈపిఎఫ్ 95 పెన్షన్ స్కీం సవరించాలని, కనీస పెన్షన్ వెయ్యి నుంచి 5 వేలకు పెంచాలని, డిఎ లింకు చేయాలని, అధిక పెన్షన్ అమలు చేయాలని ఆందోళనలు నిర్వహించింది. ఫలితంగా కేంద్రం ఒక సబ్ కమిటి వేసింది. ఇందులో బిఎమ్ఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఈపిఎఫ్ ట్రస్ట్ సభ్యుడు ఎస్. మల్లేషంను కూడ నియమించారు. మిగిలిన యూనియన్ సభ్యులు, అధికారులు, యాజమాన్యం సభ్యులు ఉన్నారు. కనీస పెన్షన్ ను 5 వేలకు పెంచే విషయం పై ఈ సబ్ కమిటీ సమావేశం ఉంది. అందరి దృష్టి ఈ సమావేశం మీదే ఉన్నది. కాగా కనీస పెన్షన్ పది వేలు ఉండాలని బొగ్గు సంస్థల్లో కార్మిక సంఘాలు, కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. రిటైర్డ్ కార్మికుల బతుకుల ను చూసి అయినా పెన్షన్ పెంచాలి.

## పోరాటాల పొద్దు పొడుపు చాకలి ఐలమ్మ




ఏమేమి పువ్వు ఒప్పునే గౌరమ్మ, ఏమేమి కాయొప్పునే గౌరమ్మ అంటూ అమ్మలక్కల పాటలతో, సింగిడి సింగారాలతో, విరగబూసిన మందారాలతో ప్రకృతి పరవసిస్తున్న వేళ సద్దుల బతుకమ్మ పండుగ నాడు, 1895 సెప్టెంబర్ 26న వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కిష్టాపురంలో పుట్టిందొక్క బతుకమ్మ. ఆమే చిట్యాల ఐలమ్మ, అలియాస్ చాకలి ఐలమ్మ. కళ్లలో కాంతి, తెల్లటి ముగ్గు గిన్నె లాంటి తల, ముడుతలు వారిన దేహం కాదూ చాకలి ఐలమ్మ అంటే, ఆకలి మంటలు, కడుపు కోతలు,అవమానాలు ఎదురుకుంటున్న వర్గాల తరుపున అగ్గి భరాట అయి మండిన వీర వనిత చాకలి ఐలమ్మ. దొరల పెత్తనాన్ని, రజాకార్ల రాక్షసత్వాన్ని ఉక్కు పిడికిలితో ఎదురుకున్న బలహీన వర్గాల బిడ్డ. చిన్నతనంలోనే ఐలమ్మకు చిట్యాల నర్సయ్యతోని పెళ్లి అయింది. నలుగురు కొడుకులు, ఒక్క బిడ్డ. ఉన్నత లక్షణాలు కలిగిన ఐలమ్మ కులవృత్తితోని కుటుంబాన్ని సాకలేమని, పాలకుర్తి మండలం మల్లంపల్లి దొరల నుంచి భూములు కౌలుకు తీసుకున్నది. ఐలమ్మ కష్టాన్ని, అందరిని కలుపుకపోయే తత్వాన్ని, తోటివాళ్లకు పనుల్లో ఆసరా అయ్యే విధానాన్ని చూసి ఓర్చుకోలేకపోయాడు విస్నూరు గ్రామ దేశ్ ముఖ్ రాపాక రామచంద్రారెడ్డి. దొరల గడీల్లో వెట్టి చాకిరి చేసుకోవాల్సిన ఐలమ్మ ఎకరాల కొద్ది పంట సాగు చేయడం సహించలేకపోయాడు. ఆమె పండించిన పంటను గూండాల సాయంతో ఎత్తుకపోతాడు. అయితే ఈ సమయంలోనే ఆంధ్ర మహాజన సభ కార్యకర్తలు, గుత్పల సంఘం సభ్యులు, గ్రామస్థుల సహకారంతో దేశ్ ముఖ్ దొర రౌడీలను తరిమికొట్టి ఐలమ్మ ధాన్యాన్ని కాపాడుకుంది. దేశ్ ముఖ్ దొర కిరాయి మూకను ఐలమ్మ ఎదురించిందన్న కారణంతో...రజాకార్లు ఆమె ఇంటిని తగలబెట్టి, బిడ్డపై అత్యాచారం చేసిన పోరాటం ఆపలేదు.

**"రజాకార్ల దాడులకు భయపడని వీర వనిత"**

అప్పటికే నిజాం నవాబుకు, రజాకార్లకు, భూస్వాములకూ వ్యతిరేకంగా కమ్యూనిస్టులు కొట్లాడుతున్నారు. అయితే ఐలమ్మ పోరాట స్ఫూర్తితో కమ్యూనిస్టులు ఇంకింత రెట్టించిన ఉత్సాహంతో ఎర్రజెండాలు పట్టుకోని రజాకార్లతో పోరాటానికి దిగింద్రు. ఈ సమయంలో తన ఇంటినే సాయుధ పోరాటానికి కార్యాలయంగా చేసింది. పాలకుర్తి దొర గఢీ మీద దాడి చేసి ధాన్యాన్ని, 90 ఎకరాల భూమిని ప్రజలకు పంచారు. ఐలమ్మ స్ఫూర్తితోని సాగిన సాయుధ పోరాటంలో వేలాదిమంది అమరులైయ్యారు. ఈ ఉద్యమంలో పెత్తందారులకు చెందిన పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచారు. ఐలమ్మ 1985 సెప్టెంబర్ 10న 90 ఏళ్ల వయస్సులో ఆరోగ్యం సహకరించక చనిపోయింది. ఐలమ్మ బతికినంత కాలం పోరాటమే ఊపిరిగా, పలు ఉద్యమాలకు స్ఫూర్తిగానే బతికింది. ఐలమ్మ స్ఫూర్తితోనే ఇందిరా గాంధీ పేదలకు భూముల మీద హక్కులు, పీవీ నర్సింహారావు భూ సంస్కరణలు చేశారు అనేది ముఖ్యమంత్రి రేవంత్ చెప్పింది అక్షర సత్యం. ఆపదలో ఉన్నప్పుడు కష్టాలు సమీపించినప్పుడు మహిళలు ఐలమ్మ పోరాటాన్ని గుండెల నిండా నింపుకోని ముందుకు నడవాలి. ఇన్నేండ్ల తరువాత తెలంగాణ గవర్నమెంట్ కోఠిలోని మహిళ యూనివర్సిటీకి ఆమె పేరు పెట్టడం, మనవరాలు శ్వేతను ప్రభుత్వంలో భాగం చేయడం సంతోషం, అభినందనీయం. కానీ అప్పుడెప్పుడో ప్రజలు ఇచ్చిన విరాళాలతో, వామపక్ష పార్టీలు పాలకుర్తిలో నిర్మించిన ఐలమ్మ స్మారక భవనం ఎలాంటి కార్యక్రమాలు, నిర్వహణ లేకపోవడంతో శిథిలావస్థలో ఉంది. ఈ భవనాన్ని వినియోగంలోకి తీసుకొచ్చి, ఆమె పోరాటాన్ని పాఠ్యాపుస్తకాల్లో చేర్చి, ట్యాంక్ బండ్ మీద ఆమె విగ్రహాన్ని పెట్టి భావితరాలకు కూడా స్ఫూర్తి కలిగించాలి పాలకులు.



మిడివెల్లి సంతోష్
సీనియర్ జర్నలిస్ట్, 9676036800

# పర్యావరణ ఆరోగ్యం అవసరమే..!

మానవాళి అభివృద్ధిలో పర్యావరణం కీలకపాత్ర పోషిస్తుంది. పర్యావరణం ఎంత ఆరోగ్యంగా ఉంటే మనం అంత ఆరోగ్యంగా ఉంటాం. మన చుట్టూ జీవ, నిర్జీవ అంశాలన్నింటినీ పర్యావరణం అంటారు. పర్యావరణ ఆరోగ్యం అనేది ప్రజారోగ్యంలోని అతిపెద్ద రంగాలలో ఒకటి. ఒక నిర్దిష్ట ప్రాంత భౌతిక రసాయన, సాంస్కృతిక వాతావరణాన్ని ఆ ప్రాంతం యొక్క పర్యావరణ ఆరోగ్యం అంటారు. ఇది ఆ ప్రాంతం యొక్క కాలుష్య స్థాయి, జీవావరణంలో వైవిధ్యం, పరిశుభ్రమైన త్రాగునీరు అందుబాటు , పారిశుధ్య పరిస్థితులు, వ్యవసాయ ఉత్పాదకత మీద ఆధారపడి ఉంటుంది. ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణ సమస్యల కారణంగా ప్రతి సంవత్సరం ఒక కోటి అరవై లక్షలకు పైగా మరణాలు సంభవిస్తున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక తెలిపితుంది. అంతేకాక వందకు మించి అనారోగ్యాలు నేరుగా పర్యావరణ ఆరోగ్య సమస్యలతో ముడిపడి ఉంటాయని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా 155 దేశాలు తమ పౌరులకు జాతీయచట్టం లేదా అంతర్జాతీయ ఒప్పందాల మేరకు ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించే హక్కును కలిగి ఉన్నా కూడా భూ,వాయు,జల, వాయు, రసాయన కాలుష్యాల లాంటి "పర్యావరణ ప్రమాదాల"తో ఇరవై మూడు శాతం మరణాలు సంభవిస్తున్నాయని నివేదించడం గమనార్హం. పర్యావరణంలో మార్పులు ప్రజల జీవనోపాధికి ఆహార భద్రతకు ముప్పు తెస్తుంది. గత పది సంవత్సరాలు నుండి చూస్తే వాతావరణం వేడి పెరుగుతూ వస్తుంది. ఇందులో శిలాజ ఇంధనాల వాడకం పెరిగిన కారణంగా భూతాపం పెరుగుతోంది. ప్రపంచ సగటు ఉష్ణోగ్రత 1.15 డిగ్రీల సెంటీ గ్రేడ్ పెరిగింది. అడవులు తగలబడడం, అకాల వరదలు , తుఫానులు సాధారణం అయిపోయాయి. వాతావరణ మార్పు సూక్ష్మజీవుల మనుగడను, వైరస్ల వ్యాప్తిని సులభతరం చేస్తుంది. యేల్, కొలంబియా విశ్వవిద్యాలయాలచే తయారు చేయబడిన ఎన్విరాన్‌మెంటల్ పెర్ఫార్మెన్స్ ఇండెక్స్ (ఇపిఐ) 2024 ప్రకారం మొత్తం 180 దేశాలలో ఎస్టోనియా (75.3 ), లక్సెంబర్గ్ (75.0), జర్మనీ (74.6) ఫిన్లాండ్ (73.7), యునైటెడ్ కింగ్‌డమ్ (72.7) మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి. మనదేశం 27.6 స్కోర్‌తో 176వ స్థానంలో నిలిచింది. వాయు నాణ్యత, ఉద్గారాలు, జీవవైవిధ్య పరిరక్షణతో సహా అనేక రంగాలలో భారతదేశ పనితీరు పేలవంగా ఉందని ఇపిఐ తెలిపింది. మనదేశం బహుళ రంగాలలో స్థిరత్వాన్ని సాధించడంలో గణనీయమైన సవాళ్లను ఎదుర్కొంటుంది. వాతావరణ, పర్యావరణ లక్ష్యాలను చేరుకోవడానికి సంవత్సరానికి 160 బిలియన్ల యుఎస్ డాలర్ల ఆర్థిక పెట్టుబడులు అవసరం.




**పర్యావరణంలో సవాళ్లు:**

2023 చివరి నాటికి వాతావరణములో కార్బన్డైఆక్సైడ్ 420 పార్ట్స్ పర్ మిలియన్ ఉంది. ఇది గ్లోబల్ వార్మింగ్‌కు దారి తీస్తుంది. అంటార్కిటికాలో ఉష్ణోగ్రతలు మొదటిసారిగా 20 డిగ్రీల సెంటీగ్రేడ్ కంటే ఎక్కువ పెరిగాయి. ఆర్కిటిక్ ప్రాంతాలలో శాశ్వత మంచు కరుగుతుంది. క్షీరదాలు, చేపలు, పక్షులు, సరీసృపాలు, ఉభయచరాల జనాభా పరిమాణాలు 1970 నుండి 2016 మధ్య సగటున 68 శాతం క్షీణతను చవిచూశాయని ప్రపంచ వన్యప్రాణి నిధి ( వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ ) ఈ మధ్యనే ఒక నివేదికలో తెలిపింది. దీని వలన జీవ వైవిధ్యం దెబ్బ తినే ప్రమాదం ఉంది. పట్టణీకరణ, పంటలు, పశువుల పెంపకానికి , కాగితాలు తయారు చేయడానికి ప్రపంచ వ్యాప్తంగా ప్రతీ సంవత్సరం 1 కోటి హెక్టార్లకు పైగా చెట్లను నరుకుతున్నారు. ఇది అటవీ నిర్మూలనకు కారణమవుతుంది. మరో అతిపెద్ద పర్యావరణ సమస్యలలో వాయుకాలుష్యం ఒకటి. దీని కారణంగా ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం 42 లక్షల నుండి 70 లక్షలు మంది మరణిస్తున్నారు. ప్రతీ పదిలో తొమ్మిది మంది అధిక స్థాయి కాలుష్య కారకాలను కలిగి ఉన్న గాలిని పీల్చుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. భూమిపై ఉన్న సముద్రామట్టం సంవత్సరానికి సగటున 3.2 మిమీ పెరుగుతున్నాయి. ఈ శతాబ్దం చివరి నాటికి అవి దాదాపు 0.7 మీటర్ల వరకు పెరిగే అవకాశం ఉందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ పెరుగుదల సముద్ర తీరప్రాంతం ముంపునకు గురై అక్కడ నివాసముండే సుమారు 34 నుండి 48 కోట్ల ప్రజలు సురక్షితమైన ప్రాంతాలుకు వలస వెళ్ళడం కారణంగా వారు వెళ్ళే ప్రాంతాలలో జనాభా పెరగడమే కాకుండా, అక్కడ ఉండే వనరులు అధిక వినియోగానికి గురవుతాయి. ప్రతి గంటకు 300 ఫుట్‌బాల్ మైదానాల పరిమాణంలో అడవులు నరికివేయబడుతున్నాయి. ఇలా కొనసాగితే 2030 నాటికి ఇప్పుడున్న అడవులలో 10% మాత్రమే కలిగి ఉండవచ్చు. రాబోయే 100 సంవత్సరాల లోపులోనే అడవులన్నీ నాశనమయ్యే ప్రమాదం ఉంది. మహాసముద్రాలు భూమి యొక్క వాతావరణంలోకి విడుదలయ్యే కార్బన్డయాక్సైడ్‌లో 30% గ్రహిస్తాయి. వాతావరణంలోని అధిక కార్బన్ డయాక్సైడ్ వలన సముద్ర జలాలు ఆమ్లీకరణ అవడం వలన 2050 నాటికి పగడపు దిబ్బలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు పరిశోధనలలో తేల్చారు. ఆరోగ్యకరమైన నేలలో కనీసం 3 నుండి 6% సేంద్రీయ పదార్థం ఉంటుంది. అయితే ప్రపంచంలో దాదాపు ప్రతిచోటా ఉండవలసిన దాని కంటే చాలా తక్కువగా ఉంటుంది. ఇది నేల కోతకు సంకేతం.

**పరిష్కారాలు:**

వాహనాలకు వాడే పెట్రోలులో ఇథనాల్ శాతం పెంచాలి. విద్యుత్ ఆధారిత వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాలి. హరిత వాయువులు విడుదల చేసే పరిశ్రమలను మూసివేయాలి. నిబంధనలు పాటించని వారిపై చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలి. కార్బన్ పన్నులు విధించాలి. పంటలలో రసాయనక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రీయ పద్ధతులలో వ్యవసాయాన్ని చేపట్టాలి. అటవీ నిర్మూలనను అడ్డుకోవాలి. అక్రమ మైనింగ్ చేసే వారిపై ఉక్కుపాదం మోపాలి. కాగితం నుండి డిజిటల్ కు మారాలి. సింగిల్ యూస్ ప్లాస్టిక్లను నిషేధించాలి. నీటి కాలుష్యాన్ని ఆపాలి. నదుల అనుసంధానం చేయడం వలన వరదల ప్రభావాన్ని తగ్గించవచ్చు. ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రజలలో చైతన్యం కలిగించాలి. పర్యావరణ ఆరోగ్యాన్ని కాపాడటంలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యమై మనందరి ఆరోగ్యాన్ని కాపాడుకుందాం.



జనక మోహన రావు దుంగ
ఫోన్ : 8247045230

## ఢిల్లీ ముఖచిత్రంపై ఆతిశీ..!



అవినీతి రహిత భారత్ లక్ష్యంగా అన్నా హజారే దీక్ష సందర్భంగా వార్తల్లో కెక్కిన అరవింద్ కేజ్రీవాల్ ఆప్ జాతీయ కన్వీనర్ గా,ఢిల్లీ ముఖ్యమంత్రి గా దశాబ్దకాలం నుంచి జాతీయ రాజకీయాల్లో క్రియాశీలకంగా వున్నారు.ఊహించని పరిణామాల నేపథ్యంలో మద్యం కుంభకోణం కేసులో జైలుకు వెళ్లి ఇటీవలే విడుదలై తన సీఎం పదవికి రాజీనామా చేయడంతో అనూహ్యంగా 43 ఏళ్ల ఆతిశీ ఢిల్లీ ముఖ్యమంత్రిగా శనివారం ప్రమాణస్వీకారం చేశారు.షీలా దీక్షిత్, సుష్మా స్వరాజ్ తర్వాత ఢిల్లీ మూడవ మహిళా ముఖ్యమంత్రి గా చరిత్ర నెలకొల్పారు.కేజ్రీవాల్ భవిష్యత్తు రాజకీయ కార్యాచరణ, వ్యూహాలు ఎలా వున్నా నేడు ఢిల్లీ ముఖచిత్రంగా ఆతిశీ దేశవ్యాప్తంగా ఓ సంచలనం అయ్యారు.నేటి యువతరానికి స్ఫూర్తిని పంచే ఓ పాత మయ్యారు. ఉన్నత విద్యావంతురాలుగా వున్నప్పటికీ సామాన్య జీవనం కొనసాగిస్తూ ఓ టీచర్ గా, సామాజిక కార్యకర్త గా, సామాన్య రైతుగా అన్నింటికీ మించి దేశవ్యాప్తంగా ధనిక , పేద తేడా లేకుండా అందరికీ సమానంగా ఉచిత విద్య,వైద్యం అందాలని ఆరాటపడే సగటుమనిషి ఆతిశీ.విద్యాశాఖ మంత్రిగా వుంటూ ఢిల్లీ విద్యా వ్యవస్థలో జ్ఞాన వెలుగులతో కూడిన ఎన్నో విప్లవాత్మక మార్పులు తెచ్చారు.నేడు దేశం మొత్తం ఢిల్లీ విద్యా విధానాలను ఆసక్తిగా గమనిస్తుంది. కేజ్రీవాల్ అరెస్ట్ అయిన తర్వాత 14 మంత్రిత్వ శాఖలను సమర్థంగా నిర్వర్తిస్తూనే, రాజకీయ ప్రత్యర్థులను తన మాటల పదునుతో బలంగా ఎదుర్కోవడంలో ఆతిశీ విజయవంత మయ్యారని చెప్పవచ్చు.సునిశితమైన మాటతీరు,ప్రజా సమస్యలపై ధైర్యంగా ప్రశ్నించే తత్వం,ప్రజలకు సేవ చేయాలనే తపన, కేజ్రీవాల్ ను గురువుగా భావిస్తూ ఆప్ ను రాజకీయంగా ఎదిగేలా చేయగల ఎత్తుగడలు వంటి ఎన్నో ప్రత్యేకతలతోఆప్‌లో ఓ నూతన ఆశాకిరణంగా, జాతీయ రాజకీయాల్లో ఓ కొత్త ఒరవడిని సృష్టించే ఓ (అ)సాధారణ మహిళగా ఆతిశీ నేడు మనకు కనిపిస్తున్నారు.సీఎం గా బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా కేజ్రీవాల్ ఛైర్ లో కాకుండా దాని ప్రక్కన ఇంకో ఛైర్ లో కూర్చోవడం పార్టీ పై తన వినయ విధేయత ప్రదర్శించడమే కాకుండా కేజ్రీవాల్ మళ్ళీ ఢిల్లీ సిఎం గా చూడాలనే తన బలమైన ఆకాంక్షను సమాజానికి తెలియజేసారు. ఏదేమైనా త్వరలో జరగనున్న ఢిల్లీ ఎన్నికలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవు తున్నాయి. కేజ్రీవాల్ రాజకీయ భవిష్యత్తు దేశ రాజకీయాల్లో ప్రముఖ పాత్ర పోషించనుందని ప్రజలు అభిప్రాయపడు తున్నారు.



ఫిజిక్స్ అరుణ్ కుమార్
9394749536

## ఎదురీత

చెట్టుకు వ్రేలాడుతున్న
ఉరిని చూస్తున్నాడు
నీలి నిరాశ తో...

చెట్టుపై చిటారు కొమ్మనుండి
ఎరని చూస్తుంది పక్షి
కెంజాయ ఆశతో...

దృశ్యాలు కనుమరుగయ్యాయి
కంటి ముందు కదిలింది
ఓ జీవిత నిత్య సత్య చిత్రం
ఏటికి ఎదురీదే
వెండి మెరుపుల చేప

రేడియమ్
9291527757

# ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



### కలెక్టర్ శశాంక్, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**శంషాబాద్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి)**

శంషాబాద్ మండలం నర్కుడ గ్రామంలోని అమ్మపల్లి దేవాలయ ప్రాంగణంలో స్వచ్ఛతా-ఈ సేవా కార్యక్రమంలో భాగంగా పచ్చదనం-పరిశుభ్రత పై జిల్లా కలెక్టర్ శశాంక్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి బుధవారం పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కలెక్టర్ శశాంక్ మాట్లాడుతూ..స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రత పై అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని సూచించారు. మన ఇంటి ఆవరణలతో పాటు చుట్టుపక్కల పరిసరాలను శుభ్రం చేసుకోవాల్సిన బాధ్యత మన పైన ఉందన్నారు. అదేవిధంగా స్వచ్ఛదనం పాటిస్తూనే వనోత్సవంలో ప్రతి ఒక్కరూ బాగాస్వామ్యం కావాలన్నారు. మొక్కలను నాటడంతోనే కాదు వాటిని కాపాడాలన్నారు. మనము పర్యావరణాన్ని కాపాడితే మనల్ని పర్యావరణం కాపాడుతుంది అన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ తమ పరిసరాలతో పాటు గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. స్వచ్ఛతా ఈ సేవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగ్యస్వామ్యం కావాలన్నారు. పరిసరాలను శుభ్రం చేసుకోవడం వల్ల డెంగు మలేరియా రోగాల నుంచి మనల్ని మనం కాపాడుకోవాలన్నారు. చెట్లను పెంచి పర్యావరణాన్ని రక్షించాలన్నారు. అనంతరం అమ్మపల్లి ఆలయంలో జిల్లా కలెక్టర్ శశాంక్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సీతారాముల వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి నీరటి తన్వి రాజు, జిల్లా అధికారులు, మండల అధికారులు, వివిధ గ్రామాలకు చెందిన మహిళ సంఘంలు, పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతలు కాపాడటంలో కాంగ్రెస్ విఫలం

### బిఆర్ఎస్ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ కేటీఆర్

**కూకట్ పల్లి సెప్టెంబర్ 25(జనంసాక్షి):**

శాంతి భద్రతల కాపాడే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని అని బిఆర్ఎస్ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. బుధవారం కూకట్ పల్లి నియజికవర్గం లో ఖాజా కుంట చెరువులో ఎస్టీపిలను మాజీ మంత్రులు మహమూద్ అలీ, సబిత ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్ ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, మాగంటి గోపినాద్, మర్రి రాజశేఖర్ రెడ్డి, కెపి వివేక్, కాలేరు యాదయ్య, ఎంఎల్సి శంభిపూర్ రాజు కార్పొరేటర్లతో కలిసి సందర్శించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ..హైదరాబాద్ నగర ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించే ఉద్దేశ్యంతో 4000కోట్ల బడ్జెట్ తో భారతదేశంలో కాకుండా దక్షణ ఆసియా లోనే మొదటి వంద శాతం కలుషిత నీరు శుద్ధి చేసి 1276 ఎంఎల్డి(మిల్ల లీటర్ ఫర్ డే)స్వచ్ఛమైన నీటిని అందించే విషయంలో నగరంగా తీర్చి దిద్దేందుకు గత బిఆర్ఎస్ ప్రభుత్వం 31 ఎస్టీపి లకుశ్రీకారం



చుట్టుంది అన్నారు.ఒక కూకట్పల్లి లోనే 350 కోట్ల వ్యయంతో నాలుగు చెరువులకు ఎస్టిపిలు మొదలు పెట్టన పనుల్లో పూర్తయిన రెండు ప్లాంట్లను సందర్శించడం జరిగింది మిగతా రెండు ప్లాంట్స్ పనులు పూర్తికాగానే మళ్లీ సందర్శిస్తామని తెలిపారు.ఇటీవల ఉప్పల్ లో రేవంత్ రెడ్డి ప్రారంబించిన ఎస్టీపి ను తామే మొదలు పెట్టమన్నారు.గత మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఒక్క కార్పొరేటర్ సీటు కూడా గెలవలేక పోయిందని ఎద్దేవా చేశారు.హైడ్రా పేరుతో ముఖ్యమంత్రి హైడ్రామా చేస్తున్నారని,మహిళల పట్ల చిన్న పిల్లల పట్ల కర్కశంగా వ్యవహరిస్తూ విధ్యరులు తమ పుస్తకాలను తీసుకునే సమయం కూడా ఇవ్వకుండా గర్భిణీల కు మర్యాద ఇవ్వకుండా రోడ్డుపాలు చేస్తున్నారు. త్వరలో బాధిత కుటుంబాలను పరమర్శిస్తామని,పేదలను ఇబ్బంది పెడితే సహించేది లేదు అని హెచ్చరించారు. చీఫ్ జస్టిస్‌ని పెద్దలకు,పేదలకు సమన్యాయం జరిగేలా వ్యవహరించాలి వేడుకున్నారు. ఎవ్వరికీ ఎలాంటి కష్టం వచ్చినా జూబ్లీహిల్స్‌లో ఉన్న తమ కార్యాలయంలోకి వచ్చి బాధలు తమతో చెప్పుకోవచ్చు అని వివరించారు. మొన్న హీరో ఎన్టీ ఆర్ ప్రీరిలీస్ వేడుకలో ప్రజలను నియంత్రణ చేయలేక పోయారు అని ఎద్దేవ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు బారి సంఖ్యలో పాల్గొన్నారు.

# లే అవుట్‌లకు ప్రభుత్వ నిబంధనలను అనుసరించాలి

### జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**

జిల్లాలో లే-అవుట్లకు అనుమతులు మంజూరు చేసే విషయంలో ప్రభుత్వ నిబంధనలను అనుసరించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ స్పష్టం చేశారు.బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిక్ట్ లేఔట్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. లేఅవుట్ల అనుమతుల జారీ విషయంలో అధికారులు అన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సమావేశంలో జిల్లాలోని మక్తల్ మండలానికి సంబంధించి రెండు లేఅవుట్ల కోసం వచ్చిన దరఖాస్తులపై పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి, టౌన్ ప్లానింగ్ అధికారుల నుంచి ఆమె



క్లియరెన్స్ అడిగారు. కాగా వచ్చిన ఆ రెండు లే -అవుట్‌ల అనుమతులు జారీకి ఆయా శాఖల అధికారులు శాఖ పరమైన అభ్యంతరాలు తెలిపారు. సమావేశంలో పిఆర్ ఈఈ హిర్యా నాయక్, ఆర్అండ్‌బి డిఈఈ రాములు, జిల్లా టౌన్ ప్లానింగ్ అధికారి కిరణ్ పాల్గొన్నారు.

# రహదారులపై వరద నివారణకు వాటర్ హెూల్డింగ్ స్ట్రక్చర్

## లక్ష లీటర్ల కెపాసిటీ నుండి 10 లక్షల లీటర్ల సామర్థ్యం గల వాటర్ హెూల్డింగ్ స్ట్రక్చర్

### జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలి కాట

**హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 25(జనంసాక్షి):**

నగరంలో వర్షాలు కురుస్తున్ననేపథ్యంలో రోడ్లపై ఏర్పడిన వరద నివారణ చేసి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిహెచ్ఎంసి అత్యంత కీలకంగా వ్యవహరిస్తుంది.వరదల వలన ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడుతున్న నేపథ్యంలో ప్రధాన రహదారులపై నీరు నిలువకుండా శాశ్వత పరిష్కారానికి లక్ష లీటర్ల సామర్థ్యం నుండి 10 లక్షల లీటర్ల సామర్థ్యం గల వాటర్ హెూల్డింగ్ స్ట్రక్చర్ నిర్మాణలు చేపట్టేందుకు జిహెచ్ఎంసి ప్రతిపాదించింది. ఈ నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా రూ.100 కోట్ల అంచనా వ్యయంతో వినూత్నంగా 50 వాటర్ హెూల్డింగ్ స్ట్రక్చర్ పనులు, నగర వ్యాప్తంగా 18 లోకేషన్లలో 23 వాటర్ హెూల్డింగ్ స్ట్రక్చర్ల నిర్మాణాలు చేపట్టారు. చేపట్టిన సంపుల నిర్మాణాలు వరదతో నిండిపోయిన సందర్భంగా వాటిని ఎప్పటికప్పుడు విద్యుత్ మోటర్లతో స్ట్రామ్ వాటర్ డ్రైన్ లోకి తరలిస్తారు. సంపులో ఎప్పటికప్పుడు నీటి తొలగింపు వలన నీరు



నిలువకుండా పోతుంది. తద్వారా ట్రాఫిక్ సమస్య చెక్ పడుతుంది.నగరంలో ప్రస్తుతం 141 వాటర్ లాగింగ్ పాయింట్ వద్ద వరద నీరు నిలువకుండా 154 మాన్సూన్ ఎమర్జెన్సీ బృందం, 252 స్టాటిక్ బృందాలు పనిచేస్తున్నాయి. వర్షం వస్తుందని వాతావరణ శాఖ సూచనలు రాగానే సర్కిల్ వారీగా ప్రజలను, అధికారులను ముందస్తు గానే హెచ్చరించి సర్కిల్ స్థాయిలో మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్ లను అప్రమత్తం చేయడం జరుగుతుంది. ఇప్పుడు ఉన్న 141 మేజర్ వాటర్ లాగింగ్ పాయింట్ లను భవిష్యత్తులో 50 వాటర్ లాగింగ్ పాయింట్‌లకు మాత్రమే పరిమితం చేయాలని, ఆ దిశగా ప్రణాళికలు రూపొందించాలని కమిషనర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

### భద్రతా చర్యలు

వాటర్ హెూల్డింగ్ స్ట్రక్చర్ (సంపుల) నిర్మాణాల వలన ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా చర్యలు తీసుకోవాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఇంజనీరింగ్ అధికారులకు అదేశించారు. సంపుల వద్ద ప్రమాదాలకు తావివ్వకుండా సరిహద్దులో పటిష్టంగా ఇనుప రాడ్లతో నిర్మాణాలు చేపట్టి అదే విధంగా రాత్రి సమయంలో కూడా విద్యుత్ లైట్స్, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటుగా ఒక ఇంఛార్జిగా భాధ్యత గల అధికారిని పర్యవేక్షణ కు మరొక అధికారిని నోడల్ అధికారిగా నియమించాలి. నాలా భద్రత అడిట్ లో అమలులో ఉన్న విధంగా ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగిన పక్షంలో అతనినే బాధ్యత వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆమ్రపాలి కాట ఇంజనీరింగ్ అధికారులను అదేశించారు.

# తాజ్ మహల్ హెూటల్‌కి షోకాజు నోటీసులు

**హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 25(జనంసాక్షి):**

అబిడ్స్ రోడ్‌లోని తాజ్ మహల్ హెూటల్‌లో పప్పులో పురుగు కనిపించడం గురించి సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో ఈ నెల 24న హెూటల్‌లో



జిహెచ్ఎంసి ఫుడ్ సేఫ్టి అధికారులు తనిఖీలు నిర్వహించారని హెల్త్ అడిషనల్ కమిషనర్ పంకజ తెలిపారు. తనిఖీలో భాగంగా హెూటల్‌లో సరైన పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ, ఆహార పదార్థాల నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని, ఆహార పదార్థాలకు సంబంధించిన ఐటమ్స్ పై లేబుల్స్ లేకపోవడం, నిల్వ చేసే ప్రదేశంలో బొద్దింకలు ఉండటం వంటి అనేక లోపాలు ఆహార భద్రత అధికారులు గమనించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హెూటల్ నిర్వహకులకు సంజాయిషి కోరుతూ షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు ఆమె తెలిపారు. సంజాయిషి అందిన పిమ్మట తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి





- ధరణి సమస్యలు వెంటనే పరిష్కరించాలి
- సమస్యలుంటే నేరుగా సంప్రదించండి
- రోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి
- బుదేరాలో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పరిశీలన
- కలెక్టర్ వల్లూరు క్రాంతి సుడిగాలి పర్యటన

**సంగారెడ్డిప్రతినిధి,మునిపల్లి సెప్టెంబర్ 25(జనంసాక్షి)**

విద్యార్థులు భవిష్యత్తుకు ఆశకిరణాలాంటివారని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. బుధవారం మునిపల్లిలో కలెక్టర్ క్రాంతి ఆకస్మికంగా పర్యటించారు.మండలంలోని టీఎస్ డబ్ల్యూ. ఆర్ఎస్ రెసిడెన్షియల్ పాఠశాలను, మోడల్ స్కూల్ కళాశాలను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ కార్యాలయంలో రికార్డులను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం మోడల్ స్కూల్ ను కళాశాలను కలెక్టర్ పరిశీలించారు విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోనేట్లు తెలిపారు.విద్యార్థులకు మోడల్ పాఠశాల కళాశాలలో నాణ్యమైన బోధన అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరంలోని టీ.ఎస్. డబ్ల్యూ . ఆర్.ఎస్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను కలెక్టర్ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు విద్యార్థుల సమస్యలు పరిష్కరించడానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

### విద్యార్థులతో ముచ్చట్లు

కలెక్టర్ తనిఖీకి వెళ్లిన సమయంలో అక్కడ విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి సిద్ధం కావడంతో మెనూ ప్రకారం అల్పాహారం, మధ్యాహ్న భోజనం ఇస్తున్నారా? లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్న కలెక్టర్ మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించెందుకు ఆ విద్యార్థులతో కలిసి, వారితో ముచ్చటిస్తూ భోజనం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని విద్యార్థులను వారి అభివృద్ధికి తగ్గట్లు చదువుతోపాటు క్రీడల్లో కూడా మేలుకువలు నేర్పాలని భవిష్యత్తుపై విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలలో కిచెన్ రూం, డైనింగ్ హాల్‌లను పరిశీలించారు. గురుకుల పాఠశాలలో శానిటేషన్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని, పచ్చదనం పెంపొందించాలని సిబ్బందికి కలెక్టర్ ఆదేశించారు.

### ధరణి పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి

ధరణి పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ధరణి పెండింగ్ ఫైల్ లను వెంటనే పరిష్కరించాలని తహసిల్దార్ ల వద్ద ధరణి అప్లికేషన్లు పెండింగ్ లేకుండా చూడాలని జిల్లా ఉన్నతాధికారులకు ధరణి సమస్యల పరిష్కారం కోసం అవసరమైన అన్ని ఫైల్స్‌ను పంపాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ కార్యాలయంలో రికార్డుల గదిని పరిశీలించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి ఆసుపత్రిలో రోగుల పొందుతున్న సేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు.

### బుదేరా ఎల్ఆర్ఎస్ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్

బుదేరాలో ప్లాట్ల ఎల్ ఆర్ ఎస్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు.దరఖాస్తులు ఎన్ని వచ్చాయని పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి అడిగి తెలుసుకున్నారు.ఎల్ ఆర్ ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆశ, వైద్య అధికారులు, పంచాయత్ రాజ్ అధికారులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



# పెండింగ్లో ఉన్న ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలి

### మంత్రులను కోరిన అచ్చంపేట ఎమ్మేల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

**అచ్చంపేట సెప్టెంబర్ 25 (జనం సాక్షి)**

అచ్చంపేట నియోజకవర్గంలో పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టు పనులను వెంటనే పూర్తి చేయాలని, అచ్చంపేట లిఫ్ట్ ఇర్రిగేషన్ ప్రాజెక్టుకు త్వరలో శంఖుస్థాపన చేయాలని తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులను అచ్చంపేట ఎమ్మేల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ కోరారు. బుధవారం నాడు ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పనులు పూర్తి చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించిన నేపథ్యంలో పెండింగ్‌లో వున్న పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను తెలంగాణ మంత్రులు, పార్లమెంట్ సభ్యులు మల్లురవి, ఇతర ఉన్నతాధికారులతో నార్లాపూర్ రిజర్వాయర్ వద్దకు చేరుకొని సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులను అచ్చంపేట ఎమ్మేల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ కెఎల్ఐ కాలువ నుండి అచ్చంపేట నియోజకవర్గానికి ప్యాకేజ్-29. ప్యాకేజ్-30 కాలువలు గత కొన్ని రోజుల నుండి కురిసిన వర్షాలకు దెబ్బ తినడం జరిగిందని వాటికి మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలని ఆయన కోరారు.

# ప్రభుత్వ ఆసుపత్రిని ఏర్పాటు చేయండి

### రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రికి వెల్జాల్ గ్రామ నాయకులు విన్నపం



**తలకొండపల్లి సెప్టెంబర్ 25 (జనంసాక్షి):**

కాంగ్రెస్ ప్రజా పాలనలోనైనా తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రిని బుధవారం గ్రామ ప్రజా ప్రతినిధులు కలసి విన్నవించారు.రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో ప్రభుత్వ ఆసుపత్రి లేక వెల్జాల్,పరిసర గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు అని కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి,కి మంగళవారం కలిసి వినతి పత్రం సమర్పించారు.ఎమ్మెల్యే ఆదేశాల మేరకు బుధవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు దామోదర రాజనర్సింహ,ని కాంగ్రెస్ నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా మంత్రి,కి విన్నవిస్తూ రంగారెడ్డి జిల్లాకే చివరి ప్రాంతమైన మారుమూల గ్రామం వెల్జాల్,లో ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మిస్తే చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు.ప్రజల చిరుకాల కోరికను నెరవేర్చాలని మంత్రి,ని కోరారు.ఈ సందర్భంగా ఆరోగ్యశాఖ మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ఉన్నది ప్రజల అవసరాలు తీర్చడానికేనని అన్నారు.మీ నాయమైన డిమాండ్,ను ప్రభుత్వం తప్పకుండా పరిశీలించి ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి పునుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జి.శ్రీనివాస్ మూర్తి,మాజీ ఉప సర్పంచ్లు, బి.నర్సింలు,ఎంఏ అజీజ్,మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి అరిఫ్, సీనియర్ నాయకులు సి.వెంకటరెడ్డి, పి.అశోక్ బాబు,మాజీ డైరెక్టర్ తిరుమణి కృష్ణయ్య గౌడ్, యువ నాయకులు లకుమల్ల మల్లేష్, చింతకాయల లక్ష్మణ్, పుల్జాల విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

# జలమండలిలో ఏడుగురికి కారుణ్య నియామకం

**హైదరాబాద్ సెప్టెంబర్ 25(జనంసాక్షి):**

జలమండలిలో ఏడుగురికి కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు లభించాయి. బోర్డులో విధులు నిర్వర్తిస్తూ ఉండగానే మరణించిన ఏడుగురి ఉద్యోగుల కుటుంబ సభ్యులకు వారి వారి విద్యార్హతలు బట్టి, కారుణ్య నియామకం కింద ఉపాధి కల్పించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఎండీ అశోక్ రెడ్డి ఈ నియామక పత్రాలను బుధవారం వారికి అందించారు. ఈ సందర్భంగా ఆయన వారికి శు భాకాంక్షలు తెలుపుతూ..కష్టపడి పని చేసి బోర్డుకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ డైరెక్టర్ సుదర్శన్, పీఅండ్ఏ సీజీఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.

# జంట జలాశయాల గేట్ల ఎత్తివేత

**హైదరాబాద్ సెప్టెంబర్ 25(జనంసాక్షి):**

ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు గండిపేట్ రిజర్వాయర్‌కు భారీ స్థాయిలో వరద నీరు వచ్చింది. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం వరకు నీరు చేరింది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి 11.30 గంటల ప్రాంతంలో 2 గేట్లు ఒక అడుగు మేర ఎత్తి.. 234 క్యూసెక్కుల నీటిని కిందికి విడుదల చేశారు. అటు హిమాయత్ సాగర్ జలాశయానికి సైతం వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టానికి దగ్గరలో ఉంది. దీంతో ఇవాళ సాయంత్రం 7 గంటలకు రిజర్వాయర్ 1 గేటు ఒక అడుగు మేర అధికారులు ఎత్తనున్నారు. ఈ నేపథ్యంలో దిగువ ప్రాంతాల ప్రజల్ని అప్రమత్తం చేశారు.



# నకిలీ ఫుడ్ సేఫ్టీ, హ్యూమన్ రైట్స్ అధికారులుగా చలామణి అవుతున్న మహిళల అరెస్ట్

**హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 25(జనంసాక్షి):**


ఫుడ్ సేఫ్టీ, హ్యూమన్ రైట్స్ అధికారులుగా చెప్పుకుంటూ వివిధ హెూటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు చేసి దోపిడీకి పాల్పడుతున్న ఇద్దరు మహిళలను పట్టుకొని పోలీసులకు అప్పగించినట్లు జిహెచ్ఎంసి (హెల్త్) అడిషనల్ కమిషనర్ పంకజ తెలిపారు. బొగ్గుల సునీత, నీలి విజయలక్ష్మి అనే ఇద్దరు మహిళలు ఫుడ్ సేఫ్టీ, హ్యూమన్ రైట్స్ అధికారులుగా చెప్పుకుంటూ వివిధ హెూటళ్లు, రెస్టారెంట్‌లలో తనిఖీలు చేసి దోపిడికి పాల్పడుతున్నట్లు ఇటీవల జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ విభాగానికి ఫిర్యాదులు అందాయని తెలిపారు. సంబంధిత ఇద్దరు మహిళలు ఈ నెల 23న అల్వాల్, కుత్బుల్లాపూర్ ప్రాంతంలోని రెస్టారెంట్లను సందర్శిస్తున్నట్లు సమాచారం అందుకున్న జిహెచ్ఎంసి ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు వెంటనే సమీపంలోని రెస్టారెంట్లు, హెూటళ్లను అప్రమత్తం చేసిందని పేర్కొన్నారు. ఆ మేరకు సుచిత్ర ఎక్స్ రోడ్డు వద్ద గల మెసర్స్ గిస్మత్ జైల్ మండి రెస్టారెంట్ నిర్వాహకులు సంబంధిత మహిళలను పట్టుకొని పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ లో అప్పగించినట్లు తెలిపారు. పేట్ బషీరాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్న నికిలీ అధికారులుగా చలామణి అవుతున్న వ్యక్తులు మలక్ పేట్ కు చెందిన బొగ్గుల సునీత (50), సికింద్రాబాద్ కు చెందిన నీలి విజయలక్ష్మి (58) గా గుర్తించినట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
26 సెప్టెంబర్ 2024

# భూసమస్యల పరిష్కారానికి వీడని చిక్కుముడులు

## కొత్త, పాత ప్రభుత్వాల మధ్య నలుగుతున్న రైతులు

### వీఆర్ఓల్లేక పట్టు తప్పిన రెవిన్యూ వ్యవస్థ



**వనపర్తి,సెప్టెంబర్ 25 (జనంసాక్షి):**

ప్రభుత్వం మారింది. తమకు న్యాయం జరుగుతుందని, అన్ని భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ప్రజలు ఎదురుచూస్తున్నారు. ధరణి సంబంధిత పనులు ఏవీ కూడా ముందుకు వెళ్లడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వారంలో ఏదో ఒక రోజు ప్రజావాణి పేరిట అన్ని తహశీల్దార్ కార్యాలయాలు, ఆర్డీఓ, కలెక్టర్ ఆఫీసు పరిధిలో కూడా అన్ని రకాల దరఖాస్తులతో పాటు భూ సంబంధిత దరఖాస్తులను కూడా స్వీకరిస్తున్నారు. దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. కాని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ విధానాలు అక్రమార్కులకు ఉపయోగ పడుతున్నాయని, దానిని రద్దు చేసి భూమాతను తెచ్చి సమస్యలను చక్కదిద్దు తామని ఇచ్చిన హామీకి ఇప్పటి దాకా తుదిరూపం రాలేదు .దీంతో సమస్యల పరిష్కారానికి చేసుకున్న రైతులు కొత్త పాత ప్రభుత్వాల మధ్య నలుగుతున్నారు.

### జవాబుదారీకి దూరమైన రెవిన్యూ విధానం

గత కొన్ని దశాబ్దాలుగా భూమికి సంబంధించిన ఎనభై శాతం సమస్యలన్నీ తహశీల్దారు కార్యాలయంలో పరిష్కరింపబడేవి . మిగతా పనులు ఆ పై అధికారి వద్ద నిర్ణయాలు జరిగేవి. ఇలా వివిధ ఆఫీసుల్లో తీసుకున్న దరఖాస్తులన్నీ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తూ కలెక్టర్‌కు పంపుతారు. ఆయన ఆయా శాఖాధిపతులకు వాటిని కేటాయిస్తూ... అందులో ధరణి సంబంధిత దరఖాస్తులను స్థానిక మండల రెవెన్యూ కార్యాలయానికి పంపిస్తారు. వాటన్నింటినీ పరిశీలించి సమస్యల వారీగా విచారణ చేపడతారు. ఇందులో ధరణి దరఖాస్తుల విచారణ పూర్తి చేసి కలెక్టర్‌కి పంపిస్తారు. అక్కడి నుంచి తెలంగాణ భూపరిపాలన అధికారి, హైదరాబాద్ వారికి పంపుతారు, వారిదే తుది నిర్ణయంగా పరిగణించ బడుతుంది. ఈ విధానం వలన గతంలో ప్రజల సమీపానికి వికేంద్రీకరించబడిన అధికారాలన్నీ తిరిగి కేంద్రీకృతమయ్యాయి. ఇది ప్రజలకు జవాబుదారీతనం నుంచి దూరంగా ఉంటూ, పారదర్శకత లేని పరిపాలనగా మారింది.

### ఇప్పటికీ సీసీఎల్ఏ పరిధిలోనే పరిష్కారం

ప్రస్తుతానికైతే ధరణి పోర్టల్‌తో మ్యుటేషన్లు, సక్సెషన్స్ (విరాసత్ /వారసత్వ మార్పిడి) మాత్రమే జరుగుతున్నాయి. మిగతా పనులన్నీ స్తబ్దుగానే ఉన్నాయి. ధరణి పోర్టల్‌తో నిమిత్తం లేని పనులు కూడా పూర్తికావడం లేదు.గతంలో ఉన్న ధరణి పోర్టల్ టీఎం 33 వరకు మాడ్యూల్స్, ప్రతి సమస్యకు సంబంధించి ఒక మాడ్యూల్, వాటి ద్వారా సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం అయ్యేలా కొన్ని సాఫ్ట్‌వేర్లను ధరణి పోర్టల్‌తో లింక్ చేసారు. కానీ, ఏ తహసిల్దార్ కార్యాలయానికీ ఇంతవరకు ఏ రకమైన లాగిన్లు ఇవ్వలేదు. దీంతో రైతులు ఏ దశలో, ఏ అధికారిని కలవాలో అర్థం కాని పరిస్థితిలో ఉన్నారు. పెద్ద సమస్యకు పరిష్కార గది కార్యాలయం. చివరాఖరికి అన్నింటికీ రాష్ట్ర రెవెన్యూ అత్యున్నత స్థాయి అధికారి (సి.సి.ఎల్.ఏ)ని బాధ్యుడిగా చేసింది. ఇందులో పాత ప్రభుత్వానికి, కొత్త ప్రభుత్వానికి ఏ రకమైన తేడా కనిపించడం లేదు.

### వీఆర్ఓల్లేక రెవిన్యూ వ్యవస్థకు తిప్పలు

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వీఆర్వోల వ్యవస్థను రద్దు చేశారు. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కక్షపూరితంగానే వీఆర్ఓలను తొలగించారని విమర్శలొచ్చాయి. గ్రామాల్లో వీఆర్ఓలతో పాటు వీఆర్ఏ (గ్రామ సహాయకులు) ల ద్వారానే రెవిన్యూ తదితర శాఖల పనులన్నీ జరిగేవి. మారుమూల గ్రామంలో ఉన్న నిరుపేదలకు, ఒక సాధారణ పౌరుడికి తన అవసరాలకు సంబంధించిన సర్టిఫికెట్లు, కులం, ఆదా యం, నివాసం, పుట్టిన లేదా చనిపోయిన ధ్రువీకరణలు, సలహాలు, సూచనలు చేయటానికి ఒక ప్రభుత్వ అధికారి అంటూ ఎవరూ లేరు.దాదాపు 53 రకాల విధులు నిర్వహించ వలసిన రెవెన్యూ సిబ్బంది ఈరోజు లేరు. దీని విషయమై కమిటీ తరపున ఖచ్చితమైన ప్రతిపాదన ఉండాలి. ఈ విషయంలో ధరణి సమస్యల కొరకు వేసిన కొత్త భూమాత కమిటీ ప్రభుత్వానికి సూచన చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### పారదర్శకగా భూమి రికార్డులుండాలి

**రాంచందర్ నాయక్ ,రిటైర్డు సబ్ కలెక్టర్**

అరవై శాతం జీవనాధారంగా ఉన్న వ్యవసాయ భూములు, వాటి పరిరక్షణ బాధ్యత ఆయా ప్రభుత్వాలపై ఉంటుంది. కాబట్టి అధికారికంగా వేసిన కమిటీ పాత పద్ధతులకు భిన్నంగా, పారదర్శకమైన భూమి రికార్డులు ప్రతి రైతుకు అందుబాటులో ఉంటూ, సులభంగా అర్థమయ్యేలా ఉండే సూచనలు చేయాలి. ఆ దిశగా ప్రభుత్వానికి సిఫారసులు ఉండాలి, వాటిని సిఫార్సులను తక్షణమే అమలులోకి తీసుకురావాలి.



# లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### మడుగు నగర్ కాలనీలో కొత్త చెరువు నుండి వచ్చే నీటిని పరిశీలించిన ఎమ్మెల్యే

మహబూబ్ నగర్ టౌన్ సెప్టెంబర్ 25 (జనం సాక్షి)

గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కొత్త చెరువు అలుగు పారుతున్నందున ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆ ప్రాంతాన్ని అధికారులు, నాయకులతో కలిసి బుధవారం పరిశీలించారు. అంతకు ముందు మడుగు నగర్ కాలనీ లో కొత్త చెరువు నుంచి వచ్చే నీటిని ఆయన పరిశీలించారు. ప్రజలతో ఆయన మాట్లాడి ఇండ్లల్లో ఉన్న చిన్న పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి ఆయన సూచించారు. కొత్త చెరువు అలుగు పారడం వల్ల ఎక్కువ నీరు లోతట్టు ప్రాంతాలకు వస్తుందని కాబట్టి లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి ఆయన కోరారు. ఈ ప్రాంతంలో బ్రిడ్జిని ఏర్పాటు చేస్తానని ప్రజలకు ఆయన హామీ ఇచ్చారు. అనంతరం కొత్త చెరువు కు ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే తో పాటు కౌన్సిలర్ మోయిన్ అలి, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, ఎఇ బస్వరాజు, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, మహబూబ్ నగర్ మండల పార్టీ అధ్యక్షులు మల్లు నర్సింహ్మారెడ్డి, ఏర్పుల నాగరాజు తదితరులు ఉన్నారు.

# ఉపాధి హామీపై నిర్లక్ష్యమేంటీ..?



- పనులను సక్రమంగా చేయారా
- ఉపాధి హామీ పనులను పరిశీలించిన అధికారులు
- ఈసి, టిఏలు ఇష్టారాజ్యాంగ విధులు
- పంచాయతీ కార్యదర్శుల పై డిఆర్డివో బాలరాజ్ ఆగ్రహం

ఝరాసంగం, సెప్టెంబరు 25 (జనం సాక్షి)

గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద కూలీలు చేపడుతున్న పనులను పరిశీలించడం లేదని మాచూనూర్ గ్రామానికి చెందిన రైతు జిల్లా అధికారుల దృష్టికి తెచ్చారు. బుధవారం మండల కేంద్రమైన ఝరాసంఘంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో 14వ విడత ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధి హామీ ఈసీ టెక్నికల్ అసిస్టెంట్లు వారి ఇష్టానుసారంగా విధులను నిర్వహిస్తున్నారన్నారు. ఉపాధి హామీ పథకంలో మామిడి చెట్లను సాగుచేసిన సంవత్సరం నుంచి రికార్డు చేయకుండా బిల్లులను ఇవ్వడం లేదన్నారు. గ్రామాల్లో నిర్వహించే ఉపాధి కూలీలకు సంబంధించిన మస్టర్లపై పంచాయతీ కార్యదర్శులు సంతకాలు చేయడం లేదని తనిఖీ బృందం సభ్యులు తెలియజేశారు. దీంతో ఏపీడి బాలరాజు వారి పనితీరుపై అగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లోని ఉపాధి హామీ పనులు మీ బాధ్యత కాదా అని, మరోసారి ఈ విధంగా జరిగితే శాఖా పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మండలంలోని బిడెకన్నె, ఎల్గోయి ,పలు గ్రామాల్లో మాస్టర్లలో కూలీల సంతకాలు లేకుండానే డబ్బులను డ్రా చేయడం జరిగిందని తనిఖీ బృందం సభ్యులు తెలిపారు. పలు గ్రామాల్లో కొలతలు ప్రకారం ఎంబి రికార్డులు చేయలేదన్నారు. గ్రామాల్లో పనులు చేసినప్పటికీ వాటిని చూపించేందుకు టెక్నికల్ అసిస్టెంట్లు తనిఖీ బృందానికి సహకరించలేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి హామీ డిఆర్డిఓ బాలరాజు, విజిలెన్స్ అధికారి నాగేశ్వరరావు, ఎంపీడీవో సుధాకర్, ఏపీ ఓ రాజకుమార్, జిల్లా క్యూసీ అధికారి సుభాష్, ఆయా గ్రామాల టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతే లక్ష్యం..!

- మహిళా సంఘాల సభ్యులు 100% అక్షరాస్యత సాధించాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 25(జనం సాక్షి):**

మహిళా సాధికారతే లక్ష్యంగా జిల్లా సమైక్య ప్రగతి పథంలో ముందుకు పోవడం శుభ పరిణామమని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. బుధవారం తెలంగాణ భవన్ లో మెదక్ జిల్లా సమాఖ్య 7వ వార్షిక సర్వ సభ్య సమావేశానికి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ హాజరై మాట్లాడుతూ జిల్లాలో13063 మహిళా సంఘాల గ్రూపులు కలవని 2024-25 సంవత్సరంలో 214 కోట్ల రుణాలు అందించడం జరిగిందని, మహిళా సంఘాల సభ్యులు 100% అక్షరాస్యత సాధించాలని మహిళ ఆర్థిక స్వాలంబనే లక్ష్యంగా ముందుకు పోతూ సామాజిక కార్యక్రమాలు అయిన బాల్య వివాహాలు జరుగకుండా చూడాలని, వరకట్న నిషేధం జరిగేలా చూడాలి అన్నారు. తీసుకున్న రుణాలు వినియోగ అవసరాలకు వాడకుండా ఆదాయాభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించుకోవాలి అని, వచ్చిన ఆదాయంతో వినియోగ అవసరాలు తీర్చుకోవాలి అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులు వివోల ద్వారా సమర్థ వంతముగా నిర్వహించాలి అన్నారు. ఈ సర్వ సభ్య సమావేశంలో 2023-24 వార్షిక సంవత్సరంలో జిల్లా సమాఖ్య ద్వారా అమలు పరచిన కార్యక్రమాల నివేదిక చదివి వినిపించడం జరిగిందన్నారు. వార్షిక లెక్కలకు మరియు 2024-25 వార్షిక సంవత్సరంలో చేయబోవు ప్రణాళికకు మహాసభ ఆమోదము తెలిపింది అన్నారు. అనంతరం 2023-24 వార్షిక సంవత్సంంలో ఉత్తమ ప్రతిభ కనబరచిన తూప్రాన్, మనోహర బాద్, చెగుంట, నర్సాపూర్, హవేలీ ఘనపూర్, మెదక్ మండలాల అధ్యక్షురాళ్ళను మరియు సంబధిత మండల ఎపిఏంలను జిల్లా కలెక్టర్ శాలువాతో సన్మానించి, మెమోంటో లు అందచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి సిఎచ్ శ్రీనివాస్ రావు ,అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి. సరస్వతి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నవనీత , జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లు మండల సమాఖ్య ల పదాది కారులు, జిల్లా సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.



# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

### ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నిజాంపేట్, సెప్టెంబర్ 25 (జనం సాక్షి)**

వైద్యం కోసం వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆదేశించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందుతున్నారా లేరా అని రోగులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రతి ఒక్కరికి ఉచిత సేవలు అందుబాటులో ఉంటాయని డాక్టర్లు ఎటువంటి నిర్లక్ష్యం చేసిన తగిన చర్య తీసుకుంటామని డాక్టర్లను హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఆసుపత్రులలో చికిత్స చేయించుకో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజేశ్వర్, మన్నే కృష్ణ, గోలి రాములు, వెంకటేశం, శ్రీకాంత్ పాల్గొన్నారు.



# డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు రోడ్డు వేయండి

**సంగారెడ్డి ప్రతినిధి , సెప్టెంబర్ 25 (జనంసాక్షి)**

డబుల్ బెడ్‌రూం ఇండ్లకు రోడ్డు వేయాలని కలెక్టర్‌కు వినతిపత్రాన్ని మాజీ ఉప సర్పంచ్ రమేష్‌గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునిపల్లి గ్రామంలో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లకు సిసి రోడ్డు వేయాలని, డ్రైనేజీ నిర్మించాలన్నారు. మునిపల్లి లో 72 ఇండ్ల డబల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మాణం చేయడం జరిగిందని, ఈ ఇండ్లను పంపిణీ చేసి రెండు సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటికీ ఆ ఇండ్లకు వెళ్లడానికి సిసి రోడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నికలకు ముందు సిసి రోడ్లు వేస్తామని శంకుస్థాపనలు చేసిన నేటికీ వేయలేదని వర్షం పడితే ఇండ్లకు వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉందన్నారు. ఇండ్లను కూడా కాంట్రాక్టర్ తన ఇష్టానుసారంగా నిర్మించాడని, వర్షం పడితే పైన ఉన్న స్లాబ్ పై నీళ్లు అలాగే నిలబడుతున్నాయని, ఇలాగైతే ఇల్లు తొందరగా పాడయ్యే ప్రమాదం ఉందని వెంటనే సదరు కాంట్రాక్టర్ పై చర్య తీసుకుని స్లాబ్లపై నీళ్లు నిలబడకుండా చేయాలని, డ్రైనేజీ నిర్మించి ప్రజలు ఆరోగ్యాలను కాపాడాలని ఆయన కలెక్టర్ ను కోరారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ రేపు డబల్ బెడ్ రూమ్ కాంట్రాక్టర్స్ తో అధికారులతో సమావేశం నిర్వహిస్తామని తగిన చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగేష్, గోపాల్, నర్సింలు, రాజేందర్ , నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ప్రతిభ ఆధారంగా రాష్ట్ర స్థాయి డ్యూటి మీట్‌కు ఎంపిక

### జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్



**సంగారెడ్డిప్రతినిధి, సెప్టెంబర్ 25(జనంసాక్షి)**

రాష్ట్ర ఆవిర్భావం తరువాత తెలంగాణ రాష్ట్రంలో జరుగనున్న మొదటి పోలీసు డ్యూటి మీట్ సందర్భంగా జిల్లా స్థాయిలో అధికారులు, సిబ్బందిలో ప్రతిభను వెలికి తీసేందుకు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సెలెక్షన్ నిర్వహించడం జరిగిందని జిల్లా ఎస్పీ రూపేష్ అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఏ కేసులో ఏ విధంగా నాణ్యమైన ఇన్వెస్టిగేషన్ చేయాలి, నేర స్థలంలో నేరం జరిగినప్పుడు ఆ నేరాన్ని నివృత్తి, డిటెక్ట్ చేయడానికి ఆ నేరస్థలంలో ఎలాంటి ఆధారాలు లభిస్తున్నాయని ఏ ఆధారాలు సేకరించాలి, నేరస్థలాన్ని ఏ విధంగా ప్రొటెక్ట్ చేయాలి అన్న అంశాలపై తాత్కాలిక నేరస్థలాలను ఏర్పాటు చేసి, ప్రాక్టికల్‌గా ఏవిధంగా ఇన్వెస్టిగేషన్ చేయాలని, ఇన్వెస్టిగేషన్ అధికారులకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుంది. ఏదైనా ఒక వస్తువును సీజ్ చేసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఏ విధంగా భద్రపరచాలన్న అంశాలపై సెలక్షన్ నిర్వహించడం జరిగిందన్నారు. అదేవిధంగా సిబ్బందికి తమ రొటీన్ వర్క్‌లో భాగంగా కంప్యూటర్ పై ఎంతవరకు అవగాహన ఉంది అనే అంశాలపై కమ్యూనికేషన్ స్కిల్స్, సైబర్ క్రైమ్స్ నేరస్థల ఫోటోగ్రఫీ వీడియోగ్రఫీలకు సంబంధించి పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని జోనల్ లెవెల్‌లో పోటీలకు పంపించడం జరుగుతుందని, అనంతరం అక్టోబర్ 14 నుండి 18 తేదీల వరకు జరిగే మొదటి తెలంగాణ రాష్ట్ర పోలీస్ డ్యూటీ మీట్ కు పంపించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ వివరించారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి మెడల్స్ తో పాటు నగదు బహుమతి, సాలరీలలో బహుళ ఇంక్రిమెంట్స్ ఇవ్వడం జరుగుతుందని ఎస్పీ వివరించారు. స్పోర్ట్స్ మీట్‌కు సంబంధించి చార్మినార్ జోన్‌కు జిల్లా ఎస్పీ నోడల్ అధికారిగా వహించగా, సంగారెడ్డి జిల్లా స్పోర్ట్స్ మేట్స్ సెలక్షన్‌కు జిల్లా ఎస్పీ జిల్లా అదనపు ఎస్పీ ఎ.సంజీవ రావు ఇంచార్జ్‌గా వ్యవహరించనున్నట్లు ఎస్పి వివరించారు.

# జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పకడ్బందీగా చర్యలు

### మల్టి పర్పస్ వర్కర్లకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వ్యక్తిగత బుక్ లెట్ ఇవ్వండి



### జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి బ్యూరో సెప్టెంబర్25 (జనంసాక్షి)**

రానున్న వారం పది రోజులు మరిన్ని వర్షాలు పడే అవకాశం ఉందని అందువల్ల డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి వైద్య అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మరో నెల రోజుల పాటు జాగ్రత్తలు తీసుకోవాలని దోమలు ప్రబలకుండా ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రై డే కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు పాఠశాలలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సైతం డ్రై డే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డెంగ్యూ పాజిటివ్ వచ్చిన ప్రాంతంలో క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలని ఆదేశించారు. జిల్లాలోని అందరూ మల్టీపర్పస్ వర్కర్లకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారికి సంబంధించిన వ్యక్తిగత ఆరోగ్య కార్డులు సిద్ధం చేసి ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. అదేవిధంగా వనపర్తి జిల్లాలో 30 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికి డయాబెటిస్ వైద్య పరీక్షలు నిర్వహించే విధంగా పకడ్బందీగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ముందుగా అవసరమైన గ్లూకోమీటర్లు స్ట్రిప్‌లు కొనుగోలు చేయడం అదేవిధంగా ఆశా వర్కర్లకు డయాబెటిస్ పరీక్షలు నిర్వహించడంపై శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. అక్టోబర్ రెండవ తేదీ నుండి జిల్లాలో మూడు గ్రామాలలో పైలట్ ప్రాజెక్టుగా డయాబెటిస్ పరీక్షలు ప్రారంభించే విధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. రానున్న రెండు సంవత్సరాల్లో జిల్లాలోని 30 సంవత్సరాలుపై బడిన ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలు అందుబాటులో ఉండేవిధంగా చూడాలన్నారు. ఇందుకోసం ఒక కంప్యూటర్ ప్రోగ్రామింగ్ రూపొందించాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జయచంద్ర మోహన్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ సునందిని, డిప్యూటీ వైద్య ఆరోగ్య అధికారి డా. సాయినాథ్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్లు, ప్రోగ్రాం ఆఫీసర్ లు తదితరులు పాల్గొన్నారు.




# బాధ్యతయుతంగా విధులు నిర్వహించాలి

- ప్రజల సేవ కోసం మనకు దక్కిన గొప్ప అవకాశం పోలీస్ ఉద్యోగం
- అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలి
- మల్టీ జోన్ 1 ఐజి.పి శ్రీ ఎస్.చంద్రశేఖర్ రెడ్డి

**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 25(జనం సాక్షి):**

ప్రజల సేవ కోసం మనకు దక్కిన గొప్ప అవకాశం పోలీస్ ఉద్యోగమని..అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని మల్టీ జోన్ 1 ఐ జి ఎస్ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయాన్ని మల్టీ జోన్ 1 ఐ.జి.పి ఎస్.చంద్రశేఖర్ రెడ్డి బుధవారం సందర్శించినారు. మల్టీ జోన్ 1 ఐజిపి ఎస్.చంద్రశేఖర్ రెడ్డికి జిల్లా ఎస్.పి.డి.ఉదయ్ కుమార్ రెడ్డి పూల మొక్కతో సాదర స్వాగతం పలికినారు. అనంతరం పోలీస్ కార్యాలయంలో పోలీస్ సిబ్బంది నుండి గౌరవవందనం స్వీకరించారు. తరువాత పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో "సమీక్ష సమావేశం" నిర్వహించారు. మల్టీ జోన్ 1 ఐజిపి ఎస్.చంద్రశేఖర్ రెడ్డికి జిల్లా ఎస్.పి.డి.ఉదయ్ కుమార్ రెడ్డి పిపిటి ప్రెసెంటేషన్ ద్వారా జిల్లా సమగ్ర సమాచారాన్ని తెలియజేసినారు. ఈ సందర్భంగా మల్టీ జోన్ 1 ఐజిపి ఎస్.చంద్రశేఖర్ రెడ్డి జిల్లా సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ.. జిల్లా పోలీస్ సిబ్బంది ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. నేర విచారణలో జాప్యం జరగకుండా బాధితులకు సత్వర న్యాయం చేకూరేలా బాధ్యతగా పనిచేయాలని సూచించారు. సామాన్య ప్రజానికానికి ఇబ్బందులు కలిగే విధంగా ప్రవర్తించే ఆకతాయిల పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు. అలాగే కల్తీ కల్లు దుఖానాలపై నిఘా ఏర్పాటు చేసి అనుమతులు లేని కల్తీ కల్లు దుఖానాలపై చర్యలు తీసుకోవాలని అన్నారు. కొందరు రియల్ ఎస్టేట్ పేరిట మోసాలకు పాల్పడుతున్నారని పేద మధ్యతరగతి వర్గాలు కొనుగోలు చేసి ఇబ్బందుల పాలు అవుతున్నారని మరియు ఆర్థికంగా నష్టపోతున్నారని ప్రజలను మోసం చేస్తున్న రియల్ ఎస్టేట్ మాఫియాపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదేశించినారు. ఈ సమావేశం లో జిల్లా ఎస్.పి.డి.ఉదయ్ కుమార్ రెడ్డితో పాటు జిల్లా అదనపు ఎస్పి అడ్మిన్ ఎస్.మహేందర్ ,మెదక్ డిఎస్పీ ప్రసన్న కుమార్, తూప్రాన్ డిఎస్పీ వెంకట్ రెడ్డి, జిల్లా సిఐలు ఎస్ఐలు పాల్గొన్నారు.

# ఆమె ఒక ఫిరంగి



ఆమె ఒక విప్లవాగ్ని నేటి మహిళల ఆదర్శంగా తీసుకో వాలి. భూ పోరాటానికి నాంది పలి కిన వీరమాత ఆధునిక పరిణా మానికి నాంది పలికిన స్త్రీ, ధైర్యశాలి వరంగల్ జిల్లా రామపర్తి మండలం కృష్ణాపురం గ్రామం లో 1895 సెప్టెంబర్ 26న ఓరు గంటి మల్లమ్మ సాయిలకు నా లుగవ సంతానంగా ఒక వెను కబడిన కుటుంబంలో రజక వృత్తి జీవనాధారంగా జన్మించింది పాలకుర్తికి చెందిన చిట్యాల నరసయ్యతో వివాహం జరిగింది. 5గురు కుమారులు ఒక కుమార్తె. అగ్రకులాల స్త్రీ లు, పురుషులు దొర, దొరసాని అని వెనుకబడిన ఉత్పత్తి కులాలచే పిలిపించుకునే రోజు ల్లో ఆ సంస్కృతికి చరమగీతం పాడిన వారిలో ఐలమ్మ ముం దు వరుసలో ఉంటుంది. ఉన్నత కులాలతో పాటు వారికి అనుకూలం గా ఉండే ఉప్పుడు కత్తెలతో,వారి సమూహంతో పీడన బయటకువచ్చేది. ఉత్పత్తి కులాలు బడుగు బలహీన వర్గాల స్త్రీలపై లైంగిక దాడులు చేసేవారు. ఐలమ్మ దీన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ భూమి మీద పండించిన పంట నాది, ఈ భూమి నాది దాన్ని తీసుకెళ్లడానికి దొర ఏవ్వడు నా ప్రాణం పోయాకే పంట, భూమిని దక్కించుకోగలరు అంటూ తన మాటల్ని ఫిరంగి తుటల్లాగా పే ల్చిన విప్లవాగ్ని ఐలమ్మ. మల్లం పల్లి ముక్తేదారు ఉత్తమ రాజు కొండలరావుకు పాలకుర్తిలో 40 ఎకరాల భూమి ఉండగా ఐలమ్మ 4 ఎకరాలు కొండలరా వు తల్లి జయప్రద దేవి అయి లమ్మకు భూమి సాగు చేసుకో నటకు అనుమతి ఇచ్చింది. పాలకుర్తి పోలీస్ పటేల్ వీరమ నేని శేషగిరి రావు కి ఐలమ్మ కుటుంబానికి విరోధం ఉంది. పాలకుర్తి పోలీస్ పటేల్ శేషగి రిరావు ఐలమ్మను కుటుంబంతో వచ్చి తన పొలంలో పనిచే యాలని ఒత్తిడి తెచ్చాడు అయితే ఐలమ్మ తిరస్కరించింది. అప్పుడు ఐలమ్మ కమ్యూనిస్టు పార్టీలో చేరిందని విసునూర్ దేశ్ ముక్ కు శేషగిరిరావు ఫిర్యాదు చేశాడు. ఆ కేసులో ఐలమ్మను ఇరికించారు. దేశ్ ముఖ్‌కు రెండుసార్లు వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. ఐలమ్మ కుటుంబాన్ని ఆర్థికంగా దెబ్బ తీసేందుకు దేశ్ ముక్ పోలీస్ పటేల్ ను పిలిపించుకొని ఐల మ్మ కౌలుకు తీసుకున్న ఉత్తమ రాజు జయప్రద దేవి భూమిని తన పేరున రాయించు కున్నాడు. భూమి తనదని పండించిన ధాన్యం తనదేనని పంటను కోస్కరమ్మని వంద మందిని పంపాడు .ఆంధ్ర మహాసభ సభ్యులు వరిని కోసి వరి కట్టడం కట్టి ధాన్యాన్ని ఐలమ్మ ఇంటికి చేర్చారు. భీమ్ రెడ్డి నరసింహా రెడ్డి, ఆరుట్ల రామచంద్ర రెడ్డి, చకిలం యాదగిరిరావు దాన్యపు బస్తాలను భుజాలపై మోసి ఐలమ్మ ఇంటికి చేర్చారు. న్యాయ స్థానంలోనూ దేశ్ ముక్ వ్యతిరేకంగ తీర్పు వచ్చింది ఐలమ్మ తరపున కొండ లక్ష్మణ్ బాపూజీ వాదించారు. దీంతో కోపం వచ్చిన దేశ్ ముఖ్ ఐల మ్మ ఇంటిని తగలబెట్టారు. ధనాన్ని, ధాన్యాన్ని ఎత్తుకెళ్లా రు ఐయిలమ్మ కూతురు సోమన సమ్మపై అత్యాచా రానికి పాల్పడ్డారు. ఐలమ్మ కుమారులు ముగ్గురు పాలకుర్తి కమ్యూ నిస్టు నాయకత్వం ఇంటిని కూల్చి అదే స్థలంలో మొక్కజొన్న పంటను పండించారు. ఎన్ని రకాల ఇబ్బందులు ఎదుర్కొన్న మొక్కుకొని విశ్వాసంతో ఎర్ర జెండాను వదలలేదు తాను ప్రశ్నించుకొని నీ దొరవాడు ఏం చేస్తాడు రా మొక్కవోని విశ్వాసం తోరోకలి బండ చేతబుని గుండాలను తరిమికొట్టింది. కాలినడకన దొర ఇంటికి వెళ్లి సవాల్ విసిరింది. ఐలమ్మ పోరాట స్ఫూర్తితో కమ్యూని స్టులు దొరపై దాడి చేసి ధాన్యాన్ని ప్రజలకు పంచారు 90ఎకరాల భూమిని కూడా పేదలకుపం చారు. ఐలమ్మతో బీజం పడిన ఈ పోరాట స్ఫూర్తి సాయుధ పోరాటంతో మొదలుకొని, సాయుధ పోరాటం చివరి వరకు 4000 మంది ఉత్పత్తి కులాలు అమరులయ్యారు. 10 లక్షల ఎకరాల భూమి పంపిణీ చేశా రు ప్రజా పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచిన ఐలమ్మ సెప్టెంబర్ 10, 1985లో అనారోగ్యంతో మరణించింది. పాలకుర్తిలో ఐలమ్మ స్మారక స్తూపం,స్మారక భవనాన్ని సిపిఎం పార్టీవారు ప్రజల విరాళాలతో నిర్మించారు. 2022లో సెప్టెంబర్ 22న తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత ప్రభుత్వం కోటిలోని మహిళా విశ్వవిద్యాలయానికి ఆమె పేరును పెట్టింది ఆమె మనమ రాలు కూడా ఒక పదవిని కల్పించింది ఆమెను తెలంగాణ తల్లిగా గుర్తించారు ఆమె తెలంగాణ ఉద్యమ పోరాటంలో కూడా స్ఫూర్తిగా నిలిచింది చిన్న చిన్న వాటికే కృంగి పోయే మహిళలు ఒక నిరక్షరా స్యత కలిగి ఒక పేద వెనుక బడిన కుటుంబానికి చెందిన ఐలమ్మ పోరాటం ఒక చైతన్యం, ఒక స్ఫూర్తిగా తీసువాలి.



**ఉమాశేషారావు వైద్య**
లెక్చరర్ ఇన్ పాలిటిక్స్

# ఈనెల 28, 29న తల్లిపాల బ్యాంకుపై సదస్సు

**ఖైరతాబాద్, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** ఈనెల 28, 29 తేదీల్లో హైదరాబాద్‌లో అతిపెద్ద చనుబా లివ్వడం, దాని నిర్వహణ, తల్లి పాల బ్యాంకుపై సదస్సును సుషేనా హెల్త్ ఫౌండేషన్ భారత దేశం లోని మొట్ట మొదటి కొలస్ట్రమ్ మిల్క్ బ్యాంక్‌ను హైదరాబాద్‌లోని హొటల్ మేరిగోల్డ్‌తో పాటు నగ రంలోని వివిధ ప్రాంతాల్లో సదస్సులు నిర్వహిం చనున్నట్లు జాతీయ వైద్య కమిషన్ సభ్యుడు సుషేనా హెల్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సంతోష్ కుమార్ బుధవారం నగరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలిపారు. 4వ అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌గా పిలువబడే దక్షిణాసి యా లాంబ్కాన్-24లో శ్రీలంక, నేపాల్, తూర్పు తైమూర్, ఫిలిప్పీన్స్ నుండి 20 మంది అంతర్జాతీయ ప్రతినిధుల తో పటు ఐదు వందల మంది ప్రతినిధులు హాజరవుతారన్నారు.

సుషేనా హెల్త్ ఫౌండేషన్, ధాత్రి మదర్స్ మిల్క్ బ్యాంక్ భాగస్వామ్యంతో, ఇండి యన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్, నేషనల్ నియోనాటాలజీ ఫోరమ్, రిషిహుడ్ యూనివర్సిటీ, నేషనల్ నియోనాటాలజీ ఫోరమ్ - తెలంగాణ స్టేట్ చాప్టర్‌తో సహా పలు సంస్థల మద్దతుతో-టీఎస్ యూనిసెఫ్, పీడియాట్రిక్స్ అకాడమీ ఆఫ్ తెలం గాణ 4వ అంతర్జాతీయ సదస్సు, సౌత్ ఏషియన్ లాంబ్కాన్-24ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# రాష్ట్రంలోని అన్ని ఆలయాల ఉద్యోగులకు పిఆర్సి అమలు చేయాలి





- 261 జీవో సవరణ చేపట్టాలి
- టీఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలోని అన్ని దేవాలయాల ఉద్యోగులకు పిఆర్సిని వెంటనే అమలు చేయాలని టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ డిమాండ్ చేశారు. బుధవారం 6 ఏ దేవాలయాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ బాబు ఆధ్వర్యంలో వేములవాడలో 6 ఏ ఆలయ ఉద్యోగుల రాష్ట్ర కార్యవర్గ సమావేశము నిర్వహించగా ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం 6 ఏ ఆలయ ఉద్యోగులకు మాత్రమే పిఆర్సి అమలు చేసిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ఆలయాల ఉద్యోగులందరికీ పిఆర్సి అమలు చేయాలని కోరారు. 216 జీవో సవరించి ఉద్యోగులందరికీ న్యాయం చేయాలన్నారు. దేవాలయాల ఉద్యోగులు పని గంటలతో నిమిత్తం లేకుండా విధులు నిర్వహి స్తున్నారన్నారు. ఆలయాల్లో క్యాడర్ స్ట్రెంత్ లేకపోవడంతో ఉద్యోగులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దేవాదాయ శాఖలో 1975 లో ఉన్నటువంటి క్యాడర్ స్ట్రెంత్ మాత్రమే ఉందన్నారు. పెరుగుతున్న భక్తులకు అనుగుణంగా అన్ని ఆలయాల్లో క్యాడర్ స్ట్రెంత్ పెంచాలన్నారు. దేవాల యాల్లో ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న వారిని రెగ్యులరైజ్ చేసి అట్టి వ్యవస్థను రద్దుచేయాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ వ్యవస్థలో శ్రమ దోపిడీ జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ఉద్యోగులందరూ ఐకాసగా ఏర్పడి రాష్ట్ర సాధనలో ముందున్నట్లు తెలిపారు. అలాంటి ఉద్యోగులకు చాలా సమస్యలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో 317 జీవో ద్వారా జోనల్ వ్యవస్థలో ఈస్ట రీతిగా అన్ని శాఖల ఉద్యోగులను బదిలీలు చేసి ఇబ్బందులకు గురి చేశారన్నారు. స్పోస్ లో కూడా ఈస్టా రీతిన బదిలీలు చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో వారి మేనిఫెస్టోలోని అంశాలను అమలు చేస్తామని తెలిపారని అందుకు అనుకూలంగా హామీలు అమలు చేయాలన్నారు. ఉద్యోగులకు నాలుగు డీఏలు చెల్లించాల్సి ఉందని దసర కానుకగా మూడు డిఎ లను ప్రభుత్వం చెల్లించాలన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకెల్లె బాధ్యత ఉద్యోగులు తీసుకుంటారని ఉద్యోగాల సమస్యలను పరిశీలించాల్సిన బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో అసోసియేట్ ప్రెసిడెంట్ సత్యనారాయణ గౌడ్,రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు ఎలసాని ప్రవీణ్ కుమార్, కరీంనగర్ అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి,నిర్మల్ అధ్యక్షులు ప్రభాకర్, సిద్దిపేట అధ్యక్షులు పరమేశ్వర్, 6 ఏ ఆలయాల కో చెర్మన్ ఉపాధ్యాయులు చంద్రశేఖర్, రాజన్న ఆలయా ఏఈఓ లు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, శ్రావణ్ కుమార్, జయ కుమారి,ఆలయ ఈఈ రాజేష్, 6ఏ ఆలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

# లైంగిక దాడి కేసులో జీవిత ఖైదు పదివేల జరిమానా



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** మైనర్ బాలికపై లైంగిక దాడి కేసు లో నేరస్తునికి జీవిత ఖైదు శిక్ష 10 వేల జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ సింధుశర్మ బుధవారం వెల్లడించారు. 2023 న దేవన్ పల్లి పోలీసు స్టేషన్ కు సంబంధించిన బాలికపై లైంగిక దాడికి పాల్పడిన అతనిపై పోక్సో చట్టం కేసు లో నిందితుడైన మరిపల్లి బాలకృష్ణ అలియాస్ బాలరాజ్ (40) గల వ్యక్తికి జీవిత ఖైది శిక్ష మరియు 10 వేల జరిమానా విధించినట్లు కామారెడ్డి మొదటి అదనపు జిల్లా జడ్జి లాల్ సింగ్ శ్రీనివాస్ నాయక్ శిక్ష విధించినట్లు జిల్లా ఎస్పీ సింధు శర్మ బుధవారం తెలిపారు. రామేశ్వర్ పల్లి గ్రామం కామారెడ్డి మండలానికి చెందిన మైనర్ బాలిక తేది 2023 మార్చ్ 08 సాయత్రం సమయములో ఇంటి బయట అడుకుంటున్న చిన్నారిని అదే గ్రామానికి చెందిన బాలకృష్ణ అలియాస్ బాలరాజ్ (40) మైనర్ బాలికతో చాక్ లెట్స్ , బిస్ కిట్స్ కొనిస్తానని చెప్పి టి వి యస్ ఎక్సెల్ పై ఊరు బయట నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్ళి మైనర్ బాలికకు కల్లు త్రాగించి బలాత్కారం చేసినాడని,చీకటి పడుతున్న సమయములో గ్రామ శివాలయం వద్ద వదిలి వెళ్ళిపోయాడని.మైనర్ బాలిక తండ్రి ఆమె గురించి వెతుకగా దేవాలయం దగ్గర అపస్మారక స్థితిలో కనిపించినట్లు తెలిపారు.వెంటనే ఆసుపత్రికి తీసుక వెళ్ళి చికిత్స చేయించగ మరునాడు స్పృహ లోకి వచ్చి జరిగిన విషయము తెలుపడముతో మైనర్ బాలిక తండ్రి పిర్యాదు మేరకు దేవనిపల్లి పోలీసు స్టేషన్ నందు కేసు నమోదు చేసి పరిశోదన ప్రారంభించడం జరిగింది.

ఇట్టి కేసులో సాక్షులను విచారించి, బలమైన ఆధారాలు సేకరించి నేరస్తుడిని అరెస్ట్ చేసి పోక్సో చట్టం కింద కోర్టులో అభియోగపత్రం దాఖలు చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు.కేసు పూర్వా పరాలు, సాక్ష్యాధారాలు, వైద్య నివేదికను పరిశీలించిన న్యాయ మూర్తి కామారెడ్డి మొదటి అదనపు జిల్లా జడ్జి లాల్ సింగ్ శ్రీనివాస్ నాయక్ నిందితుడిపై మోపిన నేరం రుజువు అయిందని జీవిత ఖైది శిక్ష మరియు 10 వేల జరిమానా విధించడం జరిగిందని. అదేవిధముగా మైనర్ బాలిక బావిష్యత్ అవసరాల నిమిత్తం జిల్లా న్యాయ సేవ సంస్థ ద్వారా 7 లక్షలు అందజేయాలని సూచించడం జరిగిందిని తెలిపారు.ఈ కేసునుసరియగు పద్ధతిలో విచారణ చేసిన అప్పటి డియస్పి వి. సురేష్, ఎస్ఐ ప్రసాద్, కోర్టు నందు పోలీసు తరపున వాదనలు వినిపించిన అదనపు ప్రాసిక్యూటర్ కె. శేషు, కోర్టు లో సాక్షులను సరియగు సమయములో ప్రవేశపెట్టిన ప్రస్తుత డియస్పి నాగేశ్వర్ రావ్, సిఐ యస్. రామన్, ప్రస్తుత ఎస్ఐ జి. రాజు , కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఎస్ఐ టి. మురళి,కోర్ట్ కానిస్టేబుల్ బాలకృష్ణ మరియు దేవిచంద్ లను జిల్లా ఎస్పీ అభినందించారు.

# మూసీ ప్రాంతంలో నివసించే పేదల వివరాలు సేకరించాలి

- మూసీ పరివాహక ప్రాంతంలోని అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కేటాయించేందుకు వివరాలు సేకరించాలి
- ఆక్రమణదారులను పిలిచి వారికి అన్ని విధాల ప్రభుత్వం అండగా ఉంటుందని నచ్చ చెప్పాలి
- గండిపేట్ మండలంలో 32 నిర్మాణాలు రాజేంద్రనగర్ మండలంలో 300 మూసీ నది పరివాహక ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు
- రంగారెడ్డి కలెక్టర్ కె.శశాంక





**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** మూసి ప్రక్షాళనకు ప్రభుత్వం చర్యలు చేపట్టినందున మూసీ పరివాహక ప్రాంతంలోని అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూమ్ ఇళ్ళు కేటాయించేందుకు వివరాలు సేకరించాలని మూసీ పరివాహక ప్రాంతంలో నివసించే వారికి భరోసా కల్పించేందుకు అధికారులు వారికి నచ్చ చెప్పాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. బుధవారం రాజేంద్రనగర్ మండల రెవెన్యూ కార్యాలయంలో మూసీ పరివాహక ప్రాంత అభివృద్ధి, ఆక్రమ నిర్మాణాల తొలగింపు పై జిల్లా కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలోని గండిపేట్, రాజేందర్ నగర్ మండలాల్లోని మూసీ పరివాహక ప్రాంతాలలో 332 ఆక్రమ నిర్మాణాలను గుర్తించడం జరిగిందని తెలిపారు.

గండిపేట్ మండలంలో 32 నిర్మాణాలు రాజేంద్రనగర్ మండలంలో 300 మూసీ నది పరివాహక ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించామని మొత్తం 332 నిర్మాణాలను తొలగించ వలసి ఉన్నాయని, వారికి మరొకచోట డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించడం జరుగుతుందని తెలిపారు. మొదటగా నాలుగు బృందాలను ఏర్పాటు చేసి, మూసీ పరివాహక ప్రాంతంలో ఆక్రమ నిర్మాణాల్లో ఉంటున్న వారికి ఎప్పటికైనా ఈ ఆక్రమ నిర్మాణాలు ఉండవని వారికి శాశ్వత నిర్మాణాలు గల ఇళ్ళు డబ్బులు బెడ్ రూమ్ ఇళ్ళు ఇవ్వనున్నట్లు అధికారులు నచ్చే చెప్పాలని సూచించారు. ఈ టీములలో పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, సర్వే డిపార్ట్మెంట్ ఇతర సిబ్బంది 8 నుండి 10 మంది టీములుగా వెళ్లి ఇంటి యజమానికి సంబంధించిన ఆధార్ కార్డు, ఇంటికి సంబంధించి పేపర్లు, కరెంట్ బిల్స్, అనుమతులు తదితర డాటాను సేకరించాలని సూచించారు. ఇప్పుడు ఉంటున్న ఇళ్ళు వరదల ముప్పు ఉంటుందని, ఎప్పటికైనా నివాసాలకు అనువుగా ఉండదని వారికి తెలియజేయాలని అన్నారు. వీరికి ఇచ్చే డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ డ్రా ను వారి చేతనే తీయించడం జరుగుతుందని, ఖాళీ చేయించు సమయంలో రవాణా ఖర్చు కూడా ప్రభుత్వమే భరిస్తుందని విషయం వారికి తెలియ జేయాలని కలెక్టర్ వివరించారు. బృందాలు తమ పరిధిలో కేటాయించిన ఆక్రమణదారులను పిలిచి వారికి అన్ని విధాల ప్రభుత్వం అండగా ఉంటుందని నచ్చ చెప్పాలని అన్నారు. మూసి పరివాహక ప్రాంతాల్లో నివాసాలు కమర్షియల్ ఆక్రమణలు ఏ మేరకు ఉన్నాయో వివరాలు సేకరించాలని అన్నారు. పోలీస్ శాఖ నుండి సరైన సహకారం కల్పించాలని పోలీస్ వారికి కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, మూసీ రివర్ డెవలప్మెంట్ అథారిటీ జాయింట్ ఎండి గౌతమి, రాజేంద్రనగర్ ఆర్డిఓ, డిసిపి శ్రీనివాస్, రాజేంద్రనగర్ ఎసిపి శ్రీనివాస్, మూసీ రివర్ డెవలపర్ ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, రాజేంద్రనగర్ మున్సిపల్ కమిషనర్ రవికుమార్, నార్సింగ్ మున్సిపల్ అధికారులు, రాజేంద్రనగర్ ఎమ్మార్వో రాములు, నాలుగు బృందాల డిప్యూటీ తహసీల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## కొత్త ఓటర్లను నమోదు చేసుకునే విధంగా సహకరించాలి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 25 (జనం సాక్షి):** అర్హత కలిగిన కొత్త ఓటర్లను నమోదు చేసుకునే విధంగా సహకరించాలని, బూత్ స్థాయి ఏజెంట్లను నియమించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అర్హత కలిగిన కొత్త ఓటర్ల పేర్లను నమోదు చేయాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులతో సమన్వయం చేసుకునే విధంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు బూత్ స్థాయి ఏజెంట్లను నియమించాలన్నారు. వచ్చే అక్టోబర్ 29 న ఇంటిగ్రేటెడ్ డ్రాఫ్ట్ రోల్ ప్రచురించడం జరుగుతుందని, అట్టి డ్రాఫ్ట్ రోల్ లో అభ్యంతరాలు,ఉన్నట్లయితే నవంబర్ 9, 10 లలో స్పెషల్ క్యాంపెయిన్ ఏర్పాటు చేయడం జరుగుతుందని దానిలో తెలియపరచవచ్చని, ప్రతీ బూత్ స్థాయి అధికారికి తెలియపరచి వచ్చని తెలిపారు. ఫైనల్ పబ్లికేషన్స్ జనవరి 6, 2025 న ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు ఇంటింటి సర్వే కామారెడ్డి లో 97.52 శాతం, జుక్కల్ లో 98.02 శాతం, ఎల్లారెడ్డి లో 99.24 శాతం చేయడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సరళ, తదితరులు పాల్గొన్నారు.

# చెత్త నిర్వాహణ సమస్యలకు శాశ్వత పరిష్కారం

### గుహవటిలో డంపింగ్ స్టేషన్‌ను సందర్శించిన డిప్యూటీ మేయర్



**గుహటి (జనంసాక్షి) :** జిహెచ్ఎంసి అధికారిక అధ్యయన పర్యటనలో భాగంగా గ్రేటర్ హైదరాబాద్ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, ఇతర కార్పొరేటర్లు, అధికారులతో కలిసి గువాహటి డంపింగ్ స్టేషన్‌ను సందర్శించారు. డంప్ యార్డ్‌ని ప్రాసెస్ చేసే సంస్థ అక్కడ చెత్తను ఎలా శుద్ధి చేస్తుందో, వారు అనుసరిస్తున్న పద్ధతులు, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా వారు ఎలా పనిచేస్తున్నారో వివరించింది. ల్యాండ్‌ఫిల్లింగ్‌ని ప్రామాణిక విధానాలను అనుసరించి పూర్తి చేస్తారు, అనంతరం ఆ భూమిని చెత్త రహితంగా చేసి, గువాహటి మునిసిపల్ కార్పొరేషన్‌కు వివిధ ప్రయోజనాల కోసం అప్పగిస్తారు. ఈ ప్రాజెక్ట్‌ను జిగ్మా గ్లోబల్ ఎన్విరాన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అమలు చేస్తోంది. అదనంగా ఈ పర్యటనలో డిప్యూటీ మేయర్ గువాహటి నగరంలో సాగుతున్న అద్భుతమైన అభివృద్ధి పనులను కూడా సమీక్షించారు. ఆ నగరంలో చెత్త నిర్వహణలో అవలంబిస్తున్న నూతన సాంకేతిక పద్ధతులు, పర్యావరణానికి హాని కలిగించకుండా విధులు నిర్వహించే విధానం గురించి కూడా అవగాహన పొందారు. ఈ విధానం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కూడా తీసుకురావడంపై చర్చ జరిగింది. తద్వారా చెత్త నిర్వహణ సమస్యలకు ఒక శాశ్వత పరిష్కారం లభించవచ్చునని భావిస్తున్నారు. గువాహటి మునిసిపల్ కార్పొరేషన్, జిగ్మా గ్లోబల్ సంస్థల మధ్య సమన్వయం ద్వారా చేపట్టబడిన ఈ ప్రాజెక్ట్, ఇతర నగరాలకు కూడా ఒక ఆదర్శంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ పేరు ఎక్కడ..?

- శిలాఫలకాలపై కనిపించని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పేరు
- ప్రోటోకాల్ విస్మరిస్తున్న ఖమ్మం కార్పొరేషన్ అధికారులు






**ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధి , (జనం సాక్షి):** ప్రభుత్వ నిధులతో జరిగే ఏ అభివృద్ధి కార్యక్రమం అయినా సరే వాటిలో జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయడం పరిపాటి. ఇలా చేయని పక్షంలో ప్రోటోకాల్ ఉల్లంఘన జరిగినట్లే. గత ప్రభుత్వాలు సైతం ఈ తంతును ఇలాగే కొనసాగించాయి. కొన్నిచోట్ల ప్రోటోకాల్ ఉల్లంఘనలు జరిగినప్పుడు రాజకీయ ఘర్షణలు సైతం చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా అధికార పార్టీ నాయకులు ప్రతిపక్ష పార్టీల నాయకుల పేర్లను భాగస్వామ్యం చేయని పక్షంలో ఇలాంటి పరిస్థితులు తలెత్తేవి. అయితే ఖమ్మం జిల్లాలో అందుకు పూర్తిగా భిన్న పరిస్థితి నెలకొంది. అధికార పార్టీ ఎమ్మెల్సీ పేరును ఖమ్మం నగరంలో అభివృద్ధి పనుల శిలాఫలకాల్లో చేర్చకపోవడం కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్య పనితీరుకు నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తోంది. ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల ఎమ్మెల్సీ చింతపండు నవీన్ ( తీన్మార్ మల్లన్న) పేరును ఖమ్మం నగరంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకంలో చేర్చేందుకు ఖమ్మం కార్పొరేషన్ అధికారులకు మనసు రావడం లేదు. ఇది ముమ్మాటికి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ను అవమానించడమే. ప్రోటోకాల్ నిబంధన ఉల్లంఘించినట్లు అర్థమవుతుంది. బిఆర్ఎస్ పాలనపై తన కలంతో, వాక్చాతుర్యంతో పోరాడిన తీన్మార్ మల్లన్న కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నాడు. పార్టీని బలోపేతం చేయడంలో శక్తి వంచన లేకుండా కృషి చేశాడు. ఆయన చేరికతో అతని సామాజిక వర్గానికి చెందిన ప్రజలు, నాయకులు, యువత ఎక్కువ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఖమ్మం జిల్లాలో ఆ సామాజిక వర్గం కాంగ్రెస్ పార్టీ గెలుపు లో కీలకపాత్ర వహించింది అనడంలో ఎలాంటి సందేహం లేదు. అలాంటి వ్యక్తి పట్ల ఖమ్మం కార్పొరేషన్ అధికారులు సవతి తల్లి ప్రేమ కనబరుస్తున్నారు. ఖమ్మం నగరంలోని 37 డివిజన్లో జరిగిన అభివృద్ధి కార్యక్రమంలో ఏర్పాటుచేసిన శిలాఫలకాల్లో తీన్మార్ మల్లన్న పేరు లేదు. దీనిపై ఆ సామాజిక వర్గం నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

# తిరుపతి లడ్డూ కల్తీ వెనక బిజెపి కుట్ర

**మతపరమైన రాజకీయ క్రీడ మొదలయ్యింది**

**చంద్రబాబుతో ఆటలాడిస్తున్న బిజెపి**

**మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి సంచనల కామెంట్స్**



**హైదరాబాద్,సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన తిరుమల లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యి ఘటనపై ప్రజలంతా అనుమానాలు వ్యక్తం చేస్తుండగా మాజీ ఎమ్మెల్యే తూర్పు జగ్గారెడ్డి అందుకు భిన్నంగా స్పందించారు. తిరుమల లడ్డు వివాదం వెనక బీజేపీ కుట్ర ఉందంటూ అనుమానం వ్యక్తం చేశారు. తిరుపతి లడ్డు కల్తీ అయిందన్న వివాదంలో వాస్తవాలు ఏమిటి, జరిగింది ఏంటి అన్న విషయాలు మాత్రమే చర్చిస్తే భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా ఉంటాయన్నారు. ఇక్కడ జరిగిన అంశాలకంటే రాజకీయ లబ్ది, మతపరమైన అంశాల చర్చ ఎక్కువగా జరిగి వాస్తవాలు మరుగున పడి పోతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వాస్తవాలను వెంటనే బయటపెట్టి తిరిగి కల్తీలేని లడ్డులను భక్తులకు అందించి అలాంటి దోషాలు తిరిగి జగరకుండా పకడ్బందీగా చర్యలు తీసుకొని భక్తులకు భరోసా కల్పించాలని సూచించారు. కానీ అలా కాకుండా చంద్రబాబు దీన్ని రాజకీయం చేయడం, మత ప్రస్తావన తేవడం, జగన్ పేరు ప్రస్తావన చేయటంతో వ్యక్తిగతంగా తనకు కొన్ని అనుమానాలు వస్తున్నాయని.. బీజేపీ ఏమైనా చంద్రబాబుతో మతపరమైన రాజకీయాలకు తెరతీస్తుందా అనేది తన అనుమానం అంటూ బయటపెట్టారు. ఎందుకంటే బీజేపీ ఎజెండానే ఎప్పుడు ప్రజా సమస్యల చుట్టూ కాకుండా మతపరమైన అంశాల చుట్టూనే ఉంటుంది. ఎమోషనల్‌గా ప్రజలను రెచ్చగొట్టి రాజకీయం చేయడమే బీజేపీ ఎజెండా. పరిస్థితులు చూస్తే ఏపీలో బీజేపీ ఆట మొదలుపెట్టినట్టు అనిపిస్తోందని అంటూ వ్యాఖ్యలు చేశారు. ఏపీ రాజకీయాల్లో జగన్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడును అరెస్టు చేయించడాన్ని రాజకీయ పార్టీలకు అతీతంగా అంతా తప్పుపట్టామని.. ఒక విజన్ ఉన్న నాయకుడిగా ఆయన్ని గౌరవిస్తానన్నారు. హైదరాబాద్ అభివృద్ధిలో ఆయన భాగస్వామ్యం చాలా గొప్పది అని కొనియాడారు. జగన్ విజన్‌పై క్లారిటీ లేదు కానీ చంద్రబాబుకు విజనరీ అనే పేరు ఉందని చెప్పుకొచ్చారు. చంద్రబాబు వయస్సును కూడా చూడకుండా కొంతమంది వైసీపీ మంత్రులు, వైసీపీ ఎమ్మెల్యేలు ఇష్టం వచ్చినట్టు మాట్లాడడం సరైంది కాదన్నారు. అత్యంత సీనియర్ నేతల్లో ఒకరైన చంద్రబాబును కాపాడుకోవడం, గౌరవించుకోవడం అవసరమని గతంలోనే చెప్పానన్నారు. ముఖ్యమంత్రుల నిర్ణయాల్లో తప్పులు వెతకడం మొదలుపెడితే ఏ సీఎం కూడా పనిచేయలేరన్నారు. ఏదో టెక్నికల్ ఆధారాలు పట్టుకుని చంద్రబాబుని జైలుకు పంపారు అది ఆయన రాజకీయంగా అడ్వాంటేజ్‌గా తీసుకున్నారని తెలిపారు. చంద్రబాబు కుటుంబ సభ్యులు కూడా జగన్ పార్టీ నేతలు రాజకీయాల్లోకి లాగారు వారిపై అనుచిత కామెంట్స్ చేశారన్నారు. అటువంటి కామెంట్స్‌ను తెలంగాణ ప్రాంతానికి సంబంధించిన వారంతా ఖండించామని చెప్పారు. అధికారం మైకంలో జగన్ తీసుకున్న నిర్ణయాలు ఆయనకే శాపంగా మారాయన్నారు. అదే సమయంలో చంద్రబాబు ప్రజల్లో తిరుగుతూ కష్టపడ్డారని.. మళ్లీ ముఖ్యమంత్రి అయ్యారన్నారు. ఏపీలో కాంగ్రెస్ పార్టీ కూడా ఉందన్నారు. రాష్ట్రం విభజన చేసిందనే కోపం అక్కడ ప్రజలకు ఉందని.. అందుకే గత మూడు ఎన్నికలను కాంగ్రెస్ పార్టీని అక్కడి ప్రజలు నమ్మలేదన్నారు. భవిష్యత్తులో కాంగ్రెస్‌కు అక్కడి ప్రజలు బ్రహ్మరథం పడతారని నమ్మకముందన్నారు. రాబోయే రోజుల్లో రాహుల్ గాంధీకి దేశ ప్రజలు కచ్చితంగా అవకాశం ఇస్తారన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా రాహుల్ నేతృత్వంలోనే జరుగుతుందన్నారు. పోలవరం ప్రాజెక్టు కూడా కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీనే పూర్తి చేస్తారని స్పష్టం చేశారు. మోడీ ప్రత్యేక హోదా ఇస్తానని, పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇస్తానని ఇవ్వలేకపోయారన్నారు. ఇప్పుడు టీడీపీ బలంతోనే కేంద్రంలో మోదీ ప్రధానమంత్రి అయ్యారన్నారు. అయినా కూడా చంద్రబాబు ప్రత్యేక హోదా సాధించలేకపోతున్నారని తెలిపారు. గతంలో మోదీకి మద్దతు ఇచ్చిన జగన్ కూడా ప్రత్యేక హోదా తేలేకపోయారు అంటే గతంలో జగన్, ప్రస్తుతం చంద్రబాబు ఫెయిలయ్యారని విమర్శించారు. రాహుల్ గాంధీ వచ్చే ఎన్నికల తర్వాత ప్రధానమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ఏపీకి ప్రత్యేక హోదాతో పాటు.. పోలవరం ప్రాజెక్టును కచ్చితంగా పూర్తి చేస్తారని వెల్లడించారు.



# మెరుగైన వైద్య సేవలు అందించాలి

**సీజనల్ వ్యాధుల పట్ల ప్రమాదంగా ఉండాలి**

**రామన్నపేట ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ**

**కలెక్టర్ హనుమంత్ కె జెండాగా**



**భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** పేషెంట్లకు ఉత్తమ వైద్య సేవలందించాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టరు హనుమంత్ కే.జెండగే వైద్య అధికారులకు సూచించారు. బుధవారం నాడు ఆయన రామన్నపేట ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించి పేషెంట్లకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. వార్డులన్నింటిని కలియదిరిగి పేషెంట్లతో మాట్లాడారు. వారు ఎలాంటి అనారోగ్య కారణాలపై ఆసుపత్రికి వచ్చింది, ఏ గ్రామాల నుండి వచ్చింది, ఎన్ని రోజులయ్యింది, ఇంకా ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. వారితో మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత కూడా చాలా ముఖ్యమని, త్రాగే నీరు వేడి చేసి చల్లార్చి తాగాలని, వేడి ఆహారం తీసుకోవాలని, ఎలాంటి అనారోగ్య సమస్యలున్నా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సహాయం పొందాలని, ప్రభుత్వం అన్ని రకాల పరీక్షలు, మందులు అందిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా పేషెంట్లకు అందుతున్న వైద్యం, అందుకు సంబంధించిన మందులను, రికార్డులను పరిశీలించారు. ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలకు సంబంధించి అవసరమైతే సి.ఎస్.ఆర్. నిధుల నుండి మంజూరు చేస్తామని, గర్భిణీ స్త్రీల ఓ.పి. ఎక్కువ ఉన్నందున గైనకాలజిస్ట్, రేడియాలజిస్ట్ లను నియమిస్తామని తెలిపారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. పరిశుభ్రత, పారిశుద్యం పెంపొందేలా చర్యలు తీసుకోవాలని, క్లోరినేషన్, బ్లీచింగ్ నిర్వహించాలని, వర్షపునీరు పోయేలా ఇంకుడు గుంత నిర్మించాలని అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అందుకు ముందస్తు చర్యలలో భాగంగా గ్రామాలలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. వెంట జిల్లా ఆసుపత్రుల కోఆర్డినేటర్ డాక్టర్ చిన్నానాయక్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఈశ్వర్, తహశీలుదారు లాల్ బహదూర్ శాస్త్రి, మండల అభివృద్ధి అధికారి యాకూబ్ నాయక్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

# కల్తీ చేసి భక్తుల మనోభావాలు దెబ్బతీసారు

**కల్తీకి పాల్పడ్డ ఎవ్వరినీ ప్రభుత్వం వదలదు**

**మంత్రి సత్యకుమార్ ఘాటు హెచ్చరిక**

**విజయవాడ,సెప్టెంబర్25(జనంసాక్షి):** తిరుమల లడ్డూని కల్తీ చేసి వైసీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతీశారని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో వేంకటేశ్వరస్వామి భక్తులు, ఏపీ ప్రజలు ఆయణ్ని క్షమించరని అన్నారు. లడ్డూ కల్తీ చేసి అపరాచానికి పాల్పడిన ఎవ్వరినీ వదిలిపెట్టేది లేదని, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన వారధి కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ.. 'జగన్ హయాంలో లడ్డూ తయారీ నాణ్యతలో వైసీపీ నేతలు రాజీపడ్డారు. కమిషన్లకు కక్కుర్తి పడి నేతి సరఫరాలో నిర్లక్ష్యం వహించారు. పవిత్రమైన ప్రసాదంలో కొవ్వు కలిపి అపవిత్రం చేశారు. కల్తీ జరిగిందని ల్యాబ్ రిపోర్టుల ద్వారా నిర్ధారణ అయ్యింది. కోట్లాది మంది భక్తుల మనోభావాలను జగన్ దెబ్బతీశారు. టీటీడీ ఆస్తులు వేలం వేసేందుకు యత్నించారు. శ్రీవారి నిధులు దారి మళ్లించేందుకు కుట్రలు చేశారు. వాటి కన్నా ఇప్పుడు చేసిన నేరం అమానుషం. ఈ అపచారం చేసిన వ్యక్తులందరినీ కఠినంగా శిక్షించాలి. టీటీడీ బోర్డులో బీజేపీ నేతలు ఉన్నారని నింద మా పార్టీ నేతలకు ఆపాదించాలని జగన్ చూస్తున్నారు. టీటీడీ వ్యవహారాల్లో జగన్, వైవీ సుబ్బారెడ్డి, ధర్మారెడ్డి తప్ప సభ్యులందరూ డమ్మీలే కదా. ఆ ముగ్గురూ నిర్ణయాలు తీసుకుని బోర్డు మీటింగ్‌ల పేరుతో ఆమోదించేవారు. జగన్ తాను చేసిన తప్పుల నుంచి దృష్టి మళ్లించేందుకు బీజేపీ నేతల పాత్ర ఉందని చెబుతున్నారు. సీఎంగా ఉండి టీటీడీలో జరిగే అపచారాలను ఆపే బాధ్యత నీకు లేదా జగన్?. ఏపీ మాజీ అదనపు అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ రెడ్డి సిగ్గు లేకుండా వాగుతున్నారు. లడ్డూ ప్రసాదాన్ని పంది కొవ్వుతో పోలుస్తున్నాడు. అసలు ఏమైనా బుద్ధి ఉందా?. వైసీపీ అధినేతకు టామాటా, పొటాటోకు కూడా తేడా తెలియదన్నారు. ఫ్యాన్ పార్టీ అధినేత ఐదు నిమిషాలు మాట్లాడేతే చాలు అతని డొల్లతనం బయటపడుతుంది.

# కృష్ణయ్య కోసం కాంగ్రెస్, బిజెపిల కర్చీఫ్

- నేరుగా కలిసిన తీన్మార్ మల్లన్న, మల్లురవి
- బిసి కమిషన్ జాతీయ అధ్యక్షుడు అంటూ బిజెపి ప్రచారం

**హైదరాబాద్,సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** వైకాపా తరఫున రాజ్యసభకు ఎన్నికైన కృష్ణయ్య రాజీనామా చేయడంతో ఇప్పుడు ఆయన చుట్టూ రాజకీయాలు తిరుగుతున్నాయి. తాను కేవలం బిసి ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు రాజీనామా చేసానని కృష్ణయ్య ప్రకటించారు. అయితే ఆయనను కాంగ్రెస్‌లో చేర్చుకోవాలని నేతలు భావిస్తున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఎంపి మల్లు రవిలు ఆయనను కలసి తమ అభిప్రాయాం చెప్పారు. బీసీ సంఘం నాయకుడు, వైసీపీ తరఫున రాజ్యసభకు ఎన్నికైన ఆర్.కృష్ణయ్య తన పదవికి సోమవారం రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆయన రాజీనామాకు రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ మంగళవారం ఆమోదం తెలిపారు. ఆర్ కృష్ణయ్యను మోదీ ప్రభుత్వం జాతీయ బీసీ కమిషన్ చైర్మన్‌గా నియమించే అవకాశం ఉందంటూ బీజేపీ వర్గాల్లో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆసక్తికరమైన పరిణామం చోటుచేసుకుంది. కృష్ణయ్యతో కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి భేటీ అయ్యారు. కృష్ణయ్య నివాసానికి వెళ్లి మరీ కలిశారు. ఆయనను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించేందుకు వెళ్లినట్టు సమాచారం. మరి కృష్ణయ్య మనసులో ఏముంది, మల్లు రవి ఏం చర్చించా రన్నది తెలియాల్సి ఉంది. ఆర్.కృష్ణయ్య తదుపరి అడుగు ఆసక్తికరంగా మారింది. ఆయన్ను మోదీ ప్రభుత్వం జాతీయ బీసీ కమిషన్ చైర్మన్‌గా నియమించే అవకాశం ఉందని బీజేపీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. బీసీల హక్కుల కోసం చేస్తున్న పోరాటంలో భాగంగా కొత్త పార్టీ ఏర్పాటు చేయాలని రెండ్రోజుల కిందట జరిగిన సమావేశంలో పలు బీసీ సంఘాలు ఆయన్ను కోరాయి. అయితే అంతకుముందే బీజేపీ జాతీయ అగ్ర నేతలు ఆయన్ను పార్టీలోకి ఆహ్వానించినట్లు ప్రచారం జరిగింది. ఆయనకు కీలక పదవి కట్టబెట్టడం ద్వారా తెలంగాణలో బీసీ ఓటుబ్యాంకు మరింత పెంచుకోవచ్చన్న అంచనాల్లో భాగంగా వారు ఆయనతో చర్చించినట్లు చెబుతున్నారు. కృష్ణయ్య జన్మదినం సందర్భంగా ప్రధాని మోదీ, అమిత్ షా స్వయంగా ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇది ఆయన్ను జాతీయ బీసీ కమిషన్ చైర్మన్‌గా నియమిస్తారనడానికి సంకేతాలని బీజేపీ వర్గాలు అంటున్నాయి. రాజకీయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదు.

# పోలీస్ వృత్తి నైపుణ్యాల పైన డ్యూటీ మీట్ నిర్వహణ

**జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్**



**నల్గొండటౌన్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** కేసుల దర్యాప్తు, పోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్స్, నేర పరిశోధన ఫోటోగ్రఫీ డాగ్ స్క్వాడ్, బాంబు డిస్పోజల్ టీం,లాంటి అంశాలలో పరీక్షలు. జిల్లా పోలీసు కార్యాలయంలో అధికారులు మరియు సిబ్బంది పోలీసు వృత్తి నైపుణ్యాల పైన జిల్లా స్థాయి డ్యూటి మీట్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పి ప్రారంభించి మాట్లాడుతూ పోలీసులు విధి నిర్వహణలో కేసుల దర్యాప్తు, నేర పరిశోధనలో మెలుకువలు ఎంతో దోహదపడతాయని అన్నారు. మనం నిర్వహించే విధుల పట్ల మెలుకువలు పెంపొందించుకోవాలని అన్నారు. ఈ జిల్లా స్థాయిలో నిర్వహించే కేసుల దర్యాప్తు ,పోరెన్సిక్ సైన్స్,ఫింగర్ ప్రింట్స్, నేర పరిశోధనలో ఫోటోగ్రఫీ, విడియో గ్రఫి, డాగ్ స్క్వాడ్, బాంబు డిస్పోజల్ టీం,లాంటి అంశాలలో పట్టు సాధించి జిల్లా స్థాయి నుంచి జాతీయస్థాయిలో ఎంపిక కావాలని అన్నారు. ఈ డ్యూటీ మీట్ ఉద్దేశం పోలీసు అధికారుల మరియు సిబ్బంది నైపుణ్యాలను మెరుగుపరచడం, వాటి వినియోగాన్ని ప్రోత్సహించడం అని, ఇందులో గెలుపొందిన వారిని రేంజ్ మీట్ కి పంపడం జరుగుతుంది, తదుపరి స్టేట్ మీట్ కి ఆతరువాత నేషనల్ మీట్ కి పంపడం జరుగుతుంది అని అన్నారు అక్కడ గెలుపొందిన వారికి నగదు బహుమతి ప్రదానం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములు నాయక్ , ఎస్బి డీఎస్పీ రమేష్,ఎస్బి ఇన్స్పెక్టర్ రాఘవ రావు , రిజర్వు ఇన్స్పెక్టర్లు, శ్రీను,సంతోష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు ముందస్తు చర్యలతో ప్రాణనష్టం జరగలేదు

**విజయవాడ వరదల్లో బాబు పనితీరు అద్భుతం**

**మోడీ, బాబులు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారు**

**కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు**



**శ్రీకాకుళం,సెప్టెంబర్25 (జనంసాక్షి):** విజయవాడ వరదల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన సేవలు, తీసుకున్న చర్యలు అద్భుతంగా పని చేశాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. వరదలకు సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయాల వల్లే పెద్దఎత్తున ప్రాణనష్టం తప్పిందన్నారు. సూపర్ సిక్స్‌లో భాగంగా దీపావళి రోజు నుంచీ గ్యాస్ కనెక్షన్లు అందిస్తాం'అని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అభివృద్ధి పరుగులు పెడుతోందని రామ్మోహన్ నాయుడు అన్నారు. అటు ప్రధాని మోదీ, ఇటు సీఎం చంద్రబాబు ఇద్దరూ కలిసి ఏపీని అభివృద్ధి చేసేందుకు కంకణం కట్టుకున్నట్లు కేంద్ర మంత్రి చెప్పారు. ఇప్పటికే రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15వేల కోట్లు, పోలవరం మొదటి దశ పనుల కోసం రూ.12,567కోట్లు కేంద్రం ప్రకటించిందని ఆయన తెలిపారు. అలాగే రాష్ట్రానికి మూడు పారిశ్రామిక కారిడార్లు సహా ఇతర అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు మోదీ సర్కార్ అండగా ఉన్నట్లు రామ్మోహన్ నాయుడు చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ..' శ్రీకాకుళం జిల్లా నుంచి నాకు కేంద్ర మంత్రిగా అవకాశం వచ్చింది. ఈ ఐదేళ్లపాటు జిల్లా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తా. జిల్లాలో ఒక పోర్టు, ఎయిర్‌పోర్ట్ నిర్మిస్తా. టెక్కలి మూలపేటలో సంవత్సరంలో పోర్టు పనులు పూర్తి చేస్తాం. నాకు కేంద్ర మంత్రిగా అవకాశం వస్తే.. బాబాయి కింజరాపు అచ్చెనాయుడుకి ఏపీ మంత్రిగా అవకాశం వచ్చింది. ఇద్దరం కలిసి జిల్లాని అభివృద్ధి చేస్తాం. శ్రీకాకుళం జిల్లా ప్రజల అభిమానం వల్లే మేము ఈ స్థాయికి వచ్చాం. ప్రతీ నెలా తెల్లవారుజామునే మీ ఇంటికి వచ్చి పింఛన్లు పంపిణీ చేస్తున్నాం. మాజీ సీఎం ఎన్టీఆర్ ఆనాడు మత్స్యకారులకు అనేక విధాలుగా సహాయం చేశారు. అదే విధంగా సీఎం చంద్రబాబు ముందుకు వచ్చారు. ప్రతీ ఒక్కరినీ ఆయన ఆదుకునేందుకు ముందుంటారు. త వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసింది. జగన్ హయాంలో ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ కూడా వేయలేదు. ముఖ్యంగా డీఎస్సీ అభ్యర్థులకు గత పాలకులు తీవ్రనష్టం చేకూర్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రోజే 16వేల పోస్టుల భర్తీ చేసేందుకు సీఎం చంద్రబాబు డిఎస్సీ నోటిఫికేషన్‌పై మొదటి సంతకం చేశారు. గత ప్రభుత్వంలో అన్న క్యాంటీన్లు మూసి వేస్తే, కూటమి ప్రభుత్వం వచ్చాక 100రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 178 అన్న క్యాంటీన్లు ప్రారంభించింది. హుద్‌హుద్ తుపాన్ బాధితులకూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇళ్లు నిర్మించామని అన్నారు.

# చారిత్రాత్మక సందర్శనీయ క్షేత్రం ఉండ్రుగొండ గిరిదుర్గం

**ప్రకృతి రమణీయతకు నిలువెత్తు సాక్ష్యం**

**పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు కృషి**

**జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**



**సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):** చారిత్రాత్మక సందర్శనీయ క్షేత్రం ఉండ్రుగొండ గిరిదుర్గం అని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. బుధవారం చివ్వెంల మండలం ఉండ్రుగొండ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంను ఆయన పరిశీలించారు. దేవస్థాన కమిటీ ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటి ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ పరిశీలించారు. ప్రకృతి రమణీయతకు నిలువెత్తు సాక్ష్యమని అన్నారు. పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ వేణుమాధవ్, డిఎఫ్ఓ సతీష్ కుమార్, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి ఏ.రమేష్ కుమార్, ఉండ్రుగొండ పర్యాటక అభివృద్ధి సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రముఖ వైద్యులు ఆదూర్తి రామయ్య, కార్యదర్శి మహేశ్వరం రవిచంద్ర, ఆలయ కమిటీ సభ్యులు చకిలం కృష్ణ కుమార్, కృష్ణ మోహన్, శ్రీరాములు, మురళి కృష్ణ, ప్రముఖులు జుట్టుకొండ సత్యనారాయణ, నాగవల్లి బ్రహ్మయ్య, వంగర భరద్వాజ, కట్టంగూరి సంతోష్, పల్స సైదులు, చకిలం హర్ష తదితరులు పాల్గొన్నారు.

# 28న కాలినడకన తిరుమలకు జగన్

**ఆలయాల్లో పూజలకు వైసిపి పిలుపు**



**అమరావతి,సెప్టెంబర్25 (జనంసాక్షి):** వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ ఈనెల 28న తిరుమలకు కాలినడకన వెళ్లనున్నారు. లడ్డూ వ్యవహారంలో చంద్రబాబు చేసిన ఆరోపణలతో తిరుమల ఆలయ పవిత్రతను, స్వామివారి ప్రసాదం విశిష్టతను మంటగలిపారని పేర్కొంటూ వైసీపీ ఆలయాల్లో పూజలకు పిలుపునిచ్చింది. ఈనెల 28న రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో పూజలు చేపట్టాలని వైఎస్ జగన్ ట్విట్టర్ వేదిక ద్వారా పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఆయన తిరుమల వేంకటేశ్వరస్వామి వద్దకు మెట్ల మార్గాన వెళ్లనున్నారు. తిరుమల లడ్డూ పవిత్రతను, స్వామివారి ప్రసాదం విశిష్టతను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు వైసీపీ పూజలకు పిలుపునిచ్చింది. ఈ మేరకు వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం ఎక్స్ వేదిక ద్వారా వైసీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వెంకటేశ్వరస్వామి వైభవాన్ని, టీటీడీ పేరు ప్రఖ్యాతులను, లడ్డూ పవిత్రతను, రాజకీయ దుర్బుద్ధితో, కావాలని అబద్ధాలాడుతున్నాని దుయ్యబట్టారు. జంతువుల కొవ్వుతో కల్తీ జరగనిది జరిగినట్టుగా, ఆ కల్తీ ప్రసాదాన్ని భక్తులు తిన్నట్టుగా, అసత్య ప్రచారంతో ముఖ్యమంత్రి హోదాలో ఉన్న చంద్రబాబు వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు.

# డంపింగ్ యార్డు వద్ద ప్రమాదం: వ్యక్తి మృతి..స్థానికుల ఆందోళన

**మేడ్చెల్,సెప్టెంబర్25, (జనంసాక్షి):** మేడ్చల్ జిల్లాలో జవహర్ నగర్ డంపింగ్ యార్డు వద్ద బుధవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బైక్ ను డిసిఎం ఢీకొట్టడంతో ఒక వ్యక్తి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. మాజీ ఉప సర్పంచ్ కందాడి అమరేందర్ రెడ్డి తన భార్య ప్రమీలతో కలిసి బైక్ పై హైదరాబాద్ నుంచి తిమ్మాయిపల్లికి వెళు న్నాడు. జవహర్ నగర్ డంపింగ్ యార్డు వద్ద బైక్ ను డిసిఎం ఢీకొట్టడంతో అమరేందర్ ఘటనా స్థలంలోనే చనిపోయాడు. భార్య ప్రమీల తీవ్రంగా గాయపడడంతో ఆస్పత్రికి తరలించారు. ప్రమీల గతంలో ఎంపిటిసిగా సేవలు అందించారు. డంపింగ్ యార్డుతో ప్రమాదం జరిగిందని తిమ్మాయిపల్లి వాసులు, మృతుడి బంధువులు రాంకీ కార్యాలయంపై దాడి చేసి అద్దాలను పగులగొట్టారు. మృతదేహాన్ని కార్యాలయం ముందు ఉంచి ఆందోళనకు దిగారు. జవహర్ నగర్ డంపింగ్ యార్డు నుంచి వ్యర్థ రసాయానాలు బయటకు రావడంతో వాహనాలు జారి ప్రమాదానికి గురవుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. వ్యర్థ రసాయానాలు రోడ్డుపైకి రావడంతో ప్రమాదాలు జరిగి స్థానిక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# చరిత్రలో అతిపెద్ద ఐపీవోకి గ్రీన్‌సిగ్నల్



ముంబై, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) : భారతీయ స్టాక్ మార్కెట్లో ఐపీవోలపై బెట్టింగ్ వేస్తున్న వారి పరిస్థితి మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది. అవును దరఖాస్తులో ఏ ఐపీవో తగిలినా లాభాలు మాత్రం పొందుతూనే ఉన్నారు. ఈ క్రమంలో పదుల సంఖ్యలో వస్తున్న ఐపీవోల్లో ఒక మెగా ఐపీవో కూడా ఉండటం గమనార్హం. దేశంలో చాలా కాలం కిందట ఎల్‌ఐసీ అతిపెద్ద ఐపీవోను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. దానీ తర్వాత తాజాగా ఎల్‌ఐసీ రికార్డులను బద్ధలుకొడుతూ హ్యుందాయ్ ఇండియా రూ.25,000 కోట్ల మెగా ఐపీవోకు తెరలేపింది. తాజాగా దీనికి మార్కెట్ రెగ్యులేటర్ సెబీ నుంచి గ్రీన్ సిగ్నల్ రావటంతో ఇన్వెస్టర్లు పండుగ చేసుకుంటున్నారు. హ్యుందాయ్ మోటార్స్ ఇండియా క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ నుంచి ఆమోదం పొందిన తర్వాత భారతదేశపు అతిపెద్ద ప్రారంభ పబ్లిక్ ఆఫర్ ప్రారంభించేందుకు సిద్ధంగా ఉంది. జూన్ 2024లో కంపెనీ సెబీ వద్ద ఐపీవో కోసం డ్రాఫ్ట్ పేపర్‌లను దాఖలు చేసింది. హ్యుందాయ్ మోటార్ ఇండియా ఐపీవో రాబోతోందన్న చర్చ ఊపందుకోగానే ఇన్వెస్టర్ల మదిలో తాము కూడా అందులో పాల్గొనాలనే ఆలోచన మ్మొదలైంది. అయితే ఇక్కడ కంపెనీ విలువ ఎంత అనేది పెద్ద ప్రశ్నగా మిగిలిపోయింది. ఈ క్రమంలో కంపెనీ ఐరీవో ప్రైస్ బ్యాండ్ ధర ఒక్కో షేరుకు రూ.1265 నుంచి రూ.1988 మధ్య ఉండొచ్చని కొన్ని నివేదికల ప్రకారం తెలుస్తోంది. తాజా ఐపీవో ద్వారా భారత స్టాక్ మార్కెట్ల నుంచి కంపెనీ 3.5 బిలియన్ డాలర్లను సమీకరించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం ఆటో దిగ్గజం ఐపీవోను వచ్చే నెల ప్రారంభించవచ్చని తెలుస్తోంది.

**స్విగ్గీ ఐపీవోకి సెబీ ఓకే..**

మరోపక్క అతిపెద్ద ఐపీవో కోసం దేశీయ ఫుడ్ డెలివరీ స్టార్టప్ స్విగ్గీ సైతం మార్కెట్ రెగ్యులేటరీ సంస్థ సెబీ నుంచి అనుమతులు పొందినట్లు వెల్లడైంది. స్విగ్గీ ఇష్యూ నవంబర్‌లో ప్రారంభించవచ్చని నివేదికల ప్రకారం తెలుస్తోంది. కంపెనీ తన ఐపీవో పరిమాణాన్ని సుమారు రూ.11,700 కోట్లకు పెంచుతుందని భావిస్తున్నారు. ఇదే జరిగితే కంపెనీ 5వ అతిపెద్ద ఐపీవోగా మార్కెట్లో అవతరించనుంది. ఆఫర్ పరిమాణాన్ని పెంచడానికి అక్టోబర్ మొదటి వారంలో ఇన్వెస్టర్ల మీటింగ్ ప్లాన్ చేయబడుతుందని సమాచారం. దీని ప్రకారం 2021లో ప్రారంభించబడిన దాని ప్రధాన ప్రత్యర్థి జొమాటో యొక్క రూ.9,375 కోట్ల ఇష్యూ కంటే స్విగ్గీ ఐపీవో పెద్దదిగా ఉండనుందని తెలుస్తోంది.




## తొలిసారి 26వేల ఎగువన ముగిసిన నిఫ్టీ



ముంబై, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) : దేశీయ స్టాక్ మార్కెట్లు మరోసారి జీవితకాల గరిష్ఠానికి చేరాయి. ముగింపులో తొలిసారిగా రికార్డు స్థాయిలో ముగిశాయి. తొలిసారిగా నిఫ్టీ 26వేల పాయింట్ల ఎగువన ముగిసింది. బుధవారం ఉదయం మార్కెట్లు ఫ్లాట్‌గా మొదలయ్యాయి. చివరి సెషన్‌లో మెటల్, మీడియా, ఎనర్జీ రంగాల షేర్ల మద్దతుతో లాభాల్లో ముగిశాయి. ఉదయం సెన్సెక్స్ పాయింట్ల వద్ద ఫ్లాట్‌గా మొదలైంది. ఆ తర్వాత సూచీలు ఒడిదొడుకులను ఎదుర్కొన్నాయి. ఇంట్రాడేలో 84,743.04 పాయింట్ల కనిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. అత్యధికంగా 85,247.42 పాయింట్లకు పెరిగింది.

చివరకు 255.83 పాయింట్ల లాభంతో 85,169.87 పాయింట్ల వద్ద రికార్డు స్థాయిలో ముగిసింది. నిఫ్టీ 63.75 పాయింట్ల లాభంతో 26,004.15 వద్ద స్థిరపడింది. మొదటిసారిగా నిఫ్టీ 26పాయింట్ల ఎగువన ముగిసింది. నిఫ్టీలో పవర్ గ్రిడ్ కార్ప్, ఎన్‌టీపీసీ, యాక్సిస్ బ్యాంక్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్, బజాజ్ ఫిన్‌సర్వ్ టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. ఎల్‌టీఐఎండ్‌ట్రీ, టెక్ మహీంద్రా, టాటా కన్స్యూమర్, టాటా మోటార్స్, టైటాన్ కంపెనీ నష్టపోయాయి. బీఎస్‌ఈలో మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు 0.5 శాతం చొప్పున పతనమయ్యాయి. పవర్, మెటల్, మీడియా, రియల్టీ సూచీలు 0.5–3 శాతం వరకు పెరిగాయి. ఎఫ్‌ఎంసీజీ, పీఎస్‌యూ బ్యాంక్, ఐటీ 0.5–1 శాతం వరకు తగ్గాయి.

| నెక్ గుడ్ల ధరలు | ఫామ్‌గేట్ | డజన్ |
|---|---|---|
| హైదరాబాద్ | ₹ 512 | ₹ 61 |
| వరంగల్ | ₹ 512 | ₹61 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్

| | |
|---|---|
| ₹75,110 (24 క్యారెట్లు) | ₹68,850 (22 క్యారెట్లు) |

చెన్నై

| | |
|---|---|
| ₹68,850 (22 క్యారెట్లు) | ₹75,110 (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹97,500

# కొత్త వ్యాపారంలోకి అదానీ గ్రూప్..

- దిగ్గజంతో జత, అమ్మడు ఇక కుమ్ముడే..!!



ముంబై, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) : అదానీ గ్రూప్ వ్యవస్థాపకుడు గౌతమ్ అదానీ దేశంలోని అనేక విమానాశ్రయాలను కొనుగోలు చేసి వాటిని నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ రంగంలో ఇప్పటికే పెద్ద ఆగడిగా అవతరించిన ఆయన ఇతర దేశాల్లోని విమానాశ్రయాల నిర్వహణకు వెళ్లగా బెడిసికొట్టిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో విమానయాన రంగంలో మరింతగా వ్యాపారాన్ని విస్తరించేందుకు చర్చలు ప్రారంభించారు. ఈ క్రమంలో తన విమానయాన పరిశ్రమలో తన సేవా సామర్థ్యాలను పెంచుకోవడానికి అదానీ గ్రూప్ కొత్త కూటమిని ఏర్పాటు చేయడానికి బొంబార్డియర్ సీఈవో ఎరిక్ మార్టెల్‌తో ఒక ప్రధాన సమావేశాన్ని నిర్వహించింది. ఎయిర్‌క్రాఫ్ట్ సర్వీసులు, ఎమ్మార్వో, డిఫెన్స్‌లో భాగస్వామ్యాన్ని చర్చించినట్లు అదానీ తన ట్విట్టర్ ఖాతా ద్వారా వెల్లడించారు. ఏవియేషన్ కంపెనీ ప్రధాన వాటాదారుడు పుంజ్ లాయిడ్ గ్రూప్ లిక్విడేషన్‌లోకి వెళ్లడంతో గ్రూప్ గత సంవత్సరం.. నిర్వహణ మరమ్మత్తు ఓవర్‌హాల్ (ఎమ్మార్వో) కంపెనీ ఎయిర్ వర్క్స్ ప్రతిపాదిత రూ.400 కోట్ల కొనుగోలును నిలిపివేసిన తర్వాత ఇది జరిగింది. దీని ఫలితంగా 2022లో అదానీ ప్రతిపాదించిన ఒప్పందం క్లోజ్ చేయలేకపోయింది.

బొంబార్డియర్ కెనడా ప్రముఖ వ్యాపార జెట్ తయారీదారు. విమానాల ఉత్పత్తి, రక్షణలో ప్రత్యేకత కలిగిన వాణిజ్య సామ్రాజ్యం కలిగి ఉంది. బొంబార్డియర్ విమానాలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న మిలిటరీలు, ప్రభుత్వాలు అలాగే సూపర్ ధనవంతులు ఉపయోగిస్తున్నారు. అదానీ గ్రూప్ కేవలం విమానాశ్రయ సేవలను మాత్రమే అందజేస్తుండగా, విమానాలకు కూడా అనుబంధ సేవలను అందించేందుకు సన్నాహాలు చేస్తోంది. వాస్తవానికి ఈ సేవల కోసం ప్రస్తుతం అన్ని విమానయాన సంస్థలు విదేశీ కంపెనీలపై ప్రధానంగా ఆధారపడుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఎమ్మార్వో సేవల్లో "ఆత్మనిర్భర భారత్" సాధించటానికి ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునే దిశగా అదానీ గ్రూప్ వేగంగా అడుగులు వేస్తోంది. ఎరిక్ మార్టెల్ గౌతమ్ అదానీ సమావేశం భారతదేశ విమానయాన పరిశ్రమలో కీలక పరిణామంగా చెప్పుకోవచ్చు. విదేశీ ఎమ్మార్వో సేవలపై ఆధారపడటాన్ని తగ్గించే లక్ష్యంతో, స్థానిక ఎమ్మార్వో రంగాన్ని సృష్టించి ఆధిపత్యాన్ని సాధించాలని అదానీ ప్రయత్నిస్తోంది. వాస్తవానికి ఈ కూటమి ఏర్పాటు ఎయిర్‌లైన్ కార్యకలాపాలలో అదనపు ఖర్చులను తగ్గించటంలో తోడ్పడుతుందని తెలుస్తోంది. ఇది విజయవంతమైతే విమానాల మెయింటెనెన్స్ అండ్ సర్వీస్ రంగంలో భారత్ కొత్త హబ్‌గా అవతరించటానికి చక్కటి అవకాశాలు లభిస్తాయని ఏవియేషన్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## జెరోధాకు రూ.2 కోట్లు కుచ్చుటోపీ..

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) : ఇటీవలి కాలంలో దేశీయ స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు పెడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. ప్రధానంగా చిన్న రిటైల్ ఇన్వెస్టర్లు భారీగా మార్కెట్లోకి డబ్బు కుమ్మరిస్తున్నారు. ఈక్విటీలు, డెరివేటివ్స్ వంటి రిస్కీ సాధనాల్లో తమ డబ్బును పెట్టడం ద్వారా వేగంగా రాబడులను పొందాలని ప్రయత్నిస్తున్నారు. అయితే వీటికి కావలసింది ముందుగా ఒక బ్రోకరేజ్ సంస్థ నుంచి ట్రేడింగ్ అకౌంట్ తీసుకోవటం. చాలా మంది తమ ట్రేడింగ్ అవసరాల కోసం తక్కువ ఖర్చులో సేవలను అందించే డిస్కౌంట్ బ్రోకరేజీలను ఎంచుకుంటుంటారు. ఈ కేటగిరీలో అతిపెద్ద ఆటగాడు జెరోధా. అయితే తాజాగా కంపెనీలో జరిగిన పెద్ద కుంభకోణం వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారంలో సీఐడీ క్రైమ్ బ్రాంచ్ 15 మంది వ్యక్తులపై కేసు నమోదు చేయడంతో సూరత్‌లో ముఖ్యమైన స్టాక్ బ్రోకింగ్ స్కామ్ వెలుగులోకి వచ్చింది.

బ్రోకరేజ్ ప్లాట్‌ఫారమ్‌లోని ఉద్యోగి నకిలీ డీమ్యాట్, ట్రేడింగ్ ఖాతాలను సృష్టించినట్లు గుర్తించబడింది. ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న కిషన్ సోనీని అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వాస్తవానికి సోనీ, జెరోధాతో మాజీ వ్యక్తిగత క్లయింట్ అసోసియేట్. ఇతను దాదాపు రెండేళ్ల కాలంలో 432 ఖాతాలను తెరిచాడు.




## వయనాడ్‌లో ప్రియాంక ఘనవిజయం ఖాయం

- కాంగ్రెస్ కార్యదర్శి కెసి వేణుగోపాల్ ధీమా



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) : రాహుల్ గాంధీ ఖాళీ చేసిన వయనాడ్ లోక్‌సభ స్థానంలో ప్రియాంక గాంధీ అఖండ విజయం సాధిస్తారని కాంగ్రెస్ పార్టీ బుధవారం ధీమా వ్యక్తం చేసింది. ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ బుధవారం నాడిక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వయనాడ్‌లో విజయంపై తమ పార్టీ సంపూర్ణ నమ్మకంతో ఉందని తెలిపారు. ఎన్నికల కోసం పార్టీ నాయకత్వం, కార్యకర్తలు సన్నాహాలు ప్రారంభించారని, అయితే ఇంతలో వయనాడ్ జిల్లాలో కొండచరియలు విరిగిపడిన దుర్ఘటన చోటుచేసుకుందని ఆయన చెప్పారు. ఎన్నికల ప్రకటన వెలువడిన వెంటనే కాంగ్రెస్ పార్టీ, యుడిఎఫ్ చురుకుగా వివిధ కార్యక్రమాలు చేపడతాయని ఆయన చెప్పారు. చట్ట ప్రకారం ఆరు నెలల్లో ఉప ఎన్నికలను నిర్వహించాల్సి ఉంటుంది. ఈ ఏడాది నవంబర్‌తో గడువు ముగియనున్నది. ఎప్పుడు ఎన్నికలను ప్రకటించినా ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగా ఉన్నామని వేణుగోపాల్ ప్రకటించారు. ఈ నియోజకవర్గంలో ప్రచారం నిర్వహిస్తూనే మిగిలిన రాష్ట్రాల్లో కూడా ప్రియాంక గాంధీ ప్రచారం నిర్వహించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. రెండు లోక్‌సభ స్థానాలలో గెలుపొందిన రాహుల్ గాంధీ ఉత్తర్ ప్రదేశ్‌లోని రాయబరేలి స్థానాన్ని ఉంచుకుని వయనాడ్‌కు రాజీనామా చేస్తారని, ఖాళీ అయ్యే వయనాడ్ నుంచి ప్రియాంక గాంధీ పోటీ చేస్తారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే జూన్‌లో ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తర్వాత గెలిచిన రెండు స్థానాలలో ఒక స్థానాన్ని వదులుకుంటున్నట్లు రాహుల్ ప్రకటించాల్సి ఉంది.

# వరద సమయంలో ఉద్యమస్ఫూర్తితో పనిచేశాం

- ప్రజల కష్టాల్లో అందరు ఒక్కటై పనిచేశారు
- సిఎం సహాయనిధికి భారీగా చేయూత
- 400కోట్ల సాయం అందిందన్న సిఎం చంద్రబాబు





విజయవాడ, సెప్టెంబర్25 (జనంసాక్షి) : వరద సమయంలో అందరం కలిసి ఉద్యమ స్ఫూర్తితో ముందు కెళ్లినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. విజయవాడలో వరద బాధితులకు ఆర్థిక సాయం అందజేసేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'పెద్ద విపత్తు కలిగినప్పుడు అందరం ఒక్కటై పనిచేయగలిగాం. ఒకవైపు వర్షపు నీరు వస్తుంటే.. మరోవైపు బుడమేరు నీరు పోటెత్తింది. అధికార యంత్రాంగంతో పాటు నేను స్వయంగా బురదలో దిగాను. తక్కువ సమయంలో విపత్తు నుంచి బయటపడగలిగాం. విరాళాల కోసం రాష్ట్రప్రజలంతా బ్రహ్మాండంగా స్పందించారు. వరద బాధితులకు సాయం చేద్దామని పిలుపునిస్తే అంతా ముందుకొచ్చారు. సీఎం సహాయనిధికి రూ.400 కోట్లు రావడం ఒక చరిత్ర. నాతో పాటు ఉద్యోగులంతా 11 రోజుల పాటు నిర్విరామంగా పనిచేశారు. వరద నీటిలో బాధితులకు అన్నిరకాల సాయం అందించే ప్రయత్నం చేశాం. బుడమేరుతో పాటు ప్రకాశం బ్యారేజీకి ఈస్థాయిలో వరద ఎప్పుడూ రాలేదు. 11.90 లక్షల క్యూసెక్కుల గరిష్ఠ వరద సామర్థ్యం ఉంటే 11.47 లక్షల క్యూసెక్కుల వరదనీరు వచ్చింది. గత పాలకుల నిర్లక్ష్య వైఖరితో విజయవాడ వరద ముంపునకు కారణమైంది. కలెక్టర్ కార్యాలయంలోనే మకాం వేసి పరిస్థితి పర్యవేక్షించా. మొట్టమొదటిగా సింగ్ నగర్ వెళ్లి పరిస్థితి పరిశీలించి ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాతో మాట్లాడి బోట్లు, హెలికాప్టర్లు తెప్పించాం. పెద్ద సంఖ్యలో ఆహార పొట్లాలు, నీటి బాటిళ్లు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశాం. సహాయక చర్యల్లో 780 ప్రొక్లెయిన్లు పని చేశాయి. 75 వేల ఇళ్లను, 331 కిలోమీటర్ల మేర రహదారులను ̧÷ర్ ఇంజిన్లు శు భ్రపరిచాయి. మొత్తం వర్షాలు, వరదల కారణంగా 47 మంది మృతి చెందారు. ఇప్పటివరకు రూ.400 కోట్ల మేర సీఎం సహాయ నిధికి డబ్బులు వచ్చాయి. చిన్నా పెద్దా అందరూ స్పందించారు. సంఘటితంగా ఉంటే ఎలాంటి విపత్తు అయినా ఎదుర్కొంటాం. రూ.602 కోట్లు ఇప్పటివరకు బాధితులకు విడుదల చేశాం. ఇందులో రూ.400 కోట్లు దాతలు ఇచ్చినవే. మొత్తం నష్టం రూ.6,800 కోట్ల మేర జరిగింది. 16 జిల్లాలు ప్రభావితం అయ్యాయి. మొత్తం 4 లక్షల మందికి ఆర్థిక సాయం అందించాం. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కిరాణ దుకాణాలు, తోపుడు బండ్లకు సహాయం చేస్తున్నాం. నష్టపోయిన పంటలకు సాయం అందిస్తున్నాం. ఇళ్లు మునిగిన వారికి రూ.25 వేలు చొప్పున, మొదటి అంతస్తులో ఉన్న వారికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం చేశామని చంద్రబాబు తెలిపారు.

## మహాలక్ష్మి హత్య కేసులో ఒడిషాకు బృందాలు

- కర్ణాటక హోంమంత్రి పరమేశ్వర వెల్లడి

బెంగళూరు, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) : బెంగళూరులో 29 ఏళ్ల యువతి మహాలక్ష్మి హత్య కేసులో నిందితుడు ఒడిశాలో దాగున్నాడని సమాచారం అందడంతో అక్కడకు నాలుగు పోలీస్ బృందాలు బయలుదేరి వెళ్లాయని కర్ణాటక హోం మంత్రి జి. పరమేశ్వర బుధవారం వెల్లడించారు. విలేఖరులతో మాట్లాడుతూ నిందితుడు అరెస్టయితే ఈ కేసు వివరాలు అన్నీ బయటపడతాయని తెలిపారు. ఇప్పటివరకు పోలీస్‌లు ఇద్దరు ముగ్గురిని అదుపు లోకి తీసుకుని విచారణ ప్రారంభించారని చెప్పారు. వారు చెప్పిన ఆధారాల ప్రకారం నిందితుడు ఒడిశాలో దాగున్నాడని తెలిసిందన్నారు. మహాలక్ష్మి నివాసం నుంచి రెండు రోజుల పాటు చెడువాసన వస్తుండడంతో ఇరుగుపొరుగు వారు పోలీస్‌లకు సమాచారం అందించారు. దాంతో ఆమె నివాసం లోని ఫ్రిజ్ నుంచి మహాలక్ష్మి మృతదేహం మొత్తం ఏభైకి పైగా ముక్కలుముక్కలుగా బయటపడింది. రిఫ్రిజిరేటర్ ఆన్‌లోనే ఉన్నప్పటికీ మహాలక్ష్మిమృతదేహం పురుగులు పట్టి ఉంది. మహాలక్ష్మి తల్లి, సోదరి తరువాత వచ్చి మృతదేహాన్ని గుర్తించారు. త్రిపుర నుంచి బెంగళూరుకు వచ్చిన మహాలక్ష్మి బెంగళూరు లోని ఓ మాల్‌లో పనిచేసేది. ఐదు నెలలుగా ఆమె ఒంటరిగానే ఉంటోందని , ఇరుగుపొరుగు వారితో కలిసిమెలసి ఉండేది కాదని అక్కడి వారు చెప్పారు. ఆమె సోదరుడు కొన్నాళ్లు ఆమెతో కలిసి ఉండేవాడని చెప్పారు. ఆమెకు పెళ్లయిందని, కుమారుడు కూడా ఉన్నాడని అయితే భర్తతో విడిపోయిందని పోలీస్‌లు చెప్పారు. నిందితుడు వేరే రాష్ట్రానికి చెందిన వ్యక్తి అని, బెంగళూరులో కొన్నాళ్లు ఉండేవాడని పోలీస్‌లు తెలిపారు.

## సియోల్‌లో మూతపడుతున్న ఎయిర్‌పోర్టులు




ఇచియాన్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) : ఉత్తర, దక్షిణ కొరియాల మధ్య బెలూన్ వార్ కొనసాగుతోంది. పొరుగున ఉన్న దక్షిణ కొరియాపై ఉత్తర కొరియా వరుసగా 'చెత్త' దాడికి పాల్పడుతున్న విషయం తెలిసిందే. పెద్దఎత్తున చెత్త, ఇతర విసర్జకాలతో ఉన్న మూటలతో కూడిన బెలూన్లను సరిహద్దు వెంబడి ఎగురవేసి దక్షిణ కొరియా గగనతలంలోకి పంపుతోంది. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకూ పలు మార్లు ఈ బెలూన్లను దక్షిణ కొరియా గగనతలంలోకి వదులుతోంది. ఇప్పటి వరకూ 5,500కిపైగా చెత్త బెలూన్లను ఉత్తర కొరియా వదిలినట్లు అంచనా. అయితే, ఈ బెలూన్ల కారణంగా దక్షిణ కొరియాలో విమాన రాకపోకలపై తీవ్ర ప్రభావం పడుతోంది. రన్ వేలపై బెలూన్లు పడడంతో విమానాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. పలు విమానాశ్రయాలు తరచూ మూతపడుతున్నాయి. ఆ చెత్త బెలూన్ల కారణంగా జూన్ నుంచి దక్షిణ కొరియా రాజధాని సియోల్‌కు చెందిన రెండు విమానాశ్రయాల్లోని రన్‌వేలను మూసివేయాల్సి వచ్చింది. జూన్ 1 నుంచి ఇచియాన్, గింపో ఎయిర్‌పోర్టుల్లో మొత్తం రన్‌వేలను దాదాపు 20 రోజుల్లోనే మూసివేయాల్సి వచ్చిందని దక్షిణ కొరియా అధికారులు తెలిపారు.

ప్రపంచంలోనే అత్యంత బిజీగా ఉండే ఎయిర్ పోర్టులలో ఇచియాన్ విమానాశ్రయం కూడా ఒకటి. అలాంటి ఎయిర్ పోర్టును ఉత్తర కొరియా వదిలిన 'చెత్త' బెలూన్ల కారణంగా జూన్ 1 నుంచి ఇప్పటి వరకు దాదాపు 413 నిమిషాలు (ఆరు గంటలకు పైగా) మూసేయాల్సి వచ్చిందని దక్షిణ కొరియా డెమొక్రటిక్ పార్టీ సభ్యుడు యంగ్ బూ నామ్ పేర్కొన్నారు. సోమవారం కూడా ఈ ఎయిర్ పోర్టును దాదాపు గంటన్నర పాటు (90 నిమిషాలు) మూసివేశారని వివరించారు. ఈ బెలూన్ల కారణంగా ల్యాండింగ్ ఆలస్యం, మార్గం మళ్లింపు భయాలతో విమానాలు అత్యధిక ఇంధనాన్ని తీసుకెళ్లాల్సి వస్తోందన్నారు.

## కమలా హారిస్ ప్రచార కార్యాలయంపై కాల్పులు..

- ఆందోళన కలిగిస్తున్న వరుస దాడి ఘటనలు



వాషింగ్టన్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) : అమెరికాలో అధ్యక్ష ఎన్నికలకు మరో 43 రోజులు మాత్రమే సమయం ఉంది. దీంతో ప్రధాన అభ్యర్థులు డొనాల్డ్ ట్రంప్, కమలా హారిస్ తమ ప్రచార జోరు పెంచారు. అయితే, ఈ ఎన్నికల వేళ అభ్యర్థులపై వరుస దాడులు ఆందోళన కలిగిస్తున్నాయి. డొనాల్డ్ ట్రంప్‌పై ఇప్పటికే రెండు సార్లు దాడి జరగ్గా.. తాజాగా కమలా హారిస్‌ను దుండగులు టార్గెట్ చేశారు. కమలా హారిస్ ప్రచార కార్యాలయంపై తుపాకులతో దాడి చేశారు.

అరిజోనాలోని డెమొక్రటిక్ పార్టీ సమన్వయ ప్రచార కార్యాలయంపై గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి కాల్పులు జరిపారు. అప్రమత్తమైన కార్యాలయంలోని సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన అరిజోనా పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని పరిశీలించారు. ఈ మేరకు ఘటనపై దర్యాప్తు చేపట్టారు. ఈ కాల్పుల ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం సంభవించలేదు.

**ట్రంప్‌పై వరుస కాల్పుల ఘటనలు..**

ఇటీవలే డొనాల్డ్ ట్రంప్‌పై వరుస కాల్పుల ఘటనలు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. తొలుత జూలై 13న పెన్సిల్వేనియాలోని బట్లర్ పట్టణంలో ఎన్నికల ప్రచార సభలో ప్రసంగిస్తుండగా థామస్ మాథ్యూ క్రూక్ అనే వ్యక్తి సమీపంలోని గోడౌన్ మీదినుంచి ఆయనపై కాల్పులు జరిపాడు. దీంతో ఆయన కుడి చెవిని తాకుతూ తూటా దూసుకెళ్లింది. ట్రంప్ రక్తమోడుతూనే అమాంతం డయాస్ కిందకు ఒరిగి తనను తాను కాపాడుకున్నారు. నాటినుంచి ఆయనకు భద్రతను మరింత పెంచారు. ఆ తర్వాత ట్రంప్ ర్యాలీలో మరోసారి భద్రతా వైఫల్యం బయటపడింది. గత నెల 30న పెన్సిల్వేనియాలోని జాన్స్‌టౌన్‌లో జరిగిన ప్రచార ర్యాలీలో ఓ దుండగుడు వేదికవైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించాడు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మద్దతుదారులను ఉద్దేశించి ట్రంప్ స్టేజ్‌పై మాట్లాడుతున్నారు. ఆ సమయంలో ఓ దుండగుడు వేగంగా స్టేజ్ వైపు దూసుకొచ్చాడు. దాదాపు మీడియా పాయింట్ వరకూ వచ్చేశాడు. అప్రమత్తమైన పోలీసులు వెంటనే అతడిని చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు. ఈనెల 15న కూడా ట్రంప్‌పై మరోసారి హత్యాయత్నం జరిగింది. ఫ్లోరిడాలోని వెస్ట్ పామ్ బీచ్‌లో ఉన్న తన గోల్ఫ్ కోర్టులో ట్రంప్ గోల్ఫ్ ఆడుతుండగా ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తుపాకీతో సంచరించాడు. దీంతో సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు అతనిపై కాల్పులు జరిపారు. వెంటనే ట్రంప్‌ను సురక్షిత ప్రాంతానికి తరలించారు. అయితే ఈ కాల్పుల ఘటనలో ట్రంప్ సురక్షితంగా బయటపడ్డారు.

# రసాయనాలతోనే పంటల సాగు

**సాగులో మోతాదుకి మించి రసాయన ఎరువులు**

**సారవంతం కోల్పోతున్న భూములు**

**జిల్లాలో వరిసాగు 3 లక్షల 11 వేల 738 ఎకరాలు**

**మొక్కజొన్న పంటల 44,601 ఎకరాలు**



కామారెడ్డి జిల్లావ్యాప్తంగా రైతులు రోజు రోజుకు రసాయనాలతో కూడిన ఎరువులను ఉపయోగించి పంటలను సాగుచేస్తున్నారు.దీంతో సారవంతమైన భూములను కోల్పోతున్నారు.సాగులో మోతాదుకు మించి రైతులు ఎరువులను వాడుతున్నారు.గత ఏడాది 1.35 లక్షల టన్నుల ఎరువుల వినియోగం కాగా ఈ ఏడాది తగ్గించాలనే ఉద్దేశంతో 1.06 లక్షల టన్నుల సరఫరా చేసేందుకు వ్యవసాయశాఖ ప్రతిపాదనలు రూపొందించింది.కానీ ఇప్పటికే ప్రస్తుత వానకాలం సీజన్ ముగియకముందే 97 వేల టన్నుల రసాయనిక ఎరువుల వినియోగం అయింది.

**కామారెడ్డిబ్యూరో,సెప్టెంబర్25(జనంసాక్షి) :** అధిక దిగుబడుల మీద ఆశతో రసాయన ఎరువులు వినియోగిస్తున్నారు.సేంద్రీయ ఎరువులు అందుబాటులో లేకపోవడంతో రైతులు రసాయనిక ఎరువులను అధికంగా వాడుతున్నారు.అవగాహన రహిత్యంతో మెజార్టీ రైతులు రసాయన ఎరువులను వీపరీతంగా వాడుతున్నారు.దీంతో పంట పోలాలు తుప్పు,చౌవుడు వంటి భూములుగా మారుతున్నాయి.రెండేళ్ల నుంచి జిల్లాలోని భూముల్లో భాస్వార శాతం పెరిగిందని తగ్గించాలని వ్యవసాయశాఖ ప్రయోగాత్మకంగా క్షేత్రలను ఎంపిక చేసి అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టింది.అయిన ఫలితం ఇవ్వలేదు.సాధారణంగా 2.5 శాతానికి మంచి సేంద్రియ కర్భణం ఉండే వాటిని ఆరోగ్యవంతమైన భూములుగా పరిగణిస్తారు.కానీ జిల్లాలోని 60 శాతానికి పైగా పంట భూముల్లో 0.5 శాతం ఉండటం లేదని తేలింది.

**రైతులకు అవగాహన కల్పించాలి**

రసాయనిక ఎరువులకు ప్రత్నాయంగా జీవ శిలింద్రాలను,మిత్ర పురుగులు వాడచ్చునని సేంద్రియ సమ్రగ సస్యరక్షణ అధికారులు చెబుతున్నారు.వీటిని వాడితే పెట్టుబడి వ్యయం తగ్గి దిగుబడులు పెరుగుతాయన్నారు.పంట సాగుకు నెల రోజుల ముందు పోలంలో జీలుగ వంటి విత్తనాలను చల్లి మొక్కలు పెరిగిన తరువాత కలియ దున్నితే నెలసారవంతం అవుతుందన్నారు.పంట ఉత్పత్తి ఫలితాలు మెరుగ్గా ఉంటాయన్నారు.సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచాలని,కస్లర్ సమావేశాలతో పాటు రైతు నేస్తం కార్యాక్రమాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నామని జిల్లా వ్యవసాయధికారి తిరుమల ప్రసాద్ పేర్కొన్నారు.రాష్ట్రంలో ఎరువుల వినియోగం ఎకరంకు 130 కిలోలు ఉంటే కామారెడ్డి జిల్లాలో 180 కిలోల నుంచి 220 కిలోలు వాడుతున్నారన్నారు.పోషకాలు నిష్పత్తి ప్రకారం వాడాల్సినవి నత్రజని,బాస్వారం,పోటాష్, 4:2:1 వాడాల్సి ఉండగా 9:5:2,7:1.5 వాడుతున్నారని దీనిని రైతులు తగ్గించుకోవాలని సూచించారు.

**జిల్లాలో వినియోగిస్తున్న మెట్రిక్ టన్నుల ఎరువుల వివరాలు:**

2019/2020 సంవత్సరంలో యూరియా 65 వేల 312 మెట్రిక్ టన్నుల్లో వాడగా డిఏపీ 5,638,కాంప్లెక్స్ ఎరువులు 40,210, ఇతర ఎరువులు 5,682 మొత్తం లక్షా 16 వేల 842 మెట్రిక్ టన్నుల ఎరువులు వాడారు.అలాగే 2020/2021లో యూరియా 72,420,డిఏపీ 3,715,కాంప్లెక్స్ ఎరువులు 40,709,ఇతర ఎరువులు 8,744 మొత్తం లక్షా 28 వేల 588 మెట్రిక్ టన్నుల ఎరువులు వాడారు.2021/2022 సంవత్సరంలో యూరియా 70,250 మెట్రిక్ టన్నులు,డీఏపీ 8,700,కాంప్లెక్స్ ఎరువులు 46,324,ఇతర ఎరువులు 6,596 మొత్తం లక్షా 31,870 మెట్రిక్ టన్నుల ఎరువులు వాడారు.2022/2023 సంవత్సరంలో యూరియా 81,852,డిఏపీ 8,600, కాంప్లెక్స్ ఎరువులు 40,926,ఇతర ఎరువులు 3,923, మొత్తం లక్షా 35 వేల 302 మెట్రిక్ టన్నులు వాడారు.2023/2024 సంవత్సరంలో వానాకాలం సీజన్‌లోనే యూరియా 50,908 మెట్రిక్ టన్నులు,డిఏపీ 13,143,కాంప్లెక్స్ ఎరువులు 33,250,ఇతర ఎరువులు 8,696 మొత్తం లక్షా 6 వేల 27 మెట్రిక్ టన్నుల ఎరువులను వాడారు.జిల్లా వ్యాప్తంగా రైతులు ప్రతి ఏటా రసాయనిక ఎరువుల వాడకం రైతులు పెంచుకొని పంటలు సాగు చేస్తున్నారు.ఇప్పటికైన రైతులు అవగాహన చేసుకొని రసాయన ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులు వాడితే పంటల దిగుబడి పెరుగుతుందన్నారు.అలాగే వ్యవసాయ భూములు సారవంతంగా ఉంటాయన్నారు.

# ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

**హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**



**వీణవంక సెప్టెంబర్ 25(జనం సాక్షి) :** వీణవంక తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు.ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి రుణమాఫీ.రైతు భరోసా ఉచిత విద్యుత్తు వంటి కీలక అంశాల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటతో కట్టుబడి ఉండాలని అన్నారు. బుధవారం వీణవంక మండలంలోని దేశాయిపల్లి గ్రామంలోని ఎంపీపీ మూసిపట్ల రేణుక తిరుపతి రెడ్డి. నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలను కాంగ్రెస్ పార్టీ అమలు చేయకపోతే ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి పెరుగుతుందని అన్నారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ లాంటి హామీలను నెరవేర్చాలన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో 24 గంటలు విద్యుత్ కోతలు లేకుండా విద్యుత్తు అందించారు.ఇప్పుడు ఎందుకు ఇవ్వడం లేదని అన్నారు. మహిళల సంక్షేమం గృహలక్ష్మి పథకం, కళ్యాణ్ లక్ష్మి వంటి హామీలు మిగిలిపోయాయని, దళితులకు చెప్పిన దళితబంధు పథకం కూడా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించే వరకు నేను పోరాడుతానని అన్నారు.అనంతరం వీణవంక మండలంలోని ఆయా గ్రామాలలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను 42 మంది లబ్ధిదారులకు వారి ఇంటి వద్దనే సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించారు.

**పరమార్శ..**

కోర్కల్ గ్రామ మాజీ సర్పంచ్ మర్రి స్వామి తల్లి మృతి చెందగా వారి కుటుంబానికి హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి.పరమార్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి వెంట నాయకులు మూసిపట్ల తిరుపతి రెడ్డి, మాడ సాధవ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ విజయ భాస్కర్ రెడ్డి, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు పోతుల నరసయ్య, మోరే సారయ్య, మాజీ ఎంపీటీసీ నాగిడి సంజీవ రెడ్డి, బొబ్బల సమ్మిరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ చెక్క బండి శ్రీనివాస్ రెడ్డి, మధుసూదన్ రెడ్డితో పాటు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# మైనింగ్ ఎక్స్‌పోలో, డిప్యూటీ సీఎం, సీఎండీ

**(ప్రత్యేక ప్రతినిధి / జనంసాక్షి) :** నాలుగేండ్లకోసారి జరిగే ప్రపంచ మైనింగ్ ఎక్స్‌పోలో డిప్యూటీ సీఎం విక్రమార్కతో పాటు సింగరేణి సీఎండీ ఎన్. బలరాం పాల్గొంటున్నారు. అమెరికా లోని లాస్ వెగాస్‌లో జరుగుతున్న ప్రపంచంలోనే అతిపెద్ద మైనింగ్ ప్రదర్శనను సందర్శించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సింగరేణి సిఎండీ ఎన్ .బలరాం, ఐఆర్ఎస్, ఇతర అధికారుల బృందం లాస్ వెగాస్ కన్వెన్షన్ సెంటర్‌లో సెప్టెంబర్ 24-26, 2024 వరకు ఈ ఈవెంట్ తాజా మైనింగ్ ఆవిష్కరణలు, సాంకేతికతలు, యంత్రాలను ప్రదర్శించగా అందులో పాల్గొన్నారు. పరిశ్రమల నిపుణులతో నెట్‌వర్క్‌కు అవకాశాలను ఈ ప్రదర్శన అందిస్తుంది. ఇందులో 125 దేశాల నుంచి 44,000 కంటే ఎక్కువ మంది నిపుణులు హాజరయ్యారు. ప్రపంచంలోని అతిపెద్ద మైనింగ్ పరికరాల తయారీదారుల సమ్మేళనం అయిన లాస్ వెగాస్‌లోని మైనింగ్ ఎక్స్పో వద్ద సెప్టెంబరు 24న మంగళవారం ఉపముఖ్యమంత్రి సింగరేణి సిఎండీ ఎన్. బలరాం నాయక్ ఐఆర్ఎస్, పలు కంపెనీల ప్రతినిధులతో భేటీ అయ్యారు. ఇక్కడ నుంచి వీళ్ళు జపాన్ వెళ్లి, ఇండియాకు అక్టోబర్ 2న తిరిగి రానున్నారు.

## ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా పారమిత విద్యార్థుల ర్యాలీ



**కరీంనగర్ బ్యూరో (జనంసాక్షి) :** స్థానిక పద్మ నగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు తెలంగాణ చౌక్‌వద్ద సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా సుమారు 50 మంది విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్‌తో పర్యావరణానికి కలిగే హాని గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు విద్యార్థులు తెలుగు, హిందీ, ఆంగ్ల భాషల్లో నినాదాలు చేశారు. ప్లాస్టిక్ వల్ల పర్యావరణం ఎలా ప్రభావితమవుతుందో పోస్టర్లు, బ్యానర్లు ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ప్రదర్శింపబడిన మైమ్ (ముఖాభినయం) అందరినీ ఆకట్టుకుంది. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, మన భవిష్యత్తు తరాల కోసం ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని సృష్టించేందుకు మనమందరం కలిసి పని చేయాలని విద్యాసంస్థల చైర్మన్ డా. ఇ.ప్రసాద్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా. ఇ.ప్రసాద్ రావు, డైరెక్టర్లు ప్రసూన, రష్మిత, అనూకర్ రావు, రాకేశ్, వి.యు.యం. ప్రసాద్, రమణ, వినోద్ రావు, హన్మంతరావు, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ, కోఆర్డినేటర్లు నాగరాజు, రాము పాల్గొన్నారు.

# రోడ్డును ఆక్రమించిన టెలాలు, పందిళ్ల తొలగింపు

**ఆలయ ఈవో టి.వినోద్ రెడ్డి**



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** తెలంగాణలోనే అతి పెద్ద శైవ క్షేత్రమైన వేములవాడ శ్రీ రాజ రాజేశ్వరస్వామి ఆలయ విచారణ కార్యాలయం నుండి నందీశ్వర కాంప్లెక్స్ వరకు, లక్ష్మీ గణపతి కాంప్లెక్స్, శివపురం,శంకరపురం ఉన్న 40 ఫీట్ల రోడ్డులో ఇరుపక్కల రహదారిని ఆక్రమించి తోపుడు బండ్లు,టేలాలు, ఆలయ సముదాయంలో లీజుకు తీసుకున్న దుకాణదారులు రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ప్రతి నిత్యము వేలాదిమంది భక్తులు స్వామివారి దర్శనానికి వస్తున్న క్రమంలో వాహనదారులకు పాదాచారులు పలు ఇబ్బందులు గురవుతున్నారు.తరచూ ఈ ప్రాంతంలో భక్తుల వాహనాలతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. చిన్నపాటి వర్షం కురిసిన వర్షపు నీరు మురికి కాలువలోకి వెళ్లకుండా రోడ్డుపైనే పారుతుంది ప్రతి ఒక్కరు మురికి కాలువను శుభ్రం చేయకుండా సిమెంటు ఫ్లోరింగ్ చేయడంతో పాటు తోపుడు బండ్లు,టెలాలు ఉండడంతో ఆలయ శానిటేషన్ విభాగం మురికి కాలువల శుభ్రం చేసేందుకు పలు ఇబ్బందులు పడుతుంటారు.డ్రైనేజీ నీరు రోడ్డుపై ప్రవహిస్తుందన్న భక్తుల ఫిర్యాదుపై ఆలయ ఈఓ వినోద్ రెడ్డి బుధవారం ఆలయ ఇంజనీరింగ్, పరిపాలన, సానిటేషన్,ధర్మశాలల అధికారులతో కలిసి ఆయా ప్రదేశాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ డ్రైనేజీ పైకప్పుపై శివపురం, శంకరపురం దుకాణాల సముదాయ లిజ్ దారులు మురికి కాలువలు తీయకుండా పూర్తి స్థాయిలో ఫ్లోరింగ్ చేసుకోవడంతో పాటు, టేలాలు, తోపుడు బండ్లు మురికి కాలువల పైనే పెట్టడంతో ధర్మశాలల్లో నుండి వచ్చే నీరు సజావుగా వెళ్లకుండా,దుర్గంధం వ్యాపిస్తుందన్నారు.సానిటేషన్ కార్మికులు మురికి కాలువలు తీయడానికి ఇబ్బందికరంగా మారాయన్నారు. వర్షాలు కురిసిన సమయంలో మురికి కాలువలోకి నీరు వెళ్లకపోవడంతో నీరు రోడ్డుపై ప్రవహించడంతో భక్తులు ఇబ్బందులు స్వామివారి దర్శనానికి ఎంతో భక్తి శ్రద్ధలతో వచ్చే భక్తులు మురుగునీరు నుండే నడుచుకుంటూ ఆలయానికి రావడం వల్ల ఆలయ అధికారులను ప్రశ్నింస్తున్నారన్నారు. శివపురం,శంకరపురం దుకాణదారులు తమ దుకాణం నుండి సుమారు 8 పిల్ల నుండి పది పిట్ల రేకులు వేయడం రోడ్డు ఆక్రమణతో భక్తుల వాహనాలతో తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందన్నారు.ఫుట్ ఫాత్ పై టేలాలు, తోపుడు బండ్లు పెట్టుకున్న వారికి వివరించగా వారు సానుకూలంగా స్పందించి స్వచ్ఛందంగా టేలాలు, తోపుడు బండ్లు తొలగిస్తున్నట్లు అయన తెలిపారు. తోపుడు బండ్లు, టేలాలు తొలగింపు సమయంలో నష్టపోయే వారు దేవాలయ షాపుల లీజుల వేలంలో పాల్గొనవచ్చుని, రాజన్న దర్శనానికి వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రతి ఒక్కరు సహకరించాలని ఇది అందరి బాధ్యతన్నారు.ఆయన వెంట ఆలయ పరిపాలన ఏఈఓ శ్రావణ్ కుమార్, ఈఈ రాజేష్, శానిటేషన్ సూపరిండెంట్ వరి నర్సయ్య, ఏఈ రామ్ కిషన్ రావు ఆలయ అధికారులు, ఎస్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.





# సీజనల్ వ్యాధుల బారిన పడిన రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

**జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్**



**రాయికల్ సెప్టెంబర్25(జనం సాక్షి):** ప్రభుత్వ ఆసుపత్రిలో పెషేంట్లకు మెరిగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అన్నారు.బుధవారం రోజున రాయికల్ మండలంలో వడ్డె లింగాపూర్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ ఓపి. సేవలు, ఐపీ సేవలు ,రికార్డ్స్ ల్యాబ్ రికార్డ్స్, ఐపీ, రికార్డ్స్ మెడికల్ ఫార్మసి కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రిలో వైద్య సేవలను మెరుగు పరచాలని, రోజుకు ఎన్ని ఓ.పి.లను చూస్తున్నారు, ఆసుపత్రిలో పేషెంట్లకు శుభ్రమైన త్రాగునీరు అందిస్తున్నారా అని తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ మరియు ఇతర వ్యాధుల ప్రబలుతున్న నేపథ్యంలో వ్యాధుల పట్ల అప్రమత్తమై పేషెంట్లకు ఇబ్బంది కలుగకుండా వైద్య సేవలు కల్పించాలని సూచించారు. అనంతరం ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి చుట్టుపక్కల ఉన్న పిచ్చి మొక్కలను తీసేయించాలని, ఆసుపత్రి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి శానిటేషన్ చేయించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట జగిత్యాల ఆర్‌డిఓ మధుసుధన్, డిప్యూటీ డిఎంహెచ్ఓ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, ఎమ్మార్వో అబ్దుల్ ఖయ్యాం,ఎంపీడీవో బి.చిరంజీవి,ఎంపీవో సుష్మ, ఆస్పత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ కమిషనరేట్‌లో తెలంగాణ స్టేట్ పోలీస్ డ్యూటీ మీట్

**చట్టాల అమలు, అంతర్గత భద్రత, నేరాలను శాస్త్రీయంగా గుర్తించాలి**

**దర్యాప్తు చేయడం, శాస్త్రీయ సహాయాలతో సామర్థ్యాలను మెరుగుపరచుకోవచ్చు : సిపి ఎం.శ్రీనివాస్**



**గోదావరిఖని (జనంసాక్షి) :** డిజిపి ఆదేశాల మేరకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి మంచిర్యాల్ జోన్ పరిధిలో ఉన్న పోలీస్ అధికారులకు, సిబ్బందికి రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో పోలీస్ డ్యూటీ మీట్ నిర్వహించడం జరిగింది. రామగుండం పోలీస్ కమిషనర్ సిఎం శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించడం జరిగింది. సిపి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మొదటిసారిగా తెలంగాణ స్టేట్ పోలీస్ డ్యూటీ నిర్వహించడం జరుగుతుందని బుదవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల పెద్దపల్లి జోన్ అధికారులకు, సిబ్బందికి సైంటిఫిక్ అయిడ్స్ టూ ఇన్వెస్టిగేషన్ ఈవెంట్‌లి లో ఫోరెన్సిక్ సైన్స్, క్రైమ్ ఇన్వెస్టిగేషన్, క్రిమినల్ లా, వ్రాత పరీక్ష, మెడికో లీగల్ టెస్ట్ ఓరల్ టెస్ట్ లిఫ్టింగ్ అండ్ ప్యాకింగ్ ఆఫ్ ఎక్స్ బిట్స్ ప్రాక్టికల్ టెస్ట్, ఫింగర్ ప్రింట్ సైన్స్ ప్రాక్టికల్ అండ్ ఓరల్ టెస్ట్, క్రైమ్ సీన్ ఫోటోగ్రఫీ ప్రాక్టికల్, పోలీస్ పోర్ట్రైట్ ప్రాక్టికల్ అండ్ రిటన్ టెస్ట్, అబ్జర్వేషన్ టెస్ట్ ప్రాక్టికల్ అండ్ రిటన్ టెస్ట్ ,యాంటి సబాటేజ్ చెక్ ఈవెంట్ లో వెహికల్ సెర్చ్, గ్రౌండ్ సర్చ్, రూమ్ సెర్చ్, యాక్సిస్ కంట్రోల్, కంప్యూటర్ అవేర్నెస్ కాంపిటీషన్ ఈవెంట్‌లో కంప్యూటర్ అవేర్నెస్ ఆఫీస్ ఆటోమేషన్, ప్రోగ్రామింగ్ ఎబిలిటీ, డాగ్ స్క్వాడ్ కాంపిటీషన్‌లి ఈవెంట్‌లో ట్రాకింగ్, ఎక్స్ప్లోజివ్, నార్కోటిక్స్, సెర్చ్ ,పోలీస్ ఫోటోగ్రఫీ కాంపిటీషన్, పోలీస్ వీడియోగ్రఫీ కాంపిటీషన్ ఈవెంట్స్ నిర్వహించడం జరుగుతుంది. ఇందులో ప్రతిభ కనబరిచిన వారు అక్టోబర్ 4వ రోజు రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించే కాళేశ్వరం జోన్ స్థాయి పోలీస్ డ్యూటీకి ఎంపిక కావడం జరుగుతుందని ఆరోజు ఎంపిక బడినవారు రాష్ట్ర స్థాయిలో నిర్వహించే డ్యూటీ మీట్ కీ ఎంపిక చేయడం జరుగుతుంది అన్నారు. పరిశోధన, పోలీస్ ఫోటోగ్రఫీ, కంప్యూటర్ అవేర్‌నెస్, స్పెషల్ కెనైన్ యూనిట్ పోటీలు, విధ్వంస నిరోధక తనిఖీలు, పోలీస్ వీడియోగ్రఫీకి శాస్త్రీయ సహాయాలు, పోలీసు డ్యూటీ మీట్ చట్టాన్ని అమలు చేసే సిబ్బందికి వారి సామర్థ్యాలను మెరుగుపరచడానికి వేదికగా పనిచేస్తుంది అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అధికారులు సిబ్బంది జోన్ స్థాయిలో , రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి రామగుండం కమిషనర్‌కు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్)సి.రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసిపి రాఘవేంద్రరావు గోదావరిఖని ఏసిపి, (సిసిఎస్)ఏసిపి వెంకటస్వామి, టాస్క్ ఫోర్స్ ఏసిపి మల్లారెడ్డి, ఏ ఆర్ ఏసీపీలు ప్రతాప్, సురేంద్ర, ఆర్ఐలు దామోదర్, వామనమూర్తి, సంపత్ మల్లేశం, శ్రీనివాస్, కమీషనరేట్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బంది, బీడి టీం, డాగ్స్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

# కేటీఆర్‌ను విమర్శించే నైతిక హక్కు మాక్కాన్ సింగ్ లేదు

- పదేళ్ల కేసీఆర్ పాలన సింగరేణిలో స్వర్గయుగం..
- సింగరేణి కార్మికులకు నికర లాభంలో 33 శాతం చేల్లించాలి
- రామగుండం మాజీ శాసనసభ్యులు, జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు చందర్



**గోదావరిఖని (జనంసాక్షి) :** సింగరేణి కార్మికులకు సంస్థ నికర లాభంలో 33 శాతం చెల్లిస్తామని డిప్యూటీ సిఎం బట్టి విక్రమార్క ప్రకటించించిన విధంగా కార్మికులకు చెల్లించాలని కేటీఆర్ మాట్లాడితే వారిపై మాక్కాన్ సింగ్ చేసిన విమర్శలను ఖండిస్తూన్నమని కేటీఆర్ ను విమర్శించే స్థాయి గాని నైతిల హక్కు మాక్కాన్ సింగ్ కు లేదని అన్నారు. బుధవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో ఎర్పాటు చేసిన విలేఖరుల సమావేశం ఆయన మాట్లాడారు. నందమూరి బాలకృష్ణ ను మరిపించే విధంగా తట్ట చెమ్మస్ తోని కార్మికుల డ్రెస్ తో అసెంబ్లీ లోకి వెళ్లిన మాక్కాన్ సింగ్ సింగరేణి కార్మికుల పట్ల గాని వారి సంక్షేమం కోసం పట్టింపులేదన్నారు. చంద్రబాబు నాయుడు హాయంలో సింగరేణి లో వారసత్వ ఉద్యోగాలను తీసేస్తే వాటి కొనసాగింపు కాంగ్రెస్ పార్టీ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.ఆర్ చేశారన్నారు. పదేళ్ల కేసీఆర్ గారి పాలన సింగరేణి కి సర్ణయుగమని సంక్షేమంతో పాటు సింగరేణి లో విప్లవాత్మకమైనమార్పులు తీసుకు రావడం ద్వారా సింగరేణి అద్భుతమైన ప్రగతి సాధించిందన్నారు. సింగరేణి లాభాలు గణనీయంగా పెరగడంతో వాటికి అనుగుణంగా కార్మికులు లాభాల వాట పెంచుతూ కార్మిక పక్షపాతిగా కేసీఆర్ నిలిచారన్నారు. కేసీఆర్ వారసత్వ ఉద్యోగాలను పునరుద్ధరించారని 19 వేల మంది సింగరేణి కార్మికుల వారసులకు ఉద్యోగ అవకాశాలను కల్పించిన ఘనత వారకే దక్కుతుందన్నారు. సింగరేణి కార్మికుల తల్లిదండ్రులు వైద్యసదుపాయంతో పాటు ఇళ్ల నిర్మాణానికి కార్మికులకు 10 లక్షల రుణాలు అందిచారన్నారు. ఇక్కడ ఎమ్మెల్యేకు కార్మిక ఉద్యమాలు అంటే తెలియదని ఏ కార్మిక ఉద్యమంలో పాల్గొన్న చరిత్ర లేదన్నారు. స్వయంగా కాంగ్రెస్ పార్టీ డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క మీడియా సమావేశంలో సింగరేణి నికర లాభాన్ని ప్రకటించారని వారు ప్రకటించిన విధంగా సింగరేణి కార్మికులకు 33 శాతం లాభాలను చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. సింగరేణిలో వచ్చిన లాభాలను కార్మికులకు చెల్లించకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కార్మికులను మోసం చేస్తుందని విమర్శించారు. ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించిన లాభాల వాటాపై కార్మికులు చీదరించుకుంటున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు.లాభాల వాట 33 శాతం చేల్లించాలని ధర్నాలు చేస్తున్న టిబిజికఏస్ నాయకులపై కేసులు పేడుతున్నరన్నారు. ఎన్ని కేసులు పెట్టినా బెదిరేది లేదని తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం లో వందలాది కేసులను ఎద్కోకోని జైలు కు వేళ్లిన చరిత్ర తమదన్నారు. సింగరేణి కార్మికులకు 33 శాతం లాభాల వాట ప్రభుత్వం చేల్లించాలని డిమాండ్ చేసారు. విలేకరుల సమావేశం లో కార్పోరేటర్లు పాముకుంట్ల భాస్కర్, అయుత శివకుమార్ , కల్వచర్ల కృష్ణ వేణీ, బాదె అంజలి దేవి, గాధం విజయ, నాయకులు నడిపెల్లి మురళీధర్ రావు, మేతుకు దేవరాజ్, నూతి తిరుపతి, చల్లగురుల మొగిళి, బోడ్డుపల్లి శ్రీనివాస్, ఆడప శ్రీనివాస్, జహిద్ పాషా, పీచర శ్రీనివాస్, ఇంజపురి నవీన్ , కోల సంతోష్ గౌడ్, రాజేషం, యసర్ల తిమ్మెతి, కౌటం బాబు, జడ్పన్ ,జిట్టవేని ప్రశాంత్, కుమార్, సందెల మల్లయ్య, ధర్మాజీ కృష్ణ ,ముద్దాసాని సంధ్యా రెడ్డి, సట్టు శ్రీనివాస్, ఇరుగురాల్ల శ్రావన్ ,చింటూ, వడ్లూరి రాములు,స్వప్న, ఆవునూరి వెంకటేష్ , కర్రి ఓదేలు , లక్ష్మి , రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

# దుమ్మురేపిన యశస్వి జైస్వాల్



ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో టీమిండియా యువ ఓపెనర్ యశ్వసి జైస్వాల్ దుమ్మురేపాడు. ఒక స్థానాన్ని మెరుగు పరుచుకొని ఐదో స్థానంలో నిలిచాడు. భారత్ తరఫున టాప్ ర్యాంక్ కలిగిన బ్యాటర్‌గా నిలిచాడు. బంగ్లాదేశ్‌తో చెన్నై వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో యశస్వి జైస్వాల్ హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. ఈ ప్రదర్శనతోనే ఒక స్థానాన్ని మెరుగుపరుచుకొని టాప్ 5 ర్యాంక్ అందుకున్నాడు. మరోవైపు బంగ్లాదేశ్‌తో తొలి టెస్ట్‌లో దారుణంగా విఫలమైన టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, కెప్టెన్ రోహిత్ శర్మ ఐదేసి స్థానాలు దిగజారారు. రోహిత్ 10వ స్థానంలో నిలవగా.. కోహ్లీ 12వ స్థానంలో నిలిచాడు.
ఈ మ్యాచ్‌లో శతకంతో రాణించిన రిషభ్ పంత్ తన ఆరో ర్యాంక్‌ను నిలబెట్టుకోగా.. శుభ్‌మన్ గిల్ 5 స్థానాలు మెరుగు పరుచుకొని 14వ స్థానంలో నిలిచాడు. న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. డారిల్ మిచెల్ రెండో స్థానంలో నిలిచాడు. ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ ఐదో స్థానంలో నిలవగా.. ఉస్మాన్ ఖవాజా ఏడో స్థానంలో నిలిచాడు.
పాకిస్థాన్ స్టార్ బ్యాటర్ మహమ్మద్ రిజ్వాన్, ఆసీస్ స్టార్ మార్నస్ లబుషేన్ 8,9వ స్థానాల్లో కొనసాగుతున్నారు.
పాకిస్థాన్ మాజీ కెప్టెన్ బాబర్ ఆజామ్ 11వ స్థానంలో నిలిచాడు. బౌలింగ్ విభాగంలో అశ్విన్, జస్ప్రీత్ బుమ్రా తమ టాప్ ర్యాంకులను నిలబెట్టుకోగా.. జడేజా ఒక స్థానాన్ని మెరుగు పరుచుకొని 6వ స్థానానికి చేరాడు.
బంగ్లాతో తొలి టెస్ట్‌లో అశ్విన్ 6 వికెట్లతో పాటు బ్యాటింగ్‌లో శతకం సాధించాడు. బుమ్రా.. తొలి ఇన్నింగ్స్‌లో 4, రెండో ఇన్నింగ్స్‌లో ఓ వికెట్‌తో మొత్తం ఐదు వికెట్లు పడగొట్టాడు. ఈ ప్రదర్శన వారి ర్యాంకులు చెదరకుండా చేసింది. తొలి టెస్ట్ ఆడని కుల్దీప్ యాదవ్ ఒక స్థానం కోల్పోయి 16వ స్థానంలో నిలిచాడు.
ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్ తమ టాప్2 ర్యాంకులను నిలబెట్టుకున్నారు. అక్షర్ పటేల్ 6వ స్థానంలో కొనసాగుతుండగా.. బంగ్లాదేశ్ ప్లేయర్ షకీబ్ అల్ హసన్ తన రెండో ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు.

టీమిండియా స్టార్ వికెట్ కీపర్, బ్యాటర్ రిషబ్ పంత్ టెస్టుల్లోకి రీ ఎంట్రీ ఇచ్చిన అదరగొడుతున్నాడు. అద్భుత బ్యాటింగ్ ప్రదర్శనతో ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో దూసుకెళ్లిన ఈ వికెట్ కీపర్ ఆరో స్థానానికి చేరుకున్నారు. అదే సమయంలో సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ర్యాంకులు దిగజారాయి.

# రంజీ ప్రాబబుల్స్‌లో కోహ్లీ, పంత్



న్యూఢిల్లీ: మేటి బ్యాటర్ విరాట్ కోహ్లీ, మరో బ్యాటర్ రిషబ్ పంత్.. ఇద్దరు మళ్లీ రంజీ జట్టు ప్రాబబుల్స్‌లో ఉన్నారు. ఢిల్లీ జట్టు తరఫున రిలీజైన 84 మంది జాబితాలో ఆ ఇద్దరు బ్యాటర్ల పేర్లు కూడా ఉన్నాయి. నిజానికి రంజీ సీజన్‌లో ఇద్దరూ అందుబాటులో లేకున్నా.. ఆ ఇద్దర్నీ మాత్రం ఢిల్లీ రంజీ జట్టు ప్రాబబుల్స్‌లో చోటు కల్పించారు. ఇశాంత్ శర్మకు ఆ లిస్టులో చోటు దక్కలేదు. మయాంక్ యాదవ్ ఆ ప్రాబబుల్స్ బృందంలో ఉన్నాడు. విరాట్ కోహ్లీ చివరిసారి 2012లో రంజీ ట్రోఫీ ఆడాడు. ఘజియాబాద్‌లో అతను యూపీ జట్టుతో తలపడ్డాడు. పంత్ కూడా చివరిసారి కోవిడ్‌కు ముందు రంజీల్లో ఆడాడు. ప్రోటోకాల్ ప్రకారం లిస్టును తయారు చేశామని, ఒకవేళ వాళ్లు కావాలంటే రంజీల్లో ఆడుకోవచ్చు అని ప్రాబబుల్స్ లో పేర్లు పెట్టినట్లు డీడీసీఏ అధికారి తెలిపారు.

# హ్యారీ బ్రూక్స్ సెంచరీ..

## ఆసీస్‌పై 46 రన్స్ తేడాతో విక్టరీ



చెస్టర్ లీ స్ట్రీట్: ఆస్ట్రేలియాతో జరిగిన మూడవ వన్డేలో ఇంగ్లండ్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం 46 రన్స్ తేడాతో విజయం సాధించింది. దీంతో అయిదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆస్ట్రేలియా ఆధిక్యాన్ని 2-1కి తగ్గించింది ఇంగ్లండ్. మూడవ వన్డేలో ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా నిర్ణీత ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 304 రన్స్ చేసింది. ఆసీస్ ఇన్నింగ్స్‌లో స్టీవ్ స్మిత్ 60, గ్రీన్ 42, అలెక్స్ క్యారీ 77, మ్యాక్స్‌వెల్ 30, హార్డీ 44 రన్స్ చేశారు. ఆ తర్వాత భారీ టార్గెట్‌తో బరిలోకి దిగిన ఇంగ్లండ్ ఓ దశలో 11 పరుగులకే రెండు వికెట్లను కోల్పోయింది. అయితే ఆ సమయంలో క్రీజ్‌లోకి దిగిన ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ .. సూపర్ ఇన్నింగ్స్ ఆడాడు. 94 బంతుల్లోనే సెంచరీ కొట్టాడు. అతని ఇన్నింగ్స్‌లో 13 ఫోర్లు, రెండు సిక్సర్లు ఉన్నాయి. అయితే వర్షం కారణంగా ఆట నిలిచిపోయింది. కానీ అప్పటికే డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం ఇంగ్లండ్ విక్టరీ ఖాయమైంది. 37.4 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 254 రన్స్ చేసిన ఇంగ్లండ్.. 46 రన్స్ తేడాతో విజయం సాధించింది. బ్రూక్స్ 110 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఇంగ్లండ్ బ్యాటర్లలో విల్ జాక్స్ 84, లివింగ్‌స్టోన్ 33 రన్స్ చేశారు.

# కప్‌తో తిరిగొస్తాం

## ఆస్ట్రేలియాకు దబిడి దిబిడే!: హర్మన్‌ప్రీత్



టీ20 వరల్డ్ కప్‌తో స్వదేశానికి తిరిగొస్తామని భారత మహిళల జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ పేర్కొంది. అక్టోబర్ 3 నుంచి యూఏఈ వేదికగా మహిళల టీ20 ప్రపంచకప్ జరనున్న విషయం తెలిసిందే. పొట్టి కప్ మిషన్ కోసం మన అమ్మాయిలు ఇవాళ బయలుదేరారు.అయితే ఈ నేపథ్యంలో మీడియా సమావేశంలో పాల్గొన్న హర్మన్‌ప్రీత్ కీలక వ్యాఖ్యలు చేసింది. గత పొరపాట్లను సరిదిద్దుకొని విజేతగా తిరిగొస్తామని హర్మన్‌ప్రీత్ తెలిపింది. మెగాటోర్నీ కోసం కఠోర సాధన చేశామని, ఫీల్డింగ్, ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పింది. అత్యుత్తమ జట్టుతో టీ20 కప్ వేటకు వెళు_న్నామని పేర్కొంది. గతంలో సెమీస్‌లో ఓడిపోయామని, గత టోర్నీల కంటే ఈసారి మరింత మెరుగ్గా సన్నద్ధమయ్యామని వెల్లడించింది. ఏ జట్టును అయినా ఓడించగలమని, ఈ విషయం ఆస్ట్రేలియాకు కూడా తెలుసని హర్మన్‌ప్రీత్ తెలిపింది. మహిళల టీ20 ప్రపంచకప్‌లలో భారత్ ఒక్కసారి మాత్రమే ఫైనల్‌కు చేరింది. 2020 మెగాటోర్నీలో టైటిల్ పోరుకు చేరుకున్నప్పటికీ కప్‌ను అందుకోలేకపోయింది. ఆస్ట్రేలియా చేతిలో ఓటమిపాలైంది. కాగా, గత జులైలో ఆసియా కప్‌లో రన్నరప్‌గా నిలిచిన తర్వాత భారత జట్టు తిరిగి మైదానంలో అడుగుపెట్టలేదు. అయితే బెంగళూరులోని ఎన్‌సీఏలో సుదీర్ఘ సన్నాహక శిబిరంలో పాల్గొంది. కాగా, అక్టోబర్ 3 నుంచి 20 వరకు మహిళల టీ20 వరల్డ్ కప్ జరగనుంది. అయితే అంతకుముందు నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఈ మెగాటోర్నీ బంగ్లాదేశ్ వేదికగా జరగాల్సి ఉంది.కానీ అక్కడ నెలకొన్న రాజకీయ సంక్షోభం నేపథ్యంలో పొట్టి కప్‌ను యూఏఈ వేదికగా నిర్వహిస్తున్నారు. ఈ ప్రపంచకప్‌లో మొత్తం పది జట్లు పాల్గొంటున్నాయి. అయిదు జట్లు రెండు గ్రూప్‌లు విడిపోయి సెమీఫైనల్స్ బెర్తు కోసం పడనున్నాయి.

ప్రతిష్ఠాత్మక టీ20 ప్రపంచకప్‌లో సత్తాచాటుతామని భారత మహిళల కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్ ధీమా వ్యక్తం చేసింది. వచ్చే నెల 3వ తేదీ నుంచి యూఏఈ వేదికగా మొదలవుతున్న మెగాటోర్నీ కోసం మంగళవారం టీమ్‌ఇండియా బయల్దేరి వెళ్లింది.

మెగాటోర్నీలో భాగంగా భారత్ తమ తొలి మ్యాచ్‌లో అక్టోబర్ 4న న్యూజిలాండ్‌తో తలపడనుంది. 2009లో మొదలైన ఈ మెగాటోర్నీలో భారత్ ఇప్పటి వరకు ఒక్కసారే(2020) ఫైనల్ చేరుకోగా, గతేడాది సెమీఫైనల్లోనే నిష్క్రమించింది. ఏండ్లుగా అందకుండా పోతున్న పొట్టి కప్‌ను ఈసారి ఒడిసిపట్టుకునేందుకు భారత్ తహతహలాడుతున్నది.

గ్రూప్-ఏలో భారత్‌తో పాటు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, పాకిస్థాన్, శ్రీలంక ఉన్నాయి. మరోవైపు గ్రూప్-బీలో సౌతాఫ్రికా, ఇంగ్లండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్, స్కాట్లాండ్ ఉన్నాయి. అక్టోబర్ 4 నుంచి భారత్ మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. న్యూజిలాండ్‌తో తొలి మ్యాచ్ ఉంది. అక్టోబర్ 6న చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో టీమిండియా అమీతుమి తేల్చుకోనుంది. అలాగే అక్టోబర్ 9న శ్రీలంక, అక్టోబర్ 13న ఆస్ట్రేలియాతో తలపడనుంది. అక్టోబర్ 17, 18న సెమీఫైనల్స్, అక్టోబర్ 20న ఫైనల్ జరగనుంది.

# ఇషాన్ కిషన్ రీఎంట్రీ



యువ వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ తిరిగి భారత జట్టులో చోటు దక్కించుకోనున్నాడు. బంగ్లాదేశ్‌తో జరగనున్న టీ20 సిరీస్‌కు ఇషాన్ ఎంపిక కానున్నాడని తెలుస్తోంది. టీమిండియా తరఫున 26 ఏళ్ల ఈ ఎడమచేతి వాటం బ్యాటర్ చివరిగా గతేడాది నవంబర్‌లో ప్రాతినిథ్యం వహించాడు. ఆ తర్వాత దక్షిణాఫ్రికా పర్యటనకు ఎంపికయ్యాడు. కానీ మానసిక ఒత్తిడి కారణంగా భారత్‌కు తిరిగొచ్చాడు. అనంతరం దేశవాళీ క్రికెట్ ఆడాలని బీసీసీఐ సూచించినప్పటికి ఇషాన్ కిషన్ ఆసక్తి చూపలేదు. నేరుగా ఐపీఎల్‌తోనే పోటీ క్రికెట్ లో రీఎంట్రీ ఇచ్చాడు. మరోవైపు ఇషాన్ కిషన్‌పై బీసీసీఐ వేటు వేసింది. సెంట్రల్ కాంట్రాక్ట్‌ను రద్దు చేసింది. ఆ తర్వాత దేశవాళీ క్రికెట్‌లో ఆడుతున్న ఇషాన్ నిలకడగా పరుగులు సాధిస్తున్నాడు. ఇటీవల జరిగిన దులీప్ ట్రోఫీలో సత్తాచాటాడు. శతకంతో చెలరేగాడు.
అయితే ఇషాన్ కిషన్‌ను తిరిగి జట్టులోకి తీసుకురావాలని టీమిండియా కోచ్ గౌతమ్ గంభీర్ భావిస్తున్నాడని తెలుస్తోంది. బంగ్లాదేశ్ టీ20 సిరీస్‌కు రిషభ్ పంత్‌కు విశ్రాంతిని ఇచ్చి, అతని స్థానంలో ఇషాన్‌ను తీసుకోనున్నారని సమాచారం. ఓపెనర్‌గానే కాకుండా మిడిలార్డర్ బ్యాటర్‌గానూ ఇషాన్ సత్తాచాటగలడు. బంగ్లాదేశ్ టీ20 సిరీస్‌కు ఇషాన్ కిషన్, సంజు శాంసన్‌లు వికెట్ కీపర్లుగా ఎంపిక కానున్నారని తెలుస్తోంది.
బంగ్లాదేశ్‌తో టీ20 సిరీస్ అనంతరం భారత్.. న్యూజిలాండ్‌తో మూడు టెస్టులు, ఆస్ట్రేలియాతో అయిదు టెస్టుల సిరీస్ ఆడనుంది. ఈ నేపథ్యంలో పంత్‌పై పనిభారం పడకుండా విశ్రాంతి ఇవ్వాలని భావిస్తూ, ఇషాన్ కిషన్‌కు ఛాన్స్ ఇస్తున్నారని తెలుస్తోంది. కాగా, అక్టోబర్ 6 నుంచి బంగ్లాదేశ్‌తో టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. గ్వాలియర్ వేదికగా తొలి మ్యాచ్ జరగనుంది. అక్టోబర్ 9న ఢిల్లీ వేదికగా రెండో టీ20, అక్టోబర్ 12న హైదరాబాద్ వేదికగా ఆఖరి టీ20 జరగనుంది.

# పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలి

- ఘనంగా పండిత్ దీన్ దయాళ్ 108వ జయంతి వేడుకలు
- మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు



అల్వాల్, సెప్టెంబర్ 25 (జనం సాక్షి)
అంత్యోదయ, ఏకాత్మ మానవతావాదానికి మార్గదర్శకులు అయినా పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ, గ్రేటర్ హైదరాబాద్ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు పిలుపునిచ్చారు. అల్వాల్ సర్కిల్ మచ్చబొల్లారం డివిజన్ 393, 394 బూత్ పరిధిలో ఆయన పర్యటించారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వారోత్సవాలు సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ భారతీయ జన సంఘ్ మొదలుకుని భారతీయ జనతాపార్టీ ఆవిర్భావం వరకు సిద్ధాంత కర్తగా ప్రతి ఒక్కరికీ మార్గనిర్దేశనం చేసిన పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ యొక్క మార్గదర్శనంలో మనమందరం సాగాలని అన్నారు. అనంతరం ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. వికసిత్ భారత్ కోసం ప్రతి ఒక్కరూ 8800002024 నంబర్ కు మిస్డ్ కాల్ చేసి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ముఖ్యనాయకులు ఉదయ ప్రకాష్, రాజిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అజయ్ రెడ్డి, మాచర్ల శ్రీనివాస్, రామ్మోహన్ గౌడ్, రాఘవేంద్ర చారి, రమాకాంత్, సునీల్, లక్ష్మీకాంత శర్మ, కరుణశ్రీ, అనురాధ, కవిత, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న... ఆశీర్వదించండి

- చట్టసభలో నిరుద్యోగుల సమస్యలపై పోరాడుతా
- వాకర్స్‌తో ఆల్ఫోర్స్ అధినేత, ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ వి. నరేందర్ రెడ్డి



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :**
గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఉద్యోగులు, నిరుద్యోగులు, ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యల సాధనకు చట్టసభలో వారి పక్షాన పోరాటం చేస్తానని కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల నియోజక వర్గం ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీ, కేడీఆర్ (కటారి దేవేందర్ రావు పార్కు) లో వాకార్స్ ను కలిసి రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో తనకు మద్దతు తెలిపాలని కోరారు. అనంతరం ఎల్ఐసి ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... ఉద్యోగం రాక, జాబ్ క్యాలెండర్ ప్రకారం నోటిఫికేషన్లు లేక నిరుద్యోగులు ప్రభుత్వంపై నమ్మకం కోల్పోయారని అన్నారు. ఉద్యోగాల ఖాళీల భర్తీకి, డీఏ, ఇంక్రిమెంట్ల సాధనకు, ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేసే వారికి ఆరోగ్యకార్డులు, ఫీజు రియంబర్స్మెంట్ సకాలంలో అందించేలా కృషి చేస్తానన్నారు. నూతన విద్యా పాలసీ తీసుకొస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, దీనివల్ల ఇంటర్, పదో తరగతి బోర్డులు ఉంటాయా? లేదా? అనే సందే హాలు కలుగుతున్నాయని అన్నారు. దీనిపై ప్రభుత్వంతో చర్చించేందుకు, సమస్యల పరి ష్కారానికి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీగా గెలిచాక సేవకుడిగా ఉంటానని, తన వేతనాన్ని పేదల విద్యాభ్యాసం, నిరుద్యోగ సంక్షేమనిధి ఏర్పాటు చేసి కేటాయిస్తానని తెలిపారు. ప్రస్తుతం పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పీవీఎన్ఆర్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ హనుమండ్ల రఘుపతిరెడ్డి, జనరల్ సెక్రటరి కొండ రవీందర్, వైస్ ప్రెసిడెంట్లు కర్ర సత్యనారాయణ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, పాలోజు రవీందర్, గౌరవ సలహాదారులు పిట్టల నర్సయ్య, చక్రధరస్వామి, శ్యాంసుందర్ రెడ్డి, బుస్సా శ్రీనివాస్, చంద్రశేఖర్ రెడ్డి, అనిల్, విజయ్, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డిమాండ్ ఉన్న పంటలు సాగు చేయాలి

**ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్**



**రాయికల్, సెప్టెంబర్ 25 ( జనం సాక్షి):**
రాయికల్ మండల అల్లీపూర్ గ్రామంలో అల్లిపూర్ అనుబంధ గ్రామాల రైతు మిత్ర ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ సభ్యుల సమావేశం రైతు వేదికలో పాల్గొని వారిని ఉద్దేశించి ప్రసంగించారు.రైతులు నూతన పద్ధతులు,కొత్త తరహా పంటలు పండిచాలని,డిమాండ్ ఉన్న పంటల సాగు వైపు రైతులు ఆలోచన చేయాలని అదేవిధంగా అల్లిపూర్ రైతు మిత్ర ఫార్మార్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ వారి అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.రైతు మిత్ర ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ వారికి కొనుగోలు కేంద్రం కేటాయింపు విషయంలో జిల్లా కలెక్టర్,విప్ ఆడ్లూరి దృష్టికి తీసుకెళ్తానని అన్నారు.రుణ మాఫీ విషయంలో రైతులు ఆందోళన అవసరం లేదని, రైతులను రుణ విముక్తి చేయటం ప్రభుత్వ ధ్యేయం అని అన్నారు
స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా ప్రతినిధి గుణ శేకర్ మాట్లాడుతూ రైతులు తమ వ్యవసాయ క్షేత్రంలో సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకొని ఉత్పత్తి అయిన కరెంట్ ను ప్రభుత్వానికి గానీ ఇతరులకు గాని విక్రయించడం ద్వారా అదనపు ఆదాయం సమకూర్చుకోవచ్చునని తెలిపారు.
డా.డి.ఏ. రజినిదేవి, ఆర్థిక శాస్త్రవేత్త పంటల మార్కెటింగ్., ఎఫ్‌పిఓల మార్కెటింగ్‌లో గల అవకాశాల గురించి వివరించారు. బి. శ్రీలక్ష్మి, టీఓ , జీకేఎంస్ టూ ఆర్ ఏ స్ నుండి పంపించు వాతావరణ బుల్ ట్ ను పంపిస్తూ యాజమన్య పద్ధతులుల గురించి వివరించారు. జిల్లా వ్యవసాయధికారి వాణి మాట్లాడుతూ రైతులు వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా వ్యవసాయంగ మార్పులు చేయడం ద్వారా నష్టాన్ని తగ్గించవచ్చని తెలిపారు. రాయికల్ మండల వ్యవసాయ అధికారి ముక్తేశ్వర్ మాట్లాడుతూ రైతుల ప్రస్తుత వాతావరణ పరిస్థితలలో వరిపంటను ఆశిస్తున్న ఎండు తెగులు మరియు బ్యాక్టిరియా నివారణ చర్యల గురించి వివరించారు.
అనంతరం రైతుల తో కలిసి పంటపొలాల క్షేత్రాన్ని సందర్శించారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు అత్తినేని శంకర్, డైరెక్టర్లు బొజ్జ దేవేందర్ రావు, అత్తినేని రాజం, ఓరుగంటి రాజలింగం, తిరుమల శంకర్, కొండపలుకుల రత్నాకర్ రావు, ఎంబారి వెంకటేష్, పుప్పాల రాజిరెడ్డి,మేక్కొండ రాంరెడ్డి, సీఈఓ కొల్లూరి రాకేష్,కోర్డినేటర్ అనిల్ , మండల నాయకులు కోల శ్రీనివాస్, ఆయా గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# చిట్టచివరి వ్యక్తికి ప్రభుత్వ పథకాలు అందటమే అంత్యోదయ సిద్ధాంతం

- కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనం సాక్షి) :**
గ్రామీణ అభివృద్ధి స్వావలంబన దేశ ఆర్థిక వ్యవస్థకు మూలమని చాటిచెప్పిన వ్యక్తి పండిట్ శ్రీ దీన్ దయాళ్ ఉపాధ్యాయుడని ఆ మహనీయుడు చూపిన మార్గంలోనే ప్రస్తుత బీజేపీ ముందుకు నడుస్తుందని,కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి అన్నారు.బీజేపీ మూల సిద్ధాంత కర్త, దేశం కోసం పరితపించిన జాతీయవాది, భారతీయ సంస్కృతిని గౌరవించి, దేశం కోసం త్యాగంచేసే దిశగా యువతను ప్రోత్సహించిన మహోన్నత శక్తి శ్రీ పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆ మహనీయుని చిత్ర పటానికి బుధవారం నివాళులు అర్పించడం జరిగింది.ఈ సందర్భంగా కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి మాట్లాడుతూ ఏకాత్మ మానవతావాదాన్ని ప్రవచించి అంత్యోదయ విధానాన్ని రూపొందించి చిట్ట చివరి వ్యక్తికి ప్రభుత్వ పథకాలు అందటమే లక్ష్యంగా ప్రభుత్వాలు పని చేయాలనీ సూచించారని,గ్రామీణ అభివృద్ధి స్వావలంబన దేశ ఆర్థిక వ్యవస్థకు మూలమని చాటిచెప్పిన వ్యక్తి , ప్రపంచంలో అతిపెద్ద పార్టీగా అవతరించిన బిజెపికి పటిష్ఠ పునాదులు వేసిన పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఆ మహనీయుడికి శతకోటి వందనాలని అన్నారు.వారు చూపిన మార్గంలోనే నేడు ప్రధాని నరేంద్ర మోది నాయకత్వములో బీజేపీ ముందుకు సాగుతుందని, ఏ ప్రభుత్వ పథకం అయినా మధ్యవర్తి లేకుండా నేరుగా లబ్దిదారుల ఖాతాకు చేరేలా డిజిటల్ విధానాన్ని అవలంభిస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు నరేందర్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు విపుల్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శ్రీకాంత్, పట్టణ అధ్యక్షుడు భరత్, కౌన్సిలర్ లు శ్రీనివాస్, నరేందర్, నాయకులు రవీందర్, రజినీకాంత్, వేణు, సంతోష్ రెడ్డి, వెంకట్ రెడ్డి, రాజగోపాల్, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

# పోషణ మాసం ఆరోగ్య రక్షణ

## ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఇన్చార్జి తులసి






**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 25(జనం సాక్షి) :** మండలం ఉప్పరిగూడ రైతు వేదికలో బుధవారం ఇబ్రహీంపట్నం ఐసీడీస్ ప్రాజెక్ట్ ఇంచార్జి తులసి ఆధ్వర్యంలో "పోషణ మాసం" కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా సంక్షేమ అధికారిణి పద్మజారమణ, ఇబ్రహీంపట్నం సిహెచ్‌సి డాక్టర్ సరిత, జిల్లా డిజబుల్డ్ రిహేబ్ సెంటర్ డాక్టర్ సుస్మిత, హాజరై పద్మజా రమణ మాట్లాడుతూ, ప్రతి ఒక్క పిల్లవాడు ఆరోగ్యకరంగా ఉంటూ విద్యను అభ్యసించాలి, పిల్లలు ఆరోగ్యకరంగా ఉన్నప్పుడే వారి మెదడు చురుకుగా పని చేస్తుందన్నారు. అలాగే కిశోర బాలికలకు రక్తహీనత సమస్య కు గురికాకుండా, వారికి కౌన్సిలింగ్ ఇవ్వాలని తెలిపారు.అనంతరం డాక్టర్ సరిత మాట్లాడుతూ, ప్రతి మహిళ్ళమొదట తన ఆరోగ్యం గురించి పట్టించుకోవాలన్నారు. గృహిణి ఆరోగ్యంగా ఉంటేనే సమాజం బాగుంటుంది పోషకాహారం ఆరోగ్యవంతమైన జీవనానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. గర్భంలోని శిశువు ఎదుగుదల నుంచి శిశువు జన్మించే వరకు.. ఆ తరువాత పెరుగుతున్న పిల్లలకు తగినంత పోషకాహారం అందిస్తే ఎంతో మేలు చేకూరుతుంది.ప్రతి అంగన్వాడి సెంటర్లో ఎత్తుకు తగ్గ బరువు - స్యామ్,మ్యామ్ "పిల్లలకు ఆర్ బి ఎస్ కే ద్వారా హెల్త్ స్క్రీనింగ్ నిర్వహిస్తున్నారు. వారికి మందులతో పాటు బాలామృతం'ం' కూడా ఇవ్వడం జరుగుతుంది. అనంతరం అంగన్వాడి టీచర్లు చిన్న నాటకం ద్వారా " గుడ్ టచ్,- బ్యాడ్ టచ్ " గురించి ఎలా నేర్పించాలి అనేది చూపించారు.పరిసరాలలో మరియు ఇంట్లో ఉండే వస్తువులతో ఆరోగ్యకరమైన వంటలు ఎలా చేస్తూ,చేయాలో ఫుడ్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్స్, అరుణ, సరళ, కల్పన, పల్లవి, డిస్టిక్ కోఆర్డినేటర్స్, అంగన్వాడి టీచర్స్ పాల్గొన్నారు.

# పూర్తిస్థాయికి సాగర్ జలాశయం

- పర్యాటకులతో నిత్యం సందడి
- ఆయకట్టు రైతుల్లో ఆనందం



**నాగార్జునసాగర్, సెప్టెంబర్25 (జనంసాక్షి) :** నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా ప్రాజెక్టు నిండుకుండలా దర్శనమిస్తోంది. చాలాకాలం తరవాత మళ్లీ జలకళ సంతరించడంతో పర్యాటకుల రాక పెరిగింది. పూర్తిస్థాయి నీటిమట్టం చేరుకోవడంతో జలకళ సంతరించుకుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులలు కాగా 587 అడుగుల వద్ద నిలకడగా ఉండేలా చూస్తున్నారు. దీంతో నిండుకుండను తలపిస్తోంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు దాదాపు పూర్తిస్థాయిలో నిండడంతో తిలకించేం దుకు పర్యాటకులు పోటెత్తు తున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు, ఉద్యోగులు, విదేశీయులు నందికొండకు తరలిరావడంతో లాంచీ స్టేషన్, బుద్ధవనం, నాగార్జునకొండ పరిసర ప్రాంతాలు పర్యాటకులతో కిటకిట లాడాయి. చాలా మంది పర్యాటకులు నాగార్జునకొండకు వెళ్లేందుకు ఆసక్తి కనబర్చగా అందుకు అనుగుణంగా తెలంగాణ టూరిజంశాఖ లాంచీలను నడిపించింది. నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరుకోవడం, ఉభయ రాష్ట్రాల తెలుగు ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది. కృష్ణా పరివాహక ప్రాజెక్టులు అన్ని నిండుకుండలా మారి జలకళను సంతరించుకున్నాయి. నాగార్జునసాగర్ రిజర్వాయర్ గరిష్ట స్థాయికి చేరినందున ఆయకట్టు రైతులకు రెండు పంటలకు నీరందించే అవకాశం ఉంది. సాగర్ నిండడంతో రిజర్వాయర్ పరిధిలో మత్స్యకార్మిక కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. రిజర్వాయర్‌లోకి సమృద్ధిగా వచ్చి చేరిన కృష్ణమ్మ చూసి సంబుర పడుతున్నారు. సాగర్ లోతట్టు ప్రాంతాల్లో ఇతర ప్రాంతాల నుంచి వలసవచ్చి ఇక్కడ స్థిర నివాసం ఏర్పర్చుకున్న గంగపుత్రులతో పాటు, చేపల వృత్తే జీవనాధారంగా మత్స్యకారులు ఉత్సాహంగా చేపల వేటకు ఉపక్రమిస్తున్నారు. ఇరవైకి పైగా మర బోట్లు, పుట్టీలు ఉండగా వాటిల్లో చేపల వేటకు వెళ్తారు. కుటుంబ సభ్యులంతా ఇదే వృత్తిపై ఆధారపడి నిత్యం రూ.వేలల్లో ఆదాయం పొందుతారు. వేటాడిన చేపలు కేరళ, కోల్‌కత్తా తదితర ప్రాంతాలకు ఎగుమతి అవుతాయి. లోతట్టు ప్రాంతం వెంట జీవనం సాగిస్తున్న గిరిజనం సైతం చాలావరకు చేపల వేటను వృత్తిగా చేసుకుని బతుకుదెరువును సాగిస్తున్నది. ప్రభుత్వం వీరికి కూడా లైసెన్స్‌లు జారీచేసి ప్రభుత్వం పరంగా చేయూతనిస్తోంది. సాగర్ నిండటంతో గిరిజనులకు సైతం ఉపాధి మెండుగా కలుగుతున్నది. కృష్ణా నదిలో మత్స్యకారులు ఏడాదిలో 300 రోజులపాటు చేపల వేటను కొనసాగిస్తారు. గతకొంతకాలం చేపలవేటకు దూరమైన మత్స్యకారులు రిజర్వాయర్‌లోకి భారీగా వచ్చిన నీటితో తిరిగి చేపల వేటకు సన్నద్ధం అవుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం గతేడాది రిజర్వాయర్‌లోకి భారీగా చేప పిల్లలను వదలడం.. అవి పెరిగి పెద్దవ్వడంతో వలలో పడ్డ ఒక్కో చేప 20కిలోల వరకు ఉండి పుష్కలంగా ఆదాయం వస్తుందని వారు చెబుతున్నారు.

## పాఠశాల విద్యాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం మరింత దృష్టి పెట్టాలి

- మండలానికి ఎంఈఓ కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు
- తక్షణమే ఖాళీగా ఉన్న డీఈవో పోస్టులను కూడా భర్తీ చేయాలి : యూఎస్ఎఫ్ఐ

**హైదరాబాద్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షనీయదగిందని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు తాటికొండ రవి, మాదం తిరుపతి అన్నారు. రాష్ట్రంలో డీఈవో పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయని వాటిని భర్తీ చేసి పాఠశాల విద్య మరింత అభివృద్ధి చెందే విధంగా ప్రతి పేద విద్యార్థికి విద్య అందే విధంగా కృషి చేసే బాధ్యత చేసినప్పుడే ప్రతి పేద విద్యార్థులకు విద్య అన్నారు. పాఠశాల విద్యలో అనేక సమస్యలు ఉన్నాయని విద్యార్థులకు కనీసం మౌలిక సదుపాయాలు లేక సరిపడా టీచర్స్ లేక పాఠశాలలు శు భ్రం లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రాష్ట్రంలో పాఠశాలల అభివృద్ధి కోసం పర్యవేక్షణ అత్యంత అవసరమని పర్యవేక్షణలేకపోవడం వల్ల ప్రభుత్వ విద్యా రోజురోజుకు దూరమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 609 మండలాల్లో ఎంఈఓలను ఇన్చార్జిలుగా నియమిస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను యుఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ స్వాగతిస్తుందని తెలిపారు. తక్షణమే డిఇఓ లను కూడా నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను కూడా తక్షణమే భర్తీ చేసే విధంగా చర్యలు వేగవంతం చేయాలని డీఎస్సీ లో ఉన్న అవకతవకలను పర్యవేక్షించి తక్షణమే న్యాయం చేసేలా ప్రభుత్వం కృషి చేయాలని అన్నారు. విద్యార్థులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వమైనా నిలబడిన చరిత్ర లేదని ఇప్పటికైనా పాఠశాలలా సమస్యల పరిష్కారానికి మరింత చొరవ చూపాలని కోరుతున్నాం.లేనిపక్షంలో భవిష్యత్తులో ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

## లోతట్టు ప్రాంతాలపై దృష్టి పెట్టండి

- వరదనీరు నిలువకుండా చర్యలు తీసుకోండి
- వర్షాలపై అధికారులను అప్రమత్తం చేసిన కమిషనర్



**హైదరాబాద్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** వర్షాలతో లోతట్టు ప్రాంతాల్లో వరద నిలువకుండా చర్యలు చేపట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. అడిషనల్, జోనల్ కమిషనర్లు, వివిధ విభాగాల హెచ్‌వోడీలతో ఆమె టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాల సమయంలో నీరు నిలిచే చోట శాశ్వత పరిష్కారం చూపాలని, ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అవసరమైన ప్రతిపాదనలు తయారు చేసి నివేదిక అందజేయాలని సూచించారు. విద్యుత్ కనెక్షన్ కమర్షియల్‌గా ఉండి, రెసిడెన్షియల్ ట్యాక్స్ చెల్లిస్తున్న యజమానులకు నోటీసులు జారీచేసి ట్యాక్స్ రివిజన్ చేపట్టాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వారికి పెద్ద మొత్తంలో జరిమానాలు విధించాలని ఆదేశించారు. మరో సమీక్షలో నగరంలో కీటక జనిత వ్యాధులు ప్రబలకుండా నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కమిషనర్ సూచించారు. వైద్యారోగ్యశాఖ సమన్వయంతో చర్యలు తీసుకోవాలని.. యాంటీ లార్వల్, ఫాగింగ్ విస్తృతం చేయాలని పేర్కొన్నారు. వర్షాల నేపథ్యంలో కమిషనర్ ఆమ్రపాలి ఎల్బీనగర్ జోన్‌లోని పలు ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించారు. శానిటేషన్ నిర్వహణ, రోడ్లపై పాట్‌హోల్స్ తదితర వాటిని పరిశీలించారు. సరూర్‌నగర్ నుంచి ఎల్బీనగర్, నాగోల్ రోడ్ మీదుగా ఉప్పల్ భగాయత్, ఉప్పల్ స్టేడియం రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించి రోడ్డు మరమ్మతులు, శానిటేషన్‌పై తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.

## ఆర్థిక సంక్షోభంతో మహిళలపై హింస

- ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్






**హైదరాబాద్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** దేశ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడ్డప్పటికీ మానవ సమాజం అభివృద్ధి కాలేదని, ఆర్థిక సంక్షోభం కారణంగా మహిళలపై హింస పెరుగుతోందని ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్ అన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో చైతన్య మహిళా సంఘం 29వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సాంకేతికాభివృద్ధిలో మహిళలపై పెరుగుతున్న హింస అన్న అంశంపై శ్రీదేవి అధ్యక్షతన బుధవారం సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా ఆంధ్రజ్యోతి సంపాదకులు శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ ఆర్థిక సంక్షోభం వల్ల ఉద్యోగుల్లో, నిరుద్యోగుల్లో నిరాశ, నిస్పృహలున్నాయని, ఆర్థిక సంక్షోభంతో సులువుగా డబ్బులు లభ్యమయ్యే విధానాలు పెరుగుతున్నాయని, ఇవి రకరకాల రూపాల్లో మహిళలపై హింసను పెంచుతున్నాయని అన్నారు. ఉదారంగా వరకట్నం అడగటం దగ్గర నుంచి స్త్రీలను తక్కువ వేతనాలను పనికి ఉపయోగించే పరిస్థితులు పెరుగుతున్నాయని, మహిళలపై హింస పెరగడానికి పెరిగిన ఆర్థిక అవసరాలే కారణమని అన్నారు. స్త్రీలు వివిధ రంగాల్లో పని చేయడానికి ఆసక్తిగా ఉంటే మరోవైపు పరుషులు పితృస్వామ్య భావజాలం నుంచి బయటపడకపోవడం వైరుధ్యంగా మారిందన్నారు. ఈ దశలో మహిళా సంఘాలు స్త్రీలలోనే కాదు పురుషుల్లోనూ చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం శ్రీదేవి మాట్లాడుతూ 1995లో ఏర్పడిన చైతన్య మహిళా సంఘం పితృస్వామ్యానికి వ్యతిరేకంగా నిరంతరం మహిళలను చైతన్య పరుస్తూ ఉద్యమాల్లో క్రియాశీలకంగా పని చేస్తోందన్నారు. పీవోడబ్ల్యూ రాష్ట్ర క్యాదర్శి స్వరూప మాట్లాడుతూ మహిళల్ని ఇంటికే పరిమితం చేయడం, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో క్షణం తీరిక లేకుండా ఉండటం వల్ల వారు ఉద్యమాలకు దూరమవుతున్నారని అన్నారు. పీవోడబ్ల్యూ అధ్యక్షురాలు అనసూయ మాట్లాడుతూ సామాజిక ఉద్యమాల్లో భాగంగా స్త్రీల ఉద్యమాలుంటాయన్నారు. అనంతరం పీవోడబ్ల్యూలో జాతీయ అధ్యక్షురాలు సంధ్య మాట్లాడారు.

## ఎస్సీ, ఎస్టీ కేసులో నలుగురికి ఆరు నెలల జైలు

- రూ.4వేల జరిమానా విధించిన ప్రత్యేక న్యాయమూర్తి

(ప్రత్యేక ప్రతినిధి / జనం సాక్షి)

జన్నారం పోలీస్ స్టేషన్ పరిధిలో తేదీ :16-05-2020 రోజున తమ బంధువును తీసుకెళ్లాడని కోపంతో ఎస్సీ మాల కులానికి చెందిన బాట్ల అన్వేష్ (17), నేరస్తులకు గారిపెల్లి హరీష్ కుమార్ గౌడ్, ముత్యం సాయి, పట్కూట్ ప్రశాంత్, మహమ్మద్ అజ్మత్ ఖాన్ అనే నలుగురి చేతులు, బెల్టు, కర్రలతో కొట్టి గాయపరిచి కులం పేరుతో దూషించి చంపుతానని బెదిరించి మూత్రం తాగించి హింసించినందున ఆయన దరఖాస్తు మేరకు అప్పటి జన్నారం ఎస్సై ఎం వినోద్ కుమార్ కేసు నమోదు చేయగా జి.నరేందర్ ఏసిపి జైపూర్, మంచిర్యాల సబ్ డివిజన్ ఇంచార్జ్ దర్యాప్తు చేసి పైన నలుగురిపై సెక్షన్ 323, 324, 290,506,రెడ్ విత్ 34ఐపీసీ , సెక్షన్ 3(1)(ఎస్ ) 3(2)(విఎ )ఎస్సీ /ఎస్టీ చట్టంలో దర్యాప్తు నివేదిక కోర్టులో దాఖలు చేశారు. మంచిర్యాల కోర్టు లైజన్ అధికారి సయ్యద్ తాజా ద్దీన్, సిడిఓ ఇఫ్తేకార్ అహ్మద్, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముస్కు రమణా రెడ్డిలు 17 మంది సాక్షులను విచారించి నేరం రుజువు చేయగా ప్రత్యేక న్యాయమూర్తి డాక్టర్ పి. శివరాం ప్రసాద్ నలుగురి నేరస్తులకు ఒక్కొక్కరికి ఆరు నెలల జైలు శిక్ష, మరియు రూ, 4,000/- వేల జరిమానా విధిం చారు. నిందితులకు శిక్ష విధించ డంలో కృషిచేసిన జన్నారం ఎస్సై జి రాజవర్ధన్, సిఐ లక్షట్ పేట్ ఏ నరేందర్ లను కోర్టు విధుల అధికారులను రామగుం డం పోలీస్ కమిషనర్ ఏం శ్రీనివాస్ ఐపిఎస్ ఐజి గారు, మంచిర్యాల డిసిపి ఏ భాస్కర్, మంచిర్యాల్ ఎసిపి ఆర్ ప్రకాష్లు అభినందించారు.

## ఇందిరా మహిళాశక్తితో ఆర్థిక ప్రగతి

- ఇందిరా మహిళా శక్తి యూనిట్లు ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** ఇందిరా మహిళా శక్తి పథకంతో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం వేములవాడలో బ్యూటి పార్లల్, వేములవాడ అర్బన్ మండలం రుద్రవరంలో ఓపెన్ జిమ్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా అంబేద్కర్ స్వయం స్వసక్తి సంఘం వారి ఆద్వర్యంలో డైరీ పార్లర్, శ్రీ లక్ష్మీ స్వయం స్వసక్తి సంఘం వారి ఆద్వర్యంలో లేడీస్ ఎంపోరియంను అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ మహిళలను పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, వారికి కావాల్సిన ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని కోటి మంది మహిళను కోటీశ్వరులుగా చేసే లక్ష్యంతో ముందుకు పోతున్నారని, ప్రతి ఏటా రూ 20 వేల కోట్లు వెచ్చించి బ్యాంకు ద్వారా వారి జీవన ఉపాధిని పెంపొందించే కార్యక్రమాన్ని చేపడుతు మహిళా సాధికారికత లక్ష్యంగా ముందుకు పోతున్నారన్నారు. గతంలో మహిళలను లక్ష అధికారులు చేయడం లక్ష్యంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి మహిళలకు పావలా వడ్డీ రుణాలు మంజూరు చేశారని, తదుపరి కిరణ్ కుమార్ రెడ్డి వడ్డీలేని రుణాలను మంజూరు చేశారని ఆయన గుర్తు చేశారు. ప్రజా ప్రభుత్వంలో మహిళా అభివృద్ధి లక్ష్యంగా ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో ముందుకు పోతుందన్నారు. జిల్లాలో సుమారు 9985 మహిళా సంఘాలలోని 109000 మంది సభ్యులు ఉన్న వారిలో ఎవరైతే ఉపాధి పరిశ్రమలు పెట్టుకోవడానికి ముందుకు వస్తున్నారో రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో 600 కోట్లుతో వారికి బ్యాంకు రుణాలు ఇప్పిస్తున్నామన్నారు. 7079 మందికి యూనిట్లకు ప్రస్తుతం 3030 మందికి నిధులు మంజూరు అయ్యాయన్నారు. మహిళలకు ఉపాధి కోసం 125 రకాల ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామని, మహిళా సంఘాల ద్వారా ఉపాధి అవకాశాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. సిఎం రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రాన్ని గంజాయి రహిత రాష్ట్రంగా మార్చడానికి కృషి చేస్తున్నారని అందులో భాగంగా యువతకు ఉపయోగపడే ఓపెన్ జిమ్ కు భూమి పూజ నిర్వహిస్తామన్నారు. ముంపు గ్రామాల సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తానని, మహిళా తల్లులు ఇందిరా మహిళా శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ డైరీ చైర్మన్ రాజేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ అర్బన్ మండల అధ్యక్షుడు పిల్లి కనకయ్య, రుద్రావరం సొసైటీ చైర్మన్ కృష్ణదేవరావు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పెన్‌గంగ ఇసుక తోడేస్తున్నారు


- యధేచ్ఛగా ట్రాక్టర్లలో తరలింపు
- దాడులకు చలించని అక్రమార్కులు



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** ఇసుక రవాణాను అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరించడంతో అక్రమ వ్యాపారులు జోరుగా ఇసుక తరలిస్తూ నిల్వ చేసుకుంటున్నారు. కాంగ్రెస్ అధికారంలకి వచ్చినా దందా మాత్రం ఆగడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇసుకకు ప్రస్తుతం డిమాండ్ పెరగడంతో వ్యాపారు లకు కాసులు కురిపిస్తున్నాయి. గ్రామాలలోని ప్రతి ఒక్కరూ ట్రాక్టర్‌ను కొనుగోలు చేసి ఇసుక దందాను ఎంచుకుంటున్నారు. ఎటువంటి డబ్బులు చెల్లించకుండా ఇసుకను తోడుకుని అమ్ముకోవడంతో వ్యాపారు లకు కాసుల వర్షం కురుస్తుంది. ప్రస్తుతం వరదనీరు గంగలోకి రావడంతో ఇసుక తీసే వీలులేక ప్రస్తుతం తాంసి(కె) నుంచి పిప్పల్‌కోటి మీదుగా కప్పర్ల, బండల్‌నాగాపూర్, పొచ్చేర, లేకపోతే సావర్గాం, జంధాపూర్ గ్రామాల మీదుగా జిల్లా కేంద్రానికి ఇసుకను తరలిస్తున్నారు. తాంసి(కె) వద్ద గంగాలోని ఇసుక బాగుండడంతో భారీ రేటు కూడా పలుకడంతో ట్రాక్టర్ల యాజమానులు, వ్యాపారులు పెన్‌గంగ నది నుంచి ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. రోజుకు ట్రాక్టర్ ద్వారా ఒక్కో ట్రాక్టర్ ద్వారా రెండు ట్రిప్పుల ఇసుకను తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ ట్రింపు ఇసుకను రూ.3 నుంచి నాలుగు వేలకు విక్రయిస్తున్నారు. ఇలా నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పెన్‌గంగ నుంచి ఇసుకను నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేస్తే కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నా ఫలితం కానరావడం లేదు. గ్రామాలలో స్థానికంగా ఉన్న చిన్నచిన్న అవసరాల మేరకు ఇసుకను వాడుకునేందుకు ఇచ్చిన అవకాశాన్ని దర్వినియోగం చేస్తూ కాంట్రాక్టర్‌లకు, ఇతర అవసరాలకు ఇసుకను రవాణా చేస్తూ కాసులు సంపాదించుకుంటున్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలి. సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడంతో ఇసుకు పెన్‌గంగా నది నుంచి యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఇసుక తరలిస్తూ ట్రాక్టర్‌లు పట్టుబడితే నామమాత్రంగా జరిమానా విధిస్తూ చూసిచూడనట్లు వ్యవహరించడంతో ఇసుక వ్యాపారులు తమ పంథాను మార్చుకోకుండా ఇసుకను తరలిస్తున్నారు. పెన్‌గంగా నదీతీరం నుంచి గంగాపై భాగంలో ఇసుకను రవాణా చేసే వ్యాపారులు ఇసుక డంప్పులను ఏర్పాటు చేసి ఇసుకను నిల్వ చేసుకుంటున్నారు. పెన్‌గంగా నది నుంచి నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్‌లలో ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు ఇసుక కొరతను సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. వర్షాకాలం పెన్‌గంగా నదిలోకి వరదనీరు చేరితే ఇసుక తీసే అవకాశం ఉండదు.. ప్రస్తుతం గంగలో నుంచి కూలీల ద్వారా ఇసుకను తీసుకువచ్చి గంగనది తీరంలో మైదాన ప్రాంతంలో డంప్పులను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఇసుక వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇసుకను అక్రమంగా తరలిస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు ఆ వైపుగా చూడకపోవడంతో అక్రమార్కులు యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ పెన్‌గంగాను తోడేయం మానడం లేదు. రోజుకు 50 ట్రాక్టర్ ట్రిప్పులను తరలిస్తున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పెన్‌గంగా నదిలో నుంచి నిత్యం పదుల సంఖ్యల్లో ట్రాక్టర్‌లలో ఇసుకను తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ఇష్టానుసారంగా ఇసుకను తోడేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాలోని వివిధ గ్రామాలకు ట్రాక్టర్‌లలో పరిమితికి మించి ఇసుకను తరలిస్తున్నారు.

## కాంగ్రెస్ అంటేనే ప్రజాపాలన

- విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సహకారం అందిస్తా
- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 25, (జనంసాక్షి) :** కాంగ్రెస్ అంటేనే ప్రజా పాలన అని పెద్దపెల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. బుధవారం బెల్లంపల్లి పట్టణంలో నూతనంగా 7.58 కోట్ల రూపాయలతో నిర్మించిన కూరగాయల మార్కెట్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలు పాలించి రాష్ట్రాన్ని 7 లక్షల కోట్ల అప్పుల పాలు చేసిందని, రాష్ట్ర ఆర్థికంగా ఇబ్బంది పడడానికి కారణం అని అన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్నికల క్యాంపనింగ్ లో భాగంగా వచ్చినప్పుడు కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయాలని తెలపడం జరిగిందని, 7.58 కోట్ల రూపాయలతో కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. బెల్లంపల్లి నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడానికి తన ఎంపీ నిధుల నుండి నిధులు మంజూరు చేయడానికి సహకరిస్తానని, విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కూడా సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

అనంతరం ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ బెల్లంపల్లిలో పరివర్తన మొదలైందన్నారు. బెల్లంపల్లి పట్టణంలోని కూరగాయల వ్యాపారులు 20 సంవత్సరాలుగా చాలా ఇబ్బందులు పడుతున్నారని కూరగాయల వ్యాపారులకు మంచి రోజులు వచ్చాయని అన్నారు. బెల్లంపల్లి మార్కెట్లో ఉన్నటువంటి 108 స్టాల్లో కొంతమంది డబ్బులు చెల్లించలేదని, వారి కోసం నెల రోజులు సమయం ఇచ్చి వారి స్థానంలో మరికొందరిని తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. బెల్లంపల్లి పట్టణంలో ఉన్నటువంటి మురికి కాలువలను వెంటనే శుభ్రం చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా వచ్చిన ఎంపీ గడ్డ వంశీకృష్ణను కోరుతూ బెల్లంపల్లి నియోజకవర్గం లో పోడు భూముల సమస్య ఉందని దానిని ఢిల్లీలో మాట్లాడి పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. బెల్లంపల్లి అభివృద్ధి కోసం 450 కోట్ల రూపాయలతో ఎల్లంపల్లి టు బెల్లంపల్లి మంచినీటి పథకం ప్రారంభించుకోవడం జరిగిందని త్వరలోనే బెల్లంపల్లి ప్రజలకు గోదావరి నీరును అందిస్తామని అన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ఫోటోగ్రాఫర్స్ ఎన్నికలు

**భూపాలపల్లి, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ఫోటోగ్రాఫర్స్ సార్వత్రిక ఎన్నికల భాగంగా ఎస్కే హుస్సేన్ గారి ప్యానల్ బల్బు గుర్తుపై ఓటు వేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర శాసన సభ్యత్వం ఉన్న ప్రతి సభ్యుడు తీర్మానం చేసి ప్రకటించారు. మార్పు కోసం ఒక అవకాశం ఎస్కే హుస్సేన్ ఇవ్వాలని అందరూ తీర్మానించుకున్నారు. ఈ కార్యక్రమంలో మెయిన్ పోస్ట్‌ను విడుదల చేస్తూ అధ్యక్ష అభ్యర్థి ఎస్కే హుస్సేన్ ప్రధాన కార్యదర్శిగా లాడే రవి కోశాధికారిగా భీమిడి మాధవ రెడ్డి ఫోటో గ్రఫీ రాష్ట్ర ఎలక్షన్లలో వీరు నిలబడ్డారు. అన్ని మండలాలు పూర్తి మద్దతు ప్రకటిస్తూ ఎస్కే హుస్సేన్ గారి ప్యానల్ బల్బు గుర్తు మీద ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపిస్తామని హామీ ఇచ్చారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370